
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 28, నవంబరు 2024





జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పూర్వ పీడీ శీనారెడ్డి అక్రమాలను నిగ్గుతేల్చేందుకు సర్వం సిద్ధమైంది. ఆయన అవినీతి వ్యవహారాలపై విచారణ ప్రారంభం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో డ్వామా పీడీగా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదేవిషయమై ప్రభుత్వానికి కూడా భారీ సంఖ్యలో ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ అన్సారియాకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో ముగ్గురు సీనియర్ అధికారులతో త్రిసభ్య కమిటీని ఆమె నియమించారు.



బిగుస్తున్న ఉచ్చు

శీనారెడ్డి అక్రమాలపై విచారణకు అంతా సిద్ధం

డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీ నియామకం

- డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో భారీగా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదుల వెల్లువ
- ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం
- విచారణ చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు
- ఇప్పటికే కొనసాగుతున్న విజిలెన్స్ ఎంక్వయిరీ
- లోకాయుక్తలోనూ నమోదైన కేసు
- తాజాగా అన్సారియాకు మరికొన్ని ఫిర్యాదులు

ఒంగోలు, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో వివిధ సంస్థలు, ప్రభుత్వ శాఖల్లో అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి సాగించిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇటీవల వైద్యశాఖ, డీసీసీబీలలో విచారణ జరగ్గా.. ప్రస్తుతం డ్వామా వంతు వచ్చింది. సహకార శాఖకు చెందిన, జిల్లావాసి అయిన శీనారెడ్డి 2019-24 మధ్యకాలంలో దాదాపు నాలుగున్నరేళ్లపాటు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. అప్పట్లో వైసీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు నెరుపుతూ ఒకస్థాయి అధికార పార్టీ నేతలు, చివరకు కొందరు ఎమ్మెల్యేలను సైతం లెక్కపెట్టనంత స్థాయిలో శీనారెడ్డి వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. డ్వామాలో అంతా తానై ఇష్టారీతిన వ్యవహరించి భారీగా అవినీతికి పాల్పడటమే కాక ఒక వర్గం ఉద్యోగులు, సిబ్బందిని వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. పనిలో పనిగా తనకు గిట్టని శాఖ సిబ్బందిని సస్పెన్షన్లు, డిస్మిస్ చేసి అనంతరం వారి నుంచి

మిగతా 6వ పేజీలో

ప్రకాశం సజ్జల అంటూ..

సాధారణ ఎన్నికలకు ముందు శీనారెడ్డిని ఎన్నికల కమిషన్ సూచనలతో బదిలీ చేశారు. ఆ సమయంలో ఆయన.. 'మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుంది.. నేనే మళ్లీ పీడీగా వస్తాను' అంటూ డ్వామా కార్యాలయంలో డాంబికాలు కూడా పలికారన్న చర్చ సాగింది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం ప్రకాశం జిల్లా సజ్జలకు స్వాగతం అంటూ డ్వామా కార్యాలయం వద్ద కొందరు వెటకారంగా బ్యానర్లు కూడా కట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నేతలతో శీనారెడ్డి ఏస్థాయిలో అంటకాగారన్నది ఆ ఘటన తేటతెల్లం చేసింది. మరోవైపు డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో కింది నుంచి పైస్థాయి వరకు భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఉపాధి పనుల్లోపెద్దఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగినా పట్టించుకోలేదు. సోషల్ ఆడిట్ బృందాలు వాటిని గుర్తించినా సరే మండల స్థాయిలో నిర్వహించే ప్రజావేదికలలో వాటన్నింటినీ రద్దుచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పైగా అక్రమాలకు పాల్పడిన వారికి వెన్నుదన్నుగా నిలిచి తాను కూడా భారీగా లబ్ధిపొందారన్న విమర్శలు వెల్లువెత్తాయి.



పులి చంపిన ఎద్దు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఎద్దును చంపిన పెద్దపులి

- భయాందోళనలో ప్రజలు

కంభం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలోని నల్లమల అడవిలో మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసి చంపింది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. బీట్ ఆఫీసర్ రాజేష్ కథనం ప్రకారం.. వెలగలపాయ గ్రామానికి చెందిన చెల్లె వెంకట్రావు అనే రైతు సోమవారం తన రెండు ఎద్దులను సమీపంలోని అడవిలోకి మేతకు వదిలాడు. సాయంత్రానికి ఒక ఎద్దు మాత్రమే ఇంటికి వచ్చింది. రెండో ఎద్దు కోసం మంగళవారం ఉదయం వెతుకుతూ అడవిలోకి వెళ్లాడు. ఉల్లాకులసెల కొండ ప్రాంతంలో ఎద్దు కళేబరం కనిపించింది. దీంతో రైతు వెంకట్రావు ఫారెస్టు బీటు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన ఫారెస్టు అధికారులు రాజేష్, అబ్దుల్‌గఫార్, రంగారెడ్డిలు ఎద్దు కళేబరాన్ని పరిశీలించి పెద్దపులి దాడి చేసి చంపి ఉంటుందని భావించారు. నిర్ధారణ కోసం ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను అమర్చి వెళ్లారు. బుధవారం వచ్చి పరిశీలించగా మంగళవారం రాత్రి ఎద్దు కళేబరం వద్దకు పెద్దపులి వచ్చిన దృశ్యాలు కెమెరాలో రికార్డు అయ్యాయి. ఎద్దు విలువ రూ.80వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. ఫారెస్టు అధికారులు పంచనామా నిర్వహించి రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఇదేప్రాంతంలో గతంలో రెండు ఎద్దులపై పెద్దపులి దాడి చేసి చంపిన విషయం విదితమే. దీంతో కాపరులు తమ పశువులను అడవిలోకి మేతకు వదిలేందుకు భయపడుతున్నారు.



విజయ్‌పాల్‌ను గుంటూరుకు తరలించే ముందు పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ దామోదర్

రాత్రంతా స్టేషన్‌లోనే..

- గుంటూరు కోర్టులో విజయ్‌పాల్‌ను హాజరుపరిచిన పోలీసులు
- సాయుధ బలగాల భద్రత మధ్య తరలింపు

ఒంగోలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను అరెస్టు చేసిన ఎస్పీ దామోదర్ మంగళవారం రాత్రి ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రంతా అక్కడే ఉంచారు. ఉదయం విజయ్‌పాల్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక ఇచ్చారు. దీంతో గుంటూరు సీఐడీ కోర్టుకు తరలించేందుకు అంతా సిద్ధం చేశారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత తాలూకా సీఐ అజయ్‌కుమార్ నేతృత్వంలో విజయ్‌పాల్‌ను పటిష్ట భద్రత మధ్య ఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అక్కడ 11 పేజీల రిమాండ్ రిపోర్టును ఎస్పీ అందజేశారు. 2.45కు గుంటూరు బయల్దేరారు. ఒక సీఐ, ఎస్ఐ, ఆర్ఎస్ఐతోపాటు పది మంది సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు భద్రతగా ఉన్నారు.

స్టేషన్‌లో చాప, దుప్పటి

విజయ్‌పాల్‌ను మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు అరెస్టు చేసిన తరువాత ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే. అక్కడ మొదటి అంతస్తులో ఓ గదిలో పడుకునేందుకు చాప, దుప్పటి, దిండు ఇచ్చారు. ఆయన భద్రత కోసం ఆరుగురు సాయుధ పోలీసులను నియమించారు. బుధవారం ఉదయం, మధ్యాహ్నం విజయ్‌పాల్‌కు సాధారణ భోజనం ఏర్పాటు చేశారు. ఆయన తన వెంట నిత్యం వినియోగించుకునే మందులు, అదనంగా ఓ బ్యాగ్‌లో దుస్తులు తెచ్చుకున్నారు. గుంటూరు కోర్టులో సాయంత్రం హాజరుపరచగా అక్కడ విజయ్‌పాల్ రిమాండ్‌పై వాదనలు జరిగాయి. అనంతరం న్యాయాధికారి వచ్చేనెల 10 వరకు రిమాండ్ విధించారు. మరలా విచారణ కోసం పోలీసు కస్టడీ కోరే అవకాశం ఉందని సమాచారం.



రైతులకు అమ్ముతున్న నాసిరకం గుళికలు

నకిలీ గుళికల దందా..

- రూ.లక్షలు నష్టపోయి లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు

6

మేడపిలో డీఏవో కలిసి ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఎన్‌ఎస్‌వో బృందం



ఈ-పంట నమోదుపై తనిఖీలు

- జిల్లాలో ఎన్ఎస్‌వో బృందం పర్యటన
- పలుచోట్ల పంటల పరిశీలన

ఒంగోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదు వాస్తవికతపై కేంద్రప్రభుత్వ సంస్థ తనిఖీలు చేస్తోంది. అందులో భాగంగా జాతీయ శాంపిల్ సర్వే సంస్థకు చెందిన నెల్లూరు, కడప కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్, రామకృష్ణలు జిల్లాలో పర్యటిస్తున్నారు. బుధ, గురువారాలలో ఈ బృందం స్థానిక వ్యవసాయ, ప్రణాళిక శాఖల అధికారులతో కలిసి మూడు మండలాలలోని పలు గ్రామాలలో పరిశీలన చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) సిహెచ్.శ్రీనివాసరావుతో కలిసి ముండ్లమూరు, త్రిపురాంతకం మండలాలలో పర్యటించి ఈ పంట నమోదు పరిశీలించింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన రైతులకు పరిహారం అందజేత, ఇతర వ్యవసాయ పథకాలకు ఈ-పంట నమోదు కీలకంగా మారిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాయి.

ఓటీపీతో ఈకేవైసీ చేయాలి

నిబంధనల ప్రకారం ప్రతి రైతుకు చెందిన పొలంలో ఏ సర్వే నెంబరులో ఏ పంట సాగు చేశారన్నది ఫొటోతో సహా వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. అనంతరం సదరు రైతు బయోమెట్రిక్ లేదా సెల్‌ఫోన్ నుంచి ఓటీపీ ద్వారా మిగతా ఈకేవైసీ చేయాలి. అలా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 97.80శాతం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదించారు. ఆ సీజన్‌లో 4.99 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి సుమారు 3.93లక్షల ఎకరాలలో పంటలు వేశారు. అందులో లక్షా 40వేల మంది రైతులకు చెందిన 3.85లక్షల ఎకరాలకు సంబంధించి ఈ-పంట నమోదుతోపాటు ఈకేవైసీ కూడా చేశారు.

ఖచ్చితత్వ పరిశీలనకు అధికారులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ పంట ఖచ్చితత్వ పరిశీలనను కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఎస్‌వో సంస్థ అధికారులు తనిఖీ చేస్తున్నారు. పంట సాగు చేసిన భూమిలో ఈ పంట నమోదు జరిగిందా? లేదా?.. వేసిన పంటనే నమోదు చేశారా? లేక ఒక పంట వేస్తే మరొక పంట నమోదు చేశారా, అసలు పంట వేయకుండా వేసినట్లు చూపుతున్నారా? అన్న అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అందులోభాగంగా బుధవారం ముండ్లమూరు మండలం వేంపాడు, త్రిపురాంతకం మండలం రాజుపాలెం, త్రిపురాంతకం గ్రామాల్లో ఈ-పంట నమోదును పరిశీలించారు. గురువారం హెచ్ఎంపాడు మండలంలో పరిశీలించి సాయంత్రం ఒంగోలులో వ్యవసాయ, ప్రణాళికశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఉపాధి కూలీల కుటుంబాలకు 'ఉన్నతి'

- జాబ్‌కార్డు కలిగిన వారి పిల్లలకు నైపుణ్య శిక్షణ
- ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు
- వంద పని దినాలు పూర్తి ప్రామాణికం

మర్రిపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉపాధి కూలీల కుటుంబాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ఉన్నతి పథకాన్ని చేపట్టింది. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి జీవనోపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆయా రంగాల్లో 90 రోజులు శిక్షణ ఇస్తారు. ఆ సమయంలో రోజుకు రూ.300 చొప్పున పారితోషికం చెల్లిస్తారు. శిక్షణ పొందే యువతీయువకులకు అవసరమైన మెటీరియల్‌తోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. శిక్షణలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు ఇస్తారు. ఆయా రంగాలకు సంబంధించిన ప్రైవేటు సంస్థల్లో వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తారు.

31 రంగాల్లో 215 కోర్సుల్లో శిక్షణ

ఉన్నతి కార్యక్రమంలో భాగంగా 31 రంగాల్లో 215 కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులైనా, ఫెయిల్ అయినా అర్హులు. దీర్ఘకాలం ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ఆధారపడకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ఉన్నతి ప్రధాన ఉద్దేశం. మర్రిపూడి మండలంలో 12వేల జాబ్‌కార్డులు కలిగిన 19వేల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. గత ఏడాది 100రోజుల పనికాలం పూర్తి చేసుకున్న కుటుంబాలు 120 వరకూ ఉన్నాయి. అందులో 70 కుటుంబాలలో శిక్షణకు అర్హత కలిగిన యువతీయువకులు ఉన్నారు. ఉపాధి హామీ సాంకేతిక సిబ్బంది, క్షేత్రసహాయకులు ప్రత్యేక సర్వే చేసి వీరిని గుర్తించారు. వారంతా శిక్షణకు హాజరయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఒంగోలులో రూట్‌సెట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని ఏపీవో రాంబాబు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పింఛన్ల కోసం రూ.122.22 కోట్లు

- విడుదల చేసిన ప్రభుత్వం
- ఈనెల 30న పంపిణీ



ఒంగోలు నగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 2,86,034 మందికి ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.122.22 కోట్లను విడుదల చేసింది. డిసెంబర్‌కు పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్మును ఒకటో తేదీ సెలవు కావడంతో ఈనెల 30వ తేదీనే ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పంపిణీని ప్రారంభిస్తారని ఆమె వివరించారు. నవంబరులో పంపిణీ చేసిన పింఛన్ సొమ్మును తీసుకోని 1,283 మందికి ఈనెల 30న రెండు నెలలకు కలిపి అందజేస్తారని వెల్లడించారు. 30వతేదీన అందుబాటులో లేని పింఛన్‌దారులకు డిసెంబర్ రెండో తేదీన ఇస్తారని తెలిపారు.

ఆర్జీవీ వీడియో కలకలం



- బెయిల్ పిటిషన్ నేటికి వాయిదా
- గాలిస్తున్న పోలీసు బృందాలు

వివరాలు మెయిన్‌లో..

కీలకం కానున్న కాల్‌డేటా

టంగుటూరులో వివాహిత హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

7

మోక్షగుండం

- విశ్వేశ్వరయ్య స్ఫూర్తి.. నిత్య చైతన్య దీప్తి
- ఉన్నత స్థాయిలో మోక్షగుండం వాసులు
- ఉద్యోగ, వ్యాపారాల్లో గ్రామస్థులు ముందడుగు
- ప్రతి ఇంటిలోనూ ఉద్యోగులే

7



బిగుస్తున్న ఉచ్చు

(5వ పేజీ తరువాయి)

లబ్ధిపొంది తిరిగి పోస్టింగులు ఇచ్చేవారని సమాచారం. ఇక తన హోదాకు మించి ఆఫీసు వాహనాల వాడకం, రోస్టర్ పాటించకుండా నియామకాలు ఇతర అనేక అంశాలలో పెద్దఎత్తున అరాచకాలు చేశారని తెలిసింది. కాగా ప్రభుత్వం మారిన తరువాత ఈ అంశాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒంగోలుకు చెందిన డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఈదర మోహన్ పలు అంశాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా డ్వామాలో శీనారెడ్డి కాలంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి సంబంధిత శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గతంలోనే కోరారు.

సీఎంకు ఫిర్యాదు చేసిన దామచర్ల

శీనారెడ్డి అవినీతి, అక్రమాలపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఏకంగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి కూడా ఈదర మోహన్ తీసుకెళ్లడంతో ఆమె కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ఫిర్యాదులపై విజిలెన్సు విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. ఇక పొదిలికి చెందిన మహిళా న్యాయవాది ఒకరు శీనారెడ్డిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా ప్రస్తుతం విచారణకు వచ్చింది. అలాగే మరో నలుగురైదుగురు ఇతర వ్యక్తులు, డ్వామాలోని కొందరు ఉద్యోగులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పలువురు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా శీనారెడ్డి వ్యవహారాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టిలో పెట్టారు.

సమగ్ర విచారణకు ఆదేశం

డ్వామాలో శీనారెడ్డి కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని నాలుగురోజుల క్రితం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి లేఖ వచ్చింది. దీనిపై స్పందించిన ఆమె విచారణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. ఇటీవల డీఎల్‌డీవో ఉషారాణి, అలాగే పీడీసీసీ బ్యాంకులో అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావుకు ఆ బాధ్యత అప్పగించారు. ఆయన నేతృత్వంలో మరో ఇద్దరు సీనియర్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని విచారణ కోసం నియమించారు. ఒకట్రెండు రోజుల్లో ఈ కమిటీ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

'మక్కెనవారిపాలెం చెరువు'కు వేలం

సంతమాగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కనవారిపాలెం గ్రామంలో 24-25,-26 సంవత్సరానికి సంబంధించి చెరువులో చేపల పెంపకం లీజు వేలం పాటను బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ శివకృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ పాటగా రూ.లక్షా39,000వేల నుంచి ప్రారంభంకాగా ముగ్గురు పాల్గొన్నారు. మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన నాగుపోతు కొండలు రూ.1,45,000 పాడి కైవసం చేసుకున్నారు. సుమారు ఈ చెరువు 8 ఎకరాల 83 సెంట్ల విస్తీర్ణంలో ఉందని కార్యదర్శి నాగార్జున తెలిపారు.

రికార్డులను పరిశీలించిన డీఎస్పీ

మార్టూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ జీ రామాంజనేయులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన వివరాలను సీఐ ఎం.శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాటిలో కొన్నింటికి సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. ఇంకా మండలంలో పలు విషయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో డీఎస్పీ కొబ్బరి మొక్కలను నాటారు. తొలుత స్టేషన్‌కు విచ్చేసిన డీఎస్పీకి సీఐ శేషగిరిరావు, సంతమాగులూరు సీఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ జీవీఎస్ చౌదరి, ఎస్ఐ సైదా, ఆధ్వర్యంలో ఏఎస్ఐ బాషాలు, పోలీసు సిబ్బంది గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.

మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న వాడరేవుకు చెందిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద 12మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచుగా దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేరస్థులు తీరు మార్చుకోకుంటే శిక్షలు తప్పవన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవుపలికారు.

మల్లె వాసన కరువే..!

- కనుమరుగవుతున్న సాగు
- కూలీల కొరత, గిట్టుబాటు ధరలు లేక దూరమవుతున్న రైతులు
- నాడు 200 ఎకరాల్లో నేడు 20 ఎకరాలకే పరిమితమైన తోటలు

మేదరమెట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అందరికీ సువాసన పంచే మల్లెలు.. రైతులకు మాత్రం లాభాలను పండించలేకపోయాయి. అన్ని శుభ కార్యాల్లో మహిళలు ఎంతో మక్కువతో ధరించే మల్లెలు క్రమేపీ ఈ ప్రాంత కరువవుతున్నాయి. మండలంలోని మల్లె సాగు క్రమేణా కనుమరుగు అవుతున్నది. గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మించక ముందు సుమారు 300 ఎకరాలకు పైగా మల్లె తోటలు సాగు అయ్యేవి. రిజర్వాయర్ నిర్మాణంతో కొంత భూమి ముంపులో పోగా అందులో మల్లెతోటలు కూడా ఉన్నాయి. ఒక్క తమ్మవరం గ్రామంలో దాదాపు 200 ఎకరాలకు పైగా మల్లె తోటలు సాగులో ఉండేవి. ప్రస్తుతం 20ఎకరాల లోపే మల్లె తోటలు సాగులో ఉన్నాయి. ఐదారు సంవత్సరాల నుంచి క్రమేపీ మల్లె సాగును రైతులు తగ్గించుకొని వస్తున్నారు. ఉదయానే మల్లె పూలు కోయడానికి కూలీలు దొరకకపోవడం, అధికంగా పురుగు మందులకు ఖర్చులు పెరగడం, సాగులో ఉన్న మల్లె రకాలు ఎక్కువ సంవత్సరాలు పూలు పండకపోవడం వంటి కారణాలతో రైతులు మల్లె సాగుకు దూరం అవుతున్నారు. వీటి అన్నింటికన్నా దళారులు, మార్కెట్ మాయజాలంతో గిట్టుబాటు ధర లేకపోవడం, దళారులు రైతులకు సొమ్ము ఎగ్గొట్టడం మరో ప్రధాన కారణం. తమ్మవరం చుట్టుపక్కల వివిధ రకాల పరిశ్రమలు రావడం, పెద్ద ఎత్తున గిడ్డంగులు నిర్మించడంతో భూమి పూర్తిగా తగ్గి పోయింది. ఉన్న కొద్దిపాటి భూమిలో రైతులు పాడి సాగుకే మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో మల్లె తోటలు కన్పించవని రైతులు అంటున్నారు.



తమ్మవరంలోని సాగులో ఉన్న మల్లె తోటలు

మిర్చిపై తగ్గిన మక్కువ

- వరుస నష్టాలే కారణం
- పెరిగిన పెట్టుబడి, తగ్గిన ధరలతో వెనక్కి
- పొగాకు సాగుపై దృష్టి సారించిన రైతులు

ఇంకొల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాంతంలో గత రెండేళ్లుగా మిర్చి సాగు తగ్గింది. గతంలో ఎటుచూసినా పొలాల్లో మిర్చి కనిపించేది. రైతులు నష్టాలను చవిచూడడంతో మిర్చి సాగుకు దూరమవుతున్నారు. మిర్చి రైతులు శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచినప్పటికీ గిట్టుబాటు ధర రాకపోవడంతో ఈ ఏడాది మిర్చి సాగుపై రైతుకు ఆసక్తి తగ్గింది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధరలు లేకపోవడం ప్రధానకారణమైతే మరోవైపు పెట్టిన పెట్టుబడులకు తగ్గట్టుగా దిగుబడులు రాకపోవడంతో రైతులకు మిర్చి సాగుపై ఆసక్తి తగ్గింది. దీంతో గత ఏడాది పొగాకుకు అంతర్జాతీయంగా మంచి రేటు ఉండడంతో పొగాకు సాగు చేశారు. మంచి లాభాలు పొందారు. అదే ఆలోచనతో ఈ ఏడాది కూడా మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలలో ఒడిదొడుకులు ఉండడంతో మండలంలో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచనలు చేస్తున్నప్పటికీ రైతులు పొగాకుపై మగ్గు చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం కనబడుతోంది.



ఇంకొల్లు ప్రాంతంలో సాగు చేసిన మిరపపైరు

నకిలీ గుళికల దందా..

తర్లుపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నకిలీ గుళికలు, పురుగు మందుల దందా యథేచ్ఛగా సాగుతోంది. ఈ దందాపై అధికారులు దృష్టిసారించిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. దీంతో రైతన్నలు లక్షలాది రూపాయల నష్టాన్ని చెవిచూడాల్సి వస్తోంది.

మండలంలోని కలుజువ్వలపాడు గ్రామానికి చెందిన రైతు కొండలు తాను సాగుచేసిన మొక్కజొన్న పంటకు మార్కాపురంలోని ఒక ఫెర్టిలైజర్ షాప్‌లో గుళికల ప్యాకెట్లను కొనుగోలు చేశారు. 4 కేజీల ప్యాకెట్ రూ.700 వెచ్చించాడు. వాటిని తమ పొలంలో వేసేందుకు ఓపెన్ చేయగా మొత్తం ఇసుకే దర్శనమిచ్చింది. దీంతో రైతు లబోదిబోమంటూ పక్క రైతులకు సమాచారం ఇచ్చాడు. రైతులందరూ కలిసి వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుకు సమస్యను వివరించారు. గుళికల్లో 99 శాతం ఇసుకనే ఉంటుందని దీనికి తాము ఏమి చేయలేమంటూ చేతులెత్తాశాడు. ప్రస్తుతం పశ్చిమ ప్రకాశంలో ఎక్కువగా రైతులకు బయో మందులు అంటగడుతున్నారు. పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకితే దుకాణాలకు వెళ్లే రైతులకు బయోమందులు అంటగడుతున్నారు. ఇటీవల హైదరాబాద్ నుంచి నకిలీ బయోమందులు తీసుకొచ్చి విచ్చలవిడిగా విక్రయించి రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతులు అడిగిన మందు ఏ ఒక్క రైతుకు ఇవ్వరు. కొనుగోలు చేసిన పురుగు మందుకు, ఎరువులకు రసీదులు ఇచ్చిన దాఖలాలు లేవు. ఎరువులు కూడా అధిక ధరలకు అమ్ముతుంటే వ్యవసాయాధికారులు నిమ్మకు నీరెత్తినెట్లు వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని కొందరు రైతులు వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తే మీరు వారి వద్ద అప్పు తెచ్చుకోవడంతో ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని చెప్పడం గమనర్హం. పశ్చిమ ప్రకాశంలోని నకిలీ పురుగు మందుల దందాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



ఇసుక లాగా ఉన్న గుళికలు



నకిలీ గుళికలను చూపిస్తున్న రైతు

బయోలో అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతించింది

బయో కంపెనీ మందులు ఫెర్టిలైజర్ యజమానులు అమ్ముకునేందుకు ప్రభుత్వమే అనుమతించింది. అనుమతించిన వాటి విక్రయాలపై మేమేం చేయలేం. గుళికల ప్యాకెట్‌లలో 98.6 శాతం ఇసుకనే ఉంటుంది.

ఏడీఏ బాలాజీ నాయక్



అరికట్లవారిపాలెం, చందలూరు గ్రామాల మధ్య నడిమి వాగుపై కూలిన వంతెన



చిల్లకంప, చెట్లతో ఛిద్రమైన అరికట్లవారిపాలెం చందలూరు రహదారి

నడిమి వాగుపై వంతెన నిర్మాణమెప్పుడో

- పునర్ నిర్మాణానికి నోచుకోని వైనం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న రైతులు, కూలీలు

పంగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నడిమి వాగుపై వంతెన కూలడంతో రాకపోకలు సాగించలేక అరికట్లవారిపాలెం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా పునర్ నిర్మాణానికి నోచుకోలేదని గ్రామ రైతులు, మహిళలు వాపోతున్నారు. మండలంలోని అరికట్లవారిపాలెం, చందలూరు గ్రామాల మధ్య కొన్నేళ్ల కిందట తుఫాన్‌తో తలెత్తిన వరద తాకిడికి నడిమి వాగుపై వంతెన కూలిపోయింది. వంతెన కూలడంతో నడిమి వాగుకు అవతలి వైపు ఉన్న పొలాల్లో పంట సాగుకు అరికట్లవారిపాలెం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన ఉన్న సమయంలో కూత వేటు దూరంలో పొలాలకు చేరుకునే రైతులు వంతెన కూలి వాగుకు పెద్ద గండి పడడంతో ఏడెనిమిది కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సిన పరి పరిస్థితి ఏర్పడింది. నిత్యం పొలం పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు వాగుపై వంతె కూలడంతో ఏర్పడిన గండిని దాటి పొలాలకు చేరుకోవడం నరక ప్రాయంగా ఉందని వాపోతున్నారు. చందలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వ్యవసాయ రుణాల కోసం రైతులు, కెనరా బ్యాంక్‌లో కార్యకలాపాల కోసం రాకపోకలు సాగించే పొదుపు సంఘాల మహిళలు చందలూరు చేరుకోవాలంటే పంగులూరు వైపుగా తిరిగి వెళ్లడానికి సరైన వసతి లేక యిబ్బంది పడుతున్నారు. నడిమి వాగుపై వంతెన పునర్ నిర్మించడంతో పాటు చందలూరు, అరికట్లవారిపాలెం మధ్య చిల్లకంప తొలగించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూల సాగు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పూలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా దీప్తి మాట్లాడుతూ బంతి, చామంతి, రోజా, మల్లె, సంపంగి పూల సాగుకు ఎకరాకు రూ.6400 ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఉద్యాన పంటలలో మల్చింగ్ పేపర్ వేసుకునేందుకు హెక్టారుకు రూ.16వేలు అందిస్తుందని తెలిపారు. 5ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 90శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు రాయితీపై అందిస్తుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. రబీ ఈ పంట నమోదు ప్రారంభం అయిందని రబీలో పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ నాగినేని రామకృష్ణ, అన్నబత్తిన అజయ్ బాబు, యర్రా నరసింహారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు వీ రేష్, మార్కెట్ కమిటీ అసిస్టెంట్ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు సాగు విధానంలో ఆధునిక పద్ధతులు పాటించాలని మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పంగులూరు, మల్లవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడీఏ రైతులతో కలసి వరి, శనగను పరిశీలించారు. సాగులో సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం సాధించే అవకాశం ఉందన్నారు. రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భాస్వరం ఎరువు ఆఖరి దుక్కిలోనే వేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలను అనుసరించి రసాయణ ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంతో పాటు ప్రకృతిలో లభించే ఆకులు, అలములతో తయారు చేసుకనే జీవామృతం వంటి కషాయాలు పైరుపై పిచికారీ చేసి తెగుళ్లు, పురుగులు నివారించాలన్నారు.

రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి శనగకు ఎకరాకు రూ.54, మొక్కజొన్నకు రూ.105, వరికి రూ.126 చెల్లించి పంటల బీమా చేయాలని, ప్రతి రైతు సాగు చేసిన పంటలను సేవా కేంద్రాలలో నమోదు చేయించాలని సాంకేతిక వ్యవసాయాధికారి వెంకటరమణ కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది అలగ్జాండర్, నవనీతం తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

అవీఇవీ

29 నుంచి సర్వే

సన్న, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాల సేకరణ



మాట్లాడుతున్న ఎంపీడీవో బత్తిని సింగయ్య

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈనెల 29వ తేదీ నుంచి చిన్న, సన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే జరుగుతుందని, సచివాలయ ఉద్యోగులు దీనిపై అవగాహన కలిగి ఉం డాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సర్వేపై శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ సర్వే ద్వారా పరిశ్రమల ప్రస్తుత స్థితిగతులు తెలుసుకోవడం వాటి అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకోవడం కోసం, వారికి అవసరమైన శిక్షణ, ఇతర సదుపాయాల కల్పన కోసం సర్వే ద్వారా వచ్చిన వివరాలను ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని పరిశ్రమల యజమానులు అందరూ సర్వే సిబ్బందికి సహకరించి అవసరమైన సమాచారం అందించాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం సచివాలయ సిబ్బందికి పరిశ్రమల సర్వేపై శిక్షణ ఇ వ్వడం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు.

వైద్యశాలలో డెలివరీపై కౌన్సెలింగ్

బల్లికురవ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు సిపాయి కాలనీకి చెందిన నిండు గర్భిణికి వైద్యశాలలో చికిత్స చేయించుకోకుండా ఇంటికి రావడంతో బుధవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి, వైద్య సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఆమెకు రక్తహీనత ఉండడంతో ఈ నెల 4వ తేదీన వైద్య సిబ్బంది ఆమెను ఒంగోలు రిమ్స్‌కు డెలివరీ కోసం పంపించారు. ఆమె అక్కడ ఉండడంతో భర్త ఒంగోలు వెళ్లి డెలివరీ అక్కడ చేసేది ఏంటీ అని స్వగ్రామం తీసుకువచ్చారు. ఈ విషయాన్ని గర్భిణీ పరిస్థితిని పోలీసుకు వైద్య సిబ్బంది తెలియజేశారు. దీంతో ఎస్సై యువతి ఇంటికి వెళ్లి ఆమె వైద్యశాలలోనే డెలివరీ చేయించుకునేలా భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి వైద్యశాలకు వెళ్లేలా చేశారు. దీంతో గర్భిణిని 104లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం మధ్యా హ్నం 2 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ హాజరవుతారని, ప్రధానోపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని, ఎవరికీ మినహాయింపు లేదన్నారు. కాగా సింగిల్ టీచర్స్ ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలు సమావేశానికి హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు. డిసెంబరు 7వ తేదీన ఉపాధ్యాయులు, తల్లి దండ్రుల ప్రత్యేక సమావేశం ఉన్నందున దానికి సన్నాహక సమావేశం గురువారం జరుగుతుందని ఆయన తెలిపారు.

అద్దంకి పాలిటెక్నిక్‌లో 29న జాబ్ మేళా

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్ బాబు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐసీఐసీ బ్యాంక్, ఏయూ బ్యాంక్, ఆపోలో టైర్స్, ఇలాగిరి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరవుతాయని, 100కు పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జీతం విద్యార్హతను బట్టి 10వేల నుంచి 20వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ విభాగాలు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు వారి బయోడేటాతో, విద్యార్హత సర్టిఫికెట్‌ల జిరాక్స్, ఆధార్, పాస్‌ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9542970871ని సంప్రదించాలని తెలిపారు.

గోమాతల సంరక్షణ అందరి బాధ్యత

శ్రీశైల దేవస్థానానికి రూ1,02,516 అందజేత



ఆవులకు పూజలు చేస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోవుల పరిరక్షణ అందరి బాధ్యత అని చీరాల శ్రీభ్రమరాంబికా సేవా సమితి చీరాల ప్రతినిధులు అన్నారు. శ్రీశైల దేవస్థానానికి గో సంరక్షణలో భాగంగా గ్రాసం నిమిత్తం రూ.1,02,516ను దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌ను కలిసి అందజేశారు. అంతేకాకుండా రూ.1.50లక్షల విలువైన 21 గరుకు స్తంభాలను కాళహస్తి గోశాలకు, గో సంచార ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాతలతో పుణ్య కార్యాలు నిర్వహించేటప్పుడు గరుకు స్తంభాలకు వాటితో అదుపు చేసి నిర్వహించేందుకు వెసులుబాటు ఉం టుందనిచెప్పారు. ఈవో సమితి ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ మహాలక్ష్మి, సెక్రటరీ అబ్బరాజు శ్రీనివాస్ కుమార్, కో-ఆర్డినేటర్స్, సేవకులు పాల్గొన్నారు.

1న కార్తీక అమావాస్య పూజలు

వేటపాలెం(చీరాల), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పంచాయతీ పరిధిలో వేంచేసిఉన్న శ్రీ కనక నాగవరప మ్మ అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 1వ తేదీ ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పోలిని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొనాలని ఆయన కోరారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలకు కుర్చీలు, ఇతర అవసరమైన సామగ్రిని అందజేశారు. అశహరి వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు రోటరీ సభ్యులు హరిప్రసాద్ సౌజన్యంతో పట్టణంలోని గాజులపాలెం ప్రాథమిక పాఠశాలకు కుర్చీలు, స్టీల్ వాటర్ క్యాన్, హ్యాండ్ వాష్ బాటిల్స్‌ను పాఠశాల హెచ్‌ఎం కర్నాటి నాగమణికి అందజేశారు. దర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈపంట నమోదును పరిశీలించిన డీఏవో

త్రిపురాంతకం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసిన పంటలను ఈ-పంట నమోదు చేసే ప్రక్రియను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మండలంలోని మేడపిలో బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులందరూ తమ పంటలను తప్పనిసరిగా ఈపంటలో నమోదు చేసుకోవాలని కోరారు. సీఈఎస్‌సీ కేంద్రాలలో భీమా ప్రీమియంను చెల్లించాలని తెలిపారు. ఎకరానికి వరికి రూ. 215, మినుముకు రూ. 102, మిరపకు రూ. 525, మొక్కజొన్నకు రూ. 105, జొన్నకు రూ. 60, శనగకు రూ. 368 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నీరజ, వీఏఏ మస్తాన్‌నాయక్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లో ఎంతో ప్రాధాన్యత గల ఊరుగా పేరు లిఖించుకుంది..


ఎందరో గొప్ప మేధావులకు జన్మనిచ్చిన గ్రామంగా ఖ్యాతిని సొంతం చేసుకుంది..

త్రేతాయుగంలో వశిష్ట మహర్షి స్వయంగా ప్రతిష్ఠించిన శివలింగం ఉన్న ఆధ్యాత్మిక గ్రామంగా గుర్తింపు పొందింది..

నల్లమల అడవి అందాల నడుమ ఉన్న ఆ గ్రామంలో ఒకప్పుడు అందరూ రైతు బిడ్డలే.. రాన్రాను ఒకరిని చూసి ఒకరు.. వారిని చూసి మరొకరు ఇలా ఆదర్శంగా తీసుకుని ఎదిగారు.. అన్నీ రంగాల్లోని ఉన్నత స్థాయి ఉద్యోగాలు, ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లుగా, పలువురు సాహిత్యంపై పట్టు సాధించి అనేక రకాల గ్రంధాలు రచించి కవులుగా గుర్తింపు మండలంలోని మోక్షగుండం గ్రామంపై ప్రత్యేక కథనం...

పుట్టిన గ్రామంలోని పాఠశాల దత్తత

బోదనపు వెంకట మోహన్ రెడ్డి, సెయింట్ సాఫ్ట్‌వేర్ అధినేత



నేను పుట్టిన గ్రామమైన మోక్షగుండాన్ని దత్తత తీసుకున్నా. ప్రతిభ కలిగిన విద్యావంతులు ఏడుగురికి నెలకు రూ.70వేలు చెల్లించి పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన చదువు చెప్పిస్తున్నా. క్రీడా స్థలం కోసం 2 ఎకరాలు కొనుగోలు చేసి పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నా. గ్రామంలో మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఉచితంగా పుస్తకాలు, లైబ్రెరీ ఏర్పాటు చేశారు. ఇప్పటికి సుమారు రూ.3కోట్లు తన ట్రస్ట్ నుంచి ఖర్చు చేశారు.



మోక్షగుండం గ్రామం వ్యూ

మోక్షగుండం

విశ్వేశ్వరయ్య స్ఫూర్తి.. నిత్య చైతన్య దీప్తి

- ఉన్నత స్థాయిలో మోక్షగుండం వాసులు
- ఉద్యోగ, వ్యాపారాల్లో గ్రామస్థులు ముందడుగు
- ప్రతి ఇంటిలోనూ ఉద్యోగులే
- చుట్టుపక్కల గ్రామాలకు ఎంతో స్ఫూర్తివంతంగా అడుగులు



గ్రామంలో ఏర్పాటు చేసిన విశ్వేశ్వరయ్య విగ్రహం

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకున్నా

దేశిరెడ్డి శశిధర్‌రెడ్డి, ఇంజనీరు




మోక్షగుండం గ్రామానికి చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరు ప్రపంచంలోనే మంచి ఇంజనీరుగా పేరు ప్రఖ్యాతలు గాంచారు. ఆయనది మా ఊరు కావడంతో ఆయనను ఆదర్శంగా తీసుకోని తాను పాట్నాలో ఐఐటీ చేసి ముంబయిలో పీహెచ్‌డీచేసి మైసూర్‌లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఇంజనీర్‌గా చేస్తున్నా.

బేస్తవారపేట, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం గ్రామంలో ఒకప్పుడు వ్యవసాయమే ప్రధాన వృత్తి. అందరూ దానిమీద ఆధారపడి జీవించినవారే. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన గ్రామం అది. దేశంలో ఎన్నో ఆనకట్టలు, నీటి ప్రాజెక్టల నిర్మాణాలకు ఆద్యుడు ఆయనే. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఎదగాలని గ్రామంలో పెద్దలు నూరిపోస్తుండడంతో ఒక్కొక్కరుగా పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరారు. కష్టపడి చదివి విజయశిఖరాలకు చేరుకున్నారు. వారిలో హైదరాబాద్‌లోని కిమ్స్ వైద్యశాలలో క్యాన్సర్ వైద్యులుగా పనిచేస్తున్న తమ్మినేని ప్రతాప్‌రెడ్డి, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో ఎముకల వైద్యులు దేమ రాజయ్యలు ఆ కోవకు చెందిన వారే. వీరు గ్రామంలో ప్రాథమిక విద్యను అభ్యసించి రోజుకు 5కిలోమీటర్లు నడిచి హైస్కూల్ విద్యను అభ్యసించినవారే.

ఉన్నత స్థాయిల్లో ఎందరో...

గ్రామంలో అనేకమంది ఉన్నత స్థాయి ఉద్యోగాలలో ఉన్నారు. బ్రిటీష్ కాలంలో పల్నాటి పోలిరెడ్డి(సర్కిల్‌పోలిరెడ్డి) ఎస్సైగా పనిచేశారు. అప్పట్లో పోలీస్‌శాఖలో కమాండెంట్‌గా పనిచేసిన బోధనపు నాగిరెడ్డి కుమారులు నేడు అనేక దేశాల్లో పలు వ్యాపారాలు చేస్తున్నారు. సెయింట్ సాఫ్ట్‌వేర్ అధినేత బొధనపు వెంకట మోహన్‌రెడ్డి, బోదనపు అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ తమ్మినేని కృష్ణారెడ్డి, రిటైర్డ్ జేడీఏ తమ్మినేని పెద్దిరెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్ పల్నాటి శివశంకర్‌రెడ్డి, వైద్యులుగా తమ్మినేని ప్రతాప్‌రెడ్డి, తమ్మినేని సిద్ధార్థరెడ్డి, దేమ రాజయ్య, తదితరులు రాణిస్తున్నారు. అలాగే ఈమధ్య కాలంలో మృతి చెందిన వారి జాబితాలో సుప్రీంకోర్టు న్యాయవాది పల్నాటి రామిరెడ్డి, రిటైర్డు డీఎఫ్‌వో ఉప్పాలూరి పోలయ్య, పశువైద్యశాలలో ఏడీగా పనిచేస్తున్న పల్నాటి మహాదేవారెడ్డి, పోలీస్ శాఖలో హైదరాబాద్‌లో ఎస్పీ స్థాయిలో రంగారెడ్డి, విద్యుత్‌శాఖలో రిటైర్డ్ ఎస్సీ తమ్మినేని శివారెడ్డి ఉన్నారు.



సెయింట్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఏర్పాటు చేసిన బోర్డు

కవులుగానూ ప్రసిద్ధి

గ్రామంలో చాలామంది సాహిత్యంపై పట్టు సాధించారు. బతుకుదెరువు కోసం ఉద్యోగాలు చేసుకుంటూ అనేక గ్రంథాలు రాశారు. అలాంటి వారిలో తాళ్లూరి నారాయణ మోక్షగుండం రామాయణం అనే కావ్యాన్ని రాశారు. ఈ కావ్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించారు. అక్కయ్య సూరి, చిలకల కృష్ణమూర్తి, చిలకల చిన్న వెంకటసుబ్బారెడ్డి తదితరులు కవులుగా ప్రఖ్యాతి గాంచి అనేక గ్రంథాలు రాశారు. సంస్కృతంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆర్మీ ఇంజనీరు వెంకటేశ్వర్లు నాలుగుసార్లు రాష్ట్రపతి అవార్డులు అందుకున్నారు. కన్నడ భాషలో మోక్షగుండం గ్రామ జీవిత చరిత్ర మైసూరులో ప్రచురించబడింది.

ఉద్యోగుల సంఖ్య కూడా ఎక్కువే

దేశంలో ఎక్కడ చూసినా ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాల్లో మోక్షగుండం గ్రామస్థులే ఉన్నారు. ఇంటికొకరు చొప్పున ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. రాష్ట్రం, ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా కర్నాటక రాష్ట్రాల్లో క్లాస్ 1కాంట్రాక్టర్లు ఉన్నారు. పశు వైద్యశాఖలో 8మంది, లెక్చరర్లుగా ఐదుగురు, ఉపాధ్యాయ వృత్తిలో 15 మంది, సైనికులుగా 70 మంది, బ్యాంక్‌లో నలుగురు, పలు ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో సుమారు 150 మందికి పైగా, విదేశాల్లో 30 మంది ఉద్యోగాలు చేస్తున్నారు. వారిలో విదేశాల్లోనే 10 మంది డాక్టర్ వృత్తిలో ఉన్నారు. 1936లో ఏర్పాటైన ప్రాథమిక పాఠశాల ఇప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ స్కూలు ప్రధానోపాధ్యాయ వృత్తిలో ఉన్న దేశిరెడ్డి రఘునాథరెడ్డిది ఆ గ్రామం కావడంతో ఆ పాఠశాలను ఎంతో ఆహ్లాదకరంగా పచ్చని చెట్లతో, అపరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

మోక్షగుండం ముక్తేశ్వరాలయం

త్రేతాయుగంలో వశిష్ఠ మహర్షి ఇక్కడ శివలింగాన్ని ఏర్పాటు చేశారని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ దేవాలయాన్ని దేవదాయశాఖ ఆధీనంలోకి తీసుకుంది. ఏటా శివరాత్రి పండుగ వైభవంగా జరుగుతుంది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తండ్రి శ్రీనివాస శాస్త్రి ఈ దేవాలయంలో నిత్య పూజలు జరిపారని వారికి ఇలవేల్పు ముక్తేశ్వరంగా పిలువబడుతోంది.



పాఠశాలలో పచ్చని చెట్లు

అడుగుకో గుంత..



మంగమూరుడొంక జంక్షన్‌లో గుంతలు



కర్నూలురోడ్డులో మాగుంట విగ్రహం వద్ద పెద్ద గుంతలు



కర్నూలురోడ్డు ఫ్లైఓవర్ కింద...



- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

గడిచిన ఐదేళ్లలో వైసీపీ పాలకుల నిర్లక్ష్యం... నగరపాలక సంస్థలో నిధుల కొరత వెరసి ప్రజలకు శాపంగా మారింది. ఒంగోలు నగరంలోని రహదారులు అధ్వానంగా మారాయి. పైపులైను రిపేరు పేరుతో, ఇంటర్నల్ కేబుల్ వేసేందుకు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేని గుంతలు ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేశారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో.. పేరుకు ఒంగోలు సిటీగా చెప్పుకోవడం తప్ప అభివృద్ధి జాడలు మరిచారు. కలెక్టర్, కమిషనర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు సైతం నిత్యం పర్యటిస్తున్నా అడ్డగోలుగా తవ్వి వదిలేసిన గోతులు వీరికి కనిపించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

కీలకం కానున్న కాల్‌డేటా

హైమావతి హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

టంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులో మంగళవారం వెలుగు చూసిన వివాహిత హైమావతి హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. మృతురాలితో పాటు ఆమె భర్త, ఇతర అనుమానితుల కాల్ డేటాను సేకరిస్తున్నారు. వారు ఎవరెవరితో ఏమి మాట్లాడారు అన్న విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీని ద్వారా హంతకులు ఎవరనేది తెలుసుకోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అప్పటికీ మిస్టరీ వీడకపోతే ఇతర కోణాలలో దర్యాప్తును కొనసాగించనున్నారు. హైమావతిది పేద కుటుంబం. ఆమె భర్త సైతం అనారోగ్యంతో ఉన్నారు. ఈనేపథ్యంలో ఆమెను దొంగలు హత్య చేసే అవకాశాలు చాలా తక్కువని, తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆ దిశగా విచారణ వేగంగా సాగుతోంది.

చేనుకు చీరలు రక్ష

వెలిగండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంటలు కాపాడుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. చేనుకు కంచెగా రంగురంగుల చీరలను ఉపయోగిస్తున్నారు. మండలంలోని మొగళ్ళూరు, మొగళ్ళూరు పల్లి, గోకులం, కంకణంపాడు, నాగిరెడ్డి పల్లి గ్రామాలకు చెందిన రైతులు ఎక్కువగా శనగ, మినుము, వరి పంటలను సాగు చేస్తారు. పంటను వేసిన దగ్గర నుంచి కోతకు వచ్చేవరకు పందుల బెడదనుంచి రక్షణకు రాత్రిళ్లు కొందరు రైతులు కాపలాకు సైతం వెళతారు. మండలంలో వెయ్యి ఎకరాల్లో శనగ పంటను సాగుచేశారు. పందుల బెడద నుంచి ఆ పంటను రక్షించుకొనేందుకు రంగురంగుల చీరలను చేను చుట్టూ కట్టారు. దీనితో పంటను రక్షించుకోవడం కొంతవరకు సాధ్యమని రైతులు తెలిపారు. రంగురంగుల చీరలను చూసిన పందులు పంటలోకి రావని రైతులు తెలిపారు.



మొగళ్లూరుపల్లిలో శనగ విత్తనాలు వేసిన పంట చుట్టూ చీరలు కడుతున్న రైతులు

ముళ్లకంపల్లో హద్దురాళ్లు

తూతుమంత్రంగా రీసర్వే

ప్రజాధనం వృథా

వెలిగండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'దేశంలోనే తొలిసారిగా భూములు రీసర్వే చేస్తున్నాం. భూ తగాదాలు శాశ్వతంగా రూపుమాపుతాం' అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. పూర్తి స్థాయిలో భూసర్వే జరగకపోవడంతో భూహక్కు రక్షణ చట్టం పథకం ముళ్లచెట్లకే పరితమైంది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సర్వే కార్యక్రమానికి తయారుచేసిన హద్దురాళ్ల సర్వే చేయకుండానే చెట్లల్లో పడవేశారు. రీసర్వే చేసిన చోట హద్దు రాళ్లు పాతడానికి వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని రైతులు అడ్డుకున్నారు. తరతరాలుగా సక్రమించిన భూములకు జగన్ బొమ్మ ఏంటని అప్పట్లో వారు మండిపడ్డారు. కొన్నిచోట్ల తొలగించారు మండలంలోని మొగళ్ళూరు, ఇమ్మడిచెరువు గన్నవరం, రాళ్ళపల్లి, నాగులవరం, కండ్రిక, వెదుళ్ళచెరువు తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ముళ్లకంపల్లో హద్దురాళ్లు దర్శనమిస్తున్నాయి. వెలిగండ్ల మండలంలో 12 గ్రామాల్లో 10వేల ఎకరాల్లో రీసర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. దీనిని బట్టి చూస్తే కనిగిరి నియోజవర్గం వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అరకొరగా సర్వే నిర్వహించి మొక్కుబడిగా అక్కడక్కడా హద్దురాళ్లను పాతారు. దీంతో ప్రజాధనం పెద్దఎత్తున వృథా అయ్యింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హద్దురాళ్లపై బొమ్మలు, పేర్లు తొలగించి రైతులకు అందించాలని శ్రీకారం చుట్టింది. గ్రామసభలు జరిగిన పంచాయతీలలో అధికారులు స్పందించి రీసర్వే జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని రైతులు కోరుతున్నారు.



ఇమ్మడిచెరువు పంచాయతీలో ముళ్లకంపల్లో ఉన్న హద్దురాళ్లు

ప్రమాదకరంగా పైప్‌లైన్ కాలువలు

విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రుల భయాందోళన ● త్వరగా కాలువలు పూడ్చి వేయాలని విజ్ఞప్తి ● పట్టించుకోని అధికారులు



రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న పైపులైన్ గోతులు

ఒంగోలు(రూరల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో తాగునీటి పైపులైన్‌లు ఏర్పాటు చేసేందుకు తవ్విన కాలువలు ప్రమాదకరంగా మారాయి. ఈ కాలువలు సుమారు ఐదు అడుగుల లోతున తవ్వారు. అయితే కాలువల సమీపంలోనే ఎయిడెడ్ ఉన్నత పాఠశాలు, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. నిత్యం విద్యార్థులు, చిన్నపిల్లలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. కానీ పైపులు వేసి పూడ్చివేయకపోవడంతో ఈ కాలువలు వర్షపునీటితో, మురుగుతో నిండిపోయాయి. దీంతో కాలువల్లో ప్రమాదవశాత్తు పిల్లలు పడితే మునిగిపోయే అవకాశం ఉంది. ఇప్పటికీ ఈ కాలువలు తవ్వి నెల రోజులు గడుస్తున్నది. పాఠశాలకు రాకపోకల సమయంలో పిల్లల కోసం ఉపాధ్యాయులు కాపలా ఉంటున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరగక ముందే పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు గృహాల నుంచి వచ్చే మురుగునీరు కాలువల్లో నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో స్కూళ్లలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాలువ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముస్లింల సంక్షేమానికి సహకారం

● ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి ఎల్లప్పుడు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. 2025 జనవరి 10, 11 తేదీలలో ఒంగోలు నగరం గుంటూరురోడ్‌లో గల ఐటీ కాలేజీ సమీపంలో జరగనున్న ఇస్తిమా ఏర్పాట్లను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయంలో, తాను ఎమ్మెల్యేగా ముస్లింల అభివృద్ధి కోసం కృషి చేశానని తెలిపారు. షాదీఖానా నిర్మాణం, ఈద్గా అభివృద్ధి, సొంత నిధులతో రంజాన్ తోఫా, అనే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. అదే విధంగా ఎల్లపుడు సహకారం అందిస్తానని దామచర్ల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ కపిల్‌బాషా, పఠాన్ హనీఫ్‌ఖాన్, షేక్ అజీజ్, షేక్ అమురుల్లా, కాలేషాబాబు, అల్లాభక్షు, మత పెద్దలు ముఫ్తి యార్, జిలానీ, సయ్యద్‌హమీద్, సాద్‌మౌలానా, ముజింబీల్ మౌలానా పాల్గొన్నారు.

జిల్లాలో రోడ్ల సమస్యలను పరిష్కరించాలి

● కేంద్రమంత్రిని కోరిన ఎంపీ మాగుంట

ఒంగోలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలోని రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలు సమస్యలు, అభివృద్ధి పనులను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కంభం-పాపినేనిపల్లి, మార్కాపురం-తర్లుపాడు, యర్రగొండపాలెం-దుర్గి, ఊళ్లపాలెం-వేములపాడు, ఎస్‌కేరోడ్డు-భైరవకోన, కనిగిరి-గుడిపాడు, కురిచేడు-దొనకొండ, నాయుడుపాలెం-ఒంగోలు-నంద్యాల రోడ్లు, కారుమంచి-ఈతముక్కల -మోటుమాల రోడ్డులో బకింగ్ హామ్ కెనాల్‌పై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు, త్రోవగుంట-చదలవాడ బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాల ఏర్పాటు, శానికవరం-దోర్నాల కుంట నేషనల్ హైవే నుంచి సర్వీస్ రోడ్ ఏర్పాటు మొదలైన విషయాలపై కేంద్ర మంత్రితో మాగుంట చర్చించారు. అదేవిధంగా ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను పార్లమెంట్ భవనంలో ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు.

స్కాలర్‌షిప్పులపై ప్రశ్న

దేశంలో సాంఘీకంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు, ప్రకాశం జిల్లాలో గత ఐదేళ్లలో లబ్ధిపొందిన విద్యా ర్థులు, నిధులు, ఉద్యోగ అవకాశాలపై ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ సమాధానమిస్తూ విద్యార్థుల కోసం పలు స్కాలర్‌షిప్ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : ఎంపీడీవో



సింగరాయకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో, హెచ్‌ఎం



మద్దిపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జ్యోతి

సింగరాయకొండ/జరుగుమల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీవో జయమణి విద్యార్థినులకు సూచించారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడులోని బాలికల ఉన్నత పాఠశాలలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత చదువులు అభ్యసించి అత్యుత్తమ శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కత్తి శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ముస్తాక్, హెచ్‌ఎం మహాలక్ష్మి, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మండలంలో బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో వి.జ్యోతి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్యంలోనే వివాహం చేయడం వలన పలు అనర్థాలకు దారితీస్తుందని, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో బాల్య వివాహం జరుగుతుంటే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. 18 సంవత్సరాలోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘుబాబు, ఏపీవో ధనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో తదితరులు

సంతనూతలపాడు: బాల్యవివాహాల నివారణకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో వెంకారెడ్డి, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు, అఖండ జ్యోతితో భక్తుల కోలాటం

నాగులుప్పలపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒమ్మెవరం గ్రామంలోని అయ్యప్ప పడిభజన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి అర్చకులు మేళ్లచెరవు ఉదయభాస్కరశర్మ, శ్రీకాంత్, కృష్ణశర్మ దివి ప్రసాదాచార్యులు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో అయ్యప్ప, భవానీ, శివస్వాములు పడిపూజకు తరలివచ్చారు. భక్తులు అయ్యప్ప గీతాలు ఆలపించారు. గ్రామంలోని మహిళలు అఖండ జ్యోతిని తలపై పెట్టుకొని వేసిన కోలాటం భక్తులను అలరించింది. అంతకు ముందు గ్రామంలో దీపాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

టంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏవో జి.స్వర్ణలత సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కాకుటూరివారిపాలెం సర్పంచ్ కె.సుబ్బమ్మ, వ్యవసాయ సహాయకులు ఐ.ప్రావీణ్యం, పశుసంవర్ధక శాఖ అధికారి నయోమి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ఒంగోలు విద్య, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.జనార్ధన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.లెవిప్రసాద్, పి.హనుమంతరావు, కార్యదర్శులు పి.శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కె.రవి, ఎం.యోహాన్‌రెడ్డి, జె.వెంకటేశ్వర్లు, మురళి పాల్గొన్నారు.

పంటల బీమా చేసుకోవాలి : ఏవో



మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేయించాలని ఏవో వెంకట్రావు సూచించారు. ఉప్పుగుండూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు మొదలైనట్లు వివరించారు. దానితో పాటు పంట బీమా తప్పనిసరిగా పొందాలని సూచించారు. తద్వారా ప్రకృతి వైపరిత్యాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం లభిస్తుందన్నారు. రాయితీపై వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారి జాస్మిన్, సిబ్బంది స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

సాగుకు ముందు విత్తన శుద్ధి చేసుకోవాలి



శనగ విత్తనాలను అందజేస్తున్న ఏవో రమేష్‌బాబు

మద్దిపాడు: రైతులు సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేయాలని ఏవో జి.రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని రాచవారిపాలెం, కీర్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాలలో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

పంచాయతీ సెక్రటరీకి విచారణ నోటీసు

ఒంగోలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం పంచాయతీ సెక్రటరీ ఏదుల రాజశేఖర్‌రెడ్డి ఈ నెల 30వ తేదీన విచారణకు హాజరుకావాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం నోటీసును జారీ చేశారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎర్రగొండపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి, ఆడిట్ శాఖ ఏవోల ఎదుట విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

మహిళలకు కార్‌డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా కార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 7 నుంచి జనవరి 5వ తేదీ వరకు 30 రోజులు శిక్షణ ఇస్తామని, 18 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు 9573363141 సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి క్యారమ్స్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఒంగోలు(రూరల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం భాగ్యనగర్ 4వలైన్‌లో గల బొమ్మరిల్లు అర్బన్ హోమ్‌లో గురువారం జిల్లాస్థాయి క్యారమ్స్ అండర్-14, 17, 19 క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన బాల, బాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎండీ.హజీరాబేగం తెలిపారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు నిర్వాహకులు ఎస్‌కే.ఖాసీం, రాజ్యలక్ష్మి, రాష్ట్ర సీనియర్ క్యారమ్స్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.సుబ్బారావు, పీడీ యశోదలు పాల్గొన్నారు.

30న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు డిసెంబరు 27 నుంచి 29వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్‌లో జరుగుతున్నందున జిల్లాస్థాయిలో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు కోచ్, జాతీయ చాంపియన్ షేక్ కరిముల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణంలో జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లును ఎస్‌కే.ఆరీఫ్, సెల్ : 8886661606 ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తిగత సెలవులపై పరిమితి సరికాదు

ఒంగోలు విద్య, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సెలవులపై విద్యాశాఖ అధికారులు పాఠశాలలో లేదా మండలంలోని స్టాఫ్‌లో 7 శాతం నుంచి 10 శాతం మాత్రమే ఉపయోగించుకోవాలని షరతులు విధించటం సరికాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం బుధవారం అభిప్రాయపడింది. ఈ విధమైన ఆంక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. సంవత్సరానికి పురుష ఉపాధ్యాయులకు 22, మహిళా ఉపాధ్యాయులకు 27 సెలవులు ఉంటాయని, అత్యవసర అనారోగ్య సమస్యలలో అర్హత కలిగిన సెలవులు వాడుకోవటానికి ఆదేశాలు ఇవ్వాలని సంఘ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆరైబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు.

10 మద్యం బాటిళ్ల పట్టివేత

మద్దిపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డవరం బీసీ కాలనీలో వల్లెపు పోతుల వీరయ్య మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో మద్దిపాడు స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సురేష్ ఆధ్వర్యంలో బుధవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 10 మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితునిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఏఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేశారు. మద్యం బాటిళ్లను ఎక్సైజ్‌శాఖకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

బైక్‌పై మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో మద్యం దుకాణాలు మూసిఉన్న సమయంలో తన బైక్‌లో మద్యం బాటిళ్లు పెట్టుకొని విక్రయిస్తున్న గోపీకృష్ణ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

చీమకుర్తి మున్సిపాలిటీకి బీరువాల వితరణ



బీరువాలను అందజేస్తున్న గొల్లపూడి సుబ్బారావు

చీమకుర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మున్సిపాలిటీ నూతన కార్యాలయానికి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు బీరువాలను బహూకరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వై.రామకృష్ణయ్యకు గొల్లపూడి సుబ్బారావు బీరువాలను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ పోతురాజు, ఏఈ మరియదాసు పాల్గొన్నారు.

మూడు గ్రానైట్ లారీల పట్టివేత

చీమకుర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్లను రవాణా చేస్తున్న మూడు వాహనాలను మైన్స్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్రమంగా రాత్రివేళ ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా తరలిస్తున్న గ్రానైట్ ముడిరాళ్ల వాహనాలు, శ్లాబులతో వెళ్లున్న లారీను సీజ్ చేసి ఏపీఎండీసీ కార్యాలయానికి తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారి రామచంద్ర, ఆర్ఐ శివన్న, శంకర్, తిరుపతిరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మండల పరిపాలనాధికారుల సమావేశం

ఒంగోలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 56 మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న పరిపాలనాధికారుల సమావేశం బుధవారం ఒంగోలులోని పాత జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. జడ్పీ సీఈవో బి.చిరంజీవి లోకల్ ఫండ్, అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అభ్యంతరాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, బడ్జెట్ తయారీ, యాన్యువల్ రిపోర్ట్ జడ్పీ కార్యాలయానికి పంపటం, ఇతర పంచాయతీరాజ్ అంశాలపై చర్చించారు. సమావేశంలో సహాయ ఆడిట్ అధికారి మండలాలల్లో నిల్వ ఉన్న ఆడిట్ అభ్యంతరాలు డ్రాప్ చేసుకునే విధానాలు, జీఎస్టీ, ఐటీ జమచేసే విధానాన్ని వివరించారు. సమావేశంలో ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.బాలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వడియరాజులకు నామినేటెడ్ పదవుల కోసం విజ్ఞప్తి



ఎమ్మెల్యే దామచర్లకు మొక్కను అందజేస్తున్న ఆంజనేయులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వడియరాజులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించి రాజకీయంగా ఎదగటానికి దోహదం చేయాలని ఏపీ వడియరాజుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు కోరారు. బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్పొరేషన్ ద్వారా ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. వడియరాజుల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు తన్నీరు వీరసాయి, నియోజకవర్గ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, కుంచాల వెంకటసాయి, కుంచాల అంజయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొత్తపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు దుగ్గిరాల విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సంకువానిగుంటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ప్రాంతంలోనే ప్రభుత్వం కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు చక్కా సురేంద్రనాథ్, తానికొండ కొండలరావు, సుధీర్‌బాబు, చిటితోటి ఫణీంద్ర, నాగమణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనమనమెళ్లూరు ఫీడర్లో కొత్త పీసీబీ ఏర్పాటు, మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ చెన్నారెడ్డి బుధవారం తెలిపారు. బసవన్నపాలెం, నందిపాడు, ఇనమనమెళ్లూరు, సీతారాంపురం, దొడ్డవరప్పాడు, పెద్దకొత్తపల్లి, నేలటూరు, గురవారెడ్డిపాలెం, మారెళ్లగుంటపాలెం, నర్సాయపాలెం, మద్దిపాడు, వెల్లంపల్లి, కొలచనకోట, గుండ్లాపల్లి, బూరేపల్లి, నాగన్నపాలెం, రాచవారిపాలెం, గార్లపాడు, ఘుడియపూడి, గాజులపాలెం, కీర్తిపాడు, సంతనూతలపాడు మండలంలోని రుద్రవరం గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని



మాట్లాడుతున్న వెంకటస్వామి

మద్దిపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటస్వామి ఆదేశించారు. బుధవారం మద్దిపాడులో ఉపాధి హామీ పథకం గ్రామసభ సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం మద్దిపాడు గ్రామానికి కేటాయించిన 50 వేల పనిదినాలకు గుర్తించిన పనులు చేయటానికి ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ప్రతి ఇంటికి సోక్ పిట్స్, ప్రభుత్వ బిల్డింగ్ దగ్గర రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు జిల్లా కార్యాలయానికి పంపాలని ఆయన తెలిపారు. సమావేశంలో ఏపీవో ధనుంజయవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు సాగుచెరువు సర్వే నెం.879లో రామదూత స్వామి ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ భారత హేదువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖను రాశారు. ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలని 2021 ఏప్రిల్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అమలు జరుగలేదన్నారు. కనుక ఈ విషయంపై విచారణ జరిపించి ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆ లేఖలో కోరారు.

మెప్మా ఎండీకి దివ్యాంగుల కృతజ్ఞతలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను అన్ని మెప్మా కార్యాలయాల్లోనూ, కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలలో నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిన మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్ భార్గవ్‌కు నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో విభిన్న ప్రతిభావంతులైన ఎస్‌హెచ్‌జీలకు సంబంధించి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతుల స్వయం సహాయక సంఘ సభ్యులు, సంఘాల అర్హత మేరకు బ్యాంకు లింకేజి రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కావున జిల్లాలోని దివ్యాంగులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

సంతనూతలపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సంతనూతలపాడులో ఎస్‌ఆర్‌ఐ వంకాయలపాటి ధృవ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. ఎస్‌ఆర్‌ఐ పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షించారు. ట్రస్టు సభ్యులు పి.నారాయణస్వామిచౌదరి, కంకణం వెంకటేశ్వర్లు, కొప్పోలు శ్రీను, శీలం మల్లారెడ్డి, జార్జి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌డివిజన్ చేసి సమస్య పరిష్కరిస్తాం

● తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతనూతలపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన రహమత్‌బీకు సంబంధించి భూమి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ఏంటీ న్యూసెన్స్.. అనే కథనానికి ఆమె స్పందించారు. రహమత్‌బీకు సంబంధించి భూమి కొలతలకు సర్వేయరు వెళ్లగా పక్క హద్దుదారులైన షేక్ కాలేషా సర్వేకు సహకరించలేదని, దానివల్ల సర్వే చేయడం కుదరలేదని తెలిపారు. అంతేగాకుండా వారిరువురు కుటుంబసభ్యులని, వారి మధ్య వివాదం ఉందని, వారు సఖ్యతతోఉండి అంగీరించిన తర్వాత ఎల్‌పీఎం సబ్‌డివిజన్ చేసి రహమత్‌బీ కొత్త ఎల్‌పీఎమ్ నెంబరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సంఘకాపరుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంఘ కాపరుల యూనియన్‌అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని మండల పాస్టర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. కండ్లగుంటలోని క్రీస్తు సంఘం చర్చిలో సంఘ కాపరి ఉసురుపాటి దానియేలు అధ్యక్షతన ఐక్య క్రిస్మస్ సమావేశం బుధవారం జరిగంది. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ సంఘకాపరుల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. అనతరం సెమీ క్రిస్మస్, క్రిస్మస్ వేడుకలపై చర్చించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మనోజ్ కుమార్‌ను సన్మానించారు. యూనియన్ నాయకులు డేవిడ్, ఇస్రాయేలు, దావీదు, నంబూరి భాస్కరరావు, రెబ్బవరపు రాఘవరావు, దార్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఒడిశా కార్మికుడు ఆత్మహత్య

చీమకుర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రానికి చెందిన గ్రానైట్ కార్మికుడు మంగళవారం అర్ధరాత్రి ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చీమకుర్తి పట్టణం రామనగర్‌లో జరిగింది. ఒడిశాకు చెందిన పద్మచరణ్‌శెట్టి(34) తన భార్య, పిల్లలుతో కలిసి రామనగర్‌లో నివసిస్తూ దినసరి కార్మికునిగా పనిచేస్తున్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో తాను నివాసం ఉంటున్న ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నేడు వల్లూరమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

టంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లూరమ్మ దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపు గురువారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందని ఈవో రమేష్ తెలిపారు. ఆలయ అధికారులతో పాటు దేవదాయశాఖ జిల్లా కార్యాలయ అధికారి పాల్గొంటారన్నారు.

ఘనంగా కార్తీక మాస దీపోత్సవం



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న అర్చకుడు

ఒంగోలు(రూరల్), నవంబరు(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని బృందావన గార్డెన్స్‌లో కార్తీక మాసం సందర్భంగా బుధవారం రాత్రి ఉసిరి చెట్టు దగ్గర మహిళలు దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి కార్తీక మాసం విశిష్టతను వివరించారు. అనంతరం వనభోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూములు ఆక్రమిస్తే చర్యలు

● ఆ శాఖ ఈవో శ్రీనివాసులురెడ్డి


ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసులరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామికి సంబంధించి దేవాదాయశాఖ భూములు ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి హెచ్చరించారు. స్థానిక గుండ్లకమ్మ సమీపంలోని సర్వే నెంబర్ 355-2లోని 2.49ఎకరాల భూమిని కొంతమంది బుధవారం ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా వారిని సిబ్బందితో కలిసి వెళ్లి అడ్డుకున్నారు. స్థానికులు సమాచారంతో ఇక్కడికి వచ్చిన ఈవో మాట్లాడుతూ.. దేవాదాయ భూములు కొన్నా, అమ్మినా, ఆక్రమించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్థలంలో సర్వే చేయించి హద్దులు పాతుతామన్నారు. దేవాదాయ శాఖ భూమి ఎక్కడ ఉన్నా తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందన్నారు. పట్టణంలో, మండలంలో ఉన్న దేవాదాయ శాఖ భూములు ఆక్రమణకు గురైన వాటన్నింటినీ తాము స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు

పొదిలి : పట్టణంలోని పలు దేవాలయాలకు సంబంధించిన స్థలాలు, పొలాలల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు అందజేయనున్నట్లు ఈవో లీలాక్రిష్ణ తెలిపారు. బుధవారం స్థానిక నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు దేవాలయాలకు చెందిన స్థలాలు, పొలాల్లో ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను జీవో నెంబరు 83 ప్రకారం నోటీసులు జారీ చేసి కూల్చివేయడానికి వీలుంటుందన్నారు. ఇప్పటి వరకు పట్టణంలోని పొదిలమ్మ దేవాలయం పరిధిలో 104, పోలేరమ్మ దేవాలయం పరిధిలో 54, నిర్మమహేశ్వర దేవాలయం పరిధిలో 15 గృహాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. 83 యాక్ట్ ప్రకారం నోటీసులు జారీ చేసి నెలరోజుల్లో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గోసంరక్షణలో (గోశాలలో) కూడా జరుగుతున్న నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. దేవాలయానికి చెందిన ఆస్తులను ఎంతటి వారు ఆక్రమించినా వాటిపై కూడా అంచెలంచెలుగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపులో భాగస్వామ్యం కావాలి


మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం నరసింహులు

మార్కాపురం వన్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయం పెంపులో సిబ్బంది భాగస్వామ్యం కావాలని మార్కాపురం ఆర్టీసీడిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సమయ పాలన మాసోత్సవంపై బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీఆర్ఎస్ సర్వీస్‌లు, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ సర్వీస్‌లు అన్ని సమయపాలన పాటించాలన్నారు. ఈపీకే తేవాలని, ఇంధన పొదుపు పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలనతో పాటు ప్రయాణి కులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. వివిధ అంశాలపై వివరించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పొదిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని సీడీపీవో సుధామారుతి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు నేరమంటూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాల్యంలోనే వివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివిస్తే మహిళలు ఉన్నత స్థితిలో ఉంటారన్నారు. ఎంపీడీవో శోభన్‌బాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విశ్వనాథపురం కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐ వెంకట్, ఎస్ఐ వేమన, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, మండలస్థాయి సిబ్బంది, సచివాలయ, విద్యాశాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువమెట్ట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న తమ్మినేని గిరిబాబు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఆయన వద్ద నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ కె.సురేష్ తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి : ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సిబ్బంది వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని ఎర్రగొండపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ పి. చౌడయ్య అన్నారు. బుధ వారం స్టేషన్‌లో సిబ్బందితో విధుల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్, డ్రంకెన్‌డ్రైవ్, ఈవ్‌టీజింగ్ పై నిఘా ఉంచాలని అన్నారు. రాత్రి వేళల్లో గస్తీ కాచే సిబ్బంది అలర్ట్ గా ఉండాలని అన్నారు.

ట్రాఫిక్ సమస్యతో నిత్యం అవస్థలు

● పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో గిద్దలూరులో తీవ్ర ఇక్కట్లు ● కంభంలో కుచించుకుపోతున్న వీధులు

గిద్దలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని ప్రధాన వీధులు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకు న్నాయి. రోజురోజుకు రోడ్లు కుచించుకుపోతుండడం, వాహనాల సంఖ్య పెరుగుతుండడం, పార్కింగ్ స్థలాల కొరత ఉండడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. అసలే తక్కువ వెడల్పు ఉన్న వీధులు, దానికి తోడు రోడ్ల అంచుల్లో చిరు వ్యాపా రులు, పార్కింగ్ స్థలాలు కనిపించక పోవడంతో మోటార్ సైక్లిస్టులు రోడ్ల మీదనే పార్కు చేసుకోవలసిన పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఎదురెదురుగా ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.


కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వాహనాలు

పట్టణంలోని పెద్దబజారు, కళాశాల, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, కుమ్మరాంకట్ట, క్లబ్ రోడ్డు, గణేష్‌నగర్, పెద్దపోస్టాఫీసు రోడ్డు, వ్యవసాయశాఖ కార్యాలయం రోడ్డు, స్టేషన్ రోడ్డు, నరవ రోడ్డు, రాచర్ల గేటు సెంటర్, కృష్ణ థియేటర్ సెంటర్ తదితర ప్రాంతాలలో పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో దుకాణాల ముందు రోడ్లపైనే మోటార్ సైకిళ్లు, ఆటోలు పార్కింగ్ చేసుకోవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో నిత్యం ఆ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య రాజ్యమేలుతోంది. గతంలో పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర, పెద్ద మసీదు ఎదురుగా కాలువలపై బండలు వేసి మోటార్ సైకిళ్లను దానిపై పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు, మున్సిపల్ అధికా రులు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. కానీ సిమెంటు రోడ్డుకు, కాలువకు మధ్య ఎత్తులో తేడా ఉండడం, కాలువపై వేసిన బండలు తక్కు వ ఎత్తులో ఉండడంతో వాటిపై పార్కింగ్ చేస్తే మోటార్ సైకిళ్లను వెనక్కు తీసుకోలేని పరిస్థితి ఉంది. దీంతో వాహన చోదకులు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ సమ యంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ స్తంభిస్తోంది. సిమెంటు రోడ్డుకు సమాన ఎత్తులో కాలువలపై బండలు, సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేస్తే చాలా వీధుల్లో కొంతమేర అయినా పార్కింగ్ సమస్య తీరి ట్రాఫిక్ సమస్య తగ్గు ముఖం పడుతుంది. ఆమేర చర్యలు తీసుకోవాలని వాహ న చోదకులు, ప్రజలు పోలీసు, మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా బ్యాంక్‌ల వద్ద ఎలాంటి పార్కింగ్ సౌకర్యా లు లేకపోవడంతో ఖాతాదారులందరూ రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అలాగే కళ్యాణ మండపాలు, లాడ్జిలు, కళాశాలల వద్ద భవన యజమానులు సొంత పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోకపోవడంతో సమస్య మరింత జటిలం అవుతోంది.


గిద్దలూరు పోస్టాఫీసు వీధిలో రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

కంభంలో జాతీయ రహదారికి ఇరువైపులా

కంభం : కంభం, కందులాపురం మీదుగా వెళ్లే అనంతపురం-అమరావతి జాతీయ రహదారికి ఇరు వైపులా డ్రైనేజీ కాలువలపై నుంచి ఆక్రమణదారులు అక్రమ కట్టడాలు నిర్మించడంతో ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంభం పంచాయతీ పరిధిలోని వెలుగొండ ప్రాజెక్టు కార్యాలయం నుంచి కందులాపురంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీని, రోడ్డును ఆక్రమించుకున్నారు. కంభంలోని ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజారు, చౌక్ సెంటర్, కాలేజీ రోడ్డు, వై.జంక్షన్, కందులాపురం సెంటర్, సంగ వీధి, జామియా మసీదు సెంటర్లలో వస్త్ర, బంగారు, హోలో సేల్ వ్యాపారులు, చిల్లర దుకాణాలు రోడ్లను, డ్రైనేజీ లను ఆక్రమించుకుని అరుగులు కట్టారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. రోజురోజుకు పెరుగు తున్న వాహనాల రాకపోకలకు రోడ్లు ఆక్రమణలతో కుచించు కుపోతున్నాయి. వ్యాపారానికి సరుకులు తీసు కువచ్చే వాహనాలు అన్‌లోడ్ చేసే సమయంలో, వస్తువులు కొనుగోలు చేసే వారు వారి వాహనాలను రోడ్లపైనే వదిలి వెళుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు స్పందించి ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సంఘాల సర్వే సమగ్రంగా నిర్వహించండి : పీడీ

మార్కాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో స్వయం సహాయక సభ్యుల సర్వేలు సమగ్రంగా చేయాలని డీఆర్‌డీఏ పీడీ వసుంధర వీవోఏలను ఆదేశించారు. స్థానిక ఎస్సీ, బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారు లో బుధవారం మార్కాపురం క్లస్టర్ పరిధిలోని మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపా డు మండలాల పరిధిలో పనిచేసే వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. సభ్యుల వివరాలను 'అజీవిక, లక్‌పత్‌దీదీ యాప్'లలో ప్రతి వీవోఏ నమోదు చేయాలని కోరారు. సంఘాలలో పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి, ఉన్నతి, ఎస్‌వీఈపీ రుణాలు నూరుశాతం రికవరీ చేయాలన్నారు. గ్రామ సంఘాలలో జెండర్ క్యాంప్‌లను నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాలలో పాఠశాలకు వెళ్లకుండా ఉండే పిల్లలకు గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమం లో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఐబీ డీపీఎం నరసింహారావు, ఏపీఎం సుబ్బారావు, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి ఏపీఎంలు డి పిచ్చయ్య, పి.ర మేష్ బాబు, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఎల్‌సీ నాగభూషణం, సీసీలు వీవోఏలు పాల్గన్నారు.



మాట్లాడుతున్న పీడీ వసుంధరదేవి

ఎర్రగొండపాలెం రూరల్: బాల్య వివాహా లను నిర్మూలించి బాల్యవివాహాలు లేని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా ఏపీని తీర్చిదిద్దాలని డీఆర్ డీఏ పీడీ పి.వసుందర అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్‌బీ.ఆర్. అంబే ద్కర్ ఆడిటో రియంలో క్లస్టర్ పరిధిలోని వీవోఏలతో నిర్వహించారు. ఏరియా కో-ఆర్డినే టర్ డి.దానం అధ్యక్షతన జరిగిన కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా పీడీ వసుందరాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ క్లస్టర్ పరిధిలో ఉన్న వెలుగు సిబ్బంది వీవోఏలు కలసి బాల్యవివాహాలు జరగకుండా బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ పై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ యాప్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని ఏపీవోలు, ఏసీ, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఎరిక్షన్‌బాబు వినతి

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించి నిధులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయాను ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఏరిక్షన్ బాబు కోరారు. బుధవారం కలెక్టర్ కార్యలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ట్రైబ ల్ గూడేలకు అవసరమైన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే దోర్నాల లో ఏపీటీడబ్ల్యూఆర్ బాలు రు, బాలికల బిల్డింగ్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు. గిరిజనుల గూడాలలో రోడ్లకు, నివా సాలకు ఫారెస్ట్ అనుమతులు లేక గిరి పుత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటికి అవసరమైన అనుమతుల విషయాన్ని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఏఐబీ గ్రాంట్ లో గతంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న 17 పనులకు ఆదనపు నిధులు మంజూ రు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే నియోజవర్గంలో చివరి దశలో ఉన్న 61 అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వాటితో పాటు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఏరిక్షన్‌బాబు తెలిపారు.


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్య విధాన్ పరిషత్ జిల్లా సమన్వయకర్త సూరిబాబు

పెద్దదోర్నాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యవిధాన్‌పరిషత్ జిల్లా సమన్వయకర్త సూరిబాబు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని డీసీవో సూరిబాబు బుధ వారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన వైద్యశాలలోని అన్ని గదులు, పరి సరాలు, చిన్నపిల్లల వార్డు, రికార్డులు పరిశీలిం చారు. అనంతరం ఆయన వైద్యశాల సిబ్బంది కి పలు సూచనలు చేశారు. రోగులను ప్రేమతో చూడాలన్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఈ క్రమంలో వైద్యశాల సిబ్బంది మాట్లాడు తూ ప్రహరీగోడ నిర్మాణం కొంతభాగం లేని చోట నుండి పందులు, కుక్కలు వైద్యశాలలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ నాగమహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీసీవో సూరిబాబు

దుస్తుల పంపిణీ

గిద్దలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని ప్రధాన చర్చి ఆవరణలో తెలుగు బాప్టిస్టు ఫీల్డ్ తెలుగు వార్షికోత్సవ సమావేశం, అలాగే సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. పేదలైన వితంతువులకు చీరలు అందచేశారు. ముఖ్యఅతిథిగా సీఏసీపీసీ విశ్వవిద్యాలయ చైర్మన్ సంజీవరాజ్ హాజరై మాట్లాడుతూ క్రీస్తు సందేశం వినిపించారు. చెడుఅలవాట్లు వదిలి వేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్టు ఫీల్డ్ అధ్యక్షులు డాక్టర్ జకరయ్యబాబు, సంఘ ప్రతినిధులు గుర్రం శేఖర్, విలియం, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణమఠంలో రుద్రపూజ

గిద్దలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామకృష్ణమఠంలో కార్తీక రుద్రపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున హాజరై సామూహికంగా రుద్రపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వేమన సేవాసంస్థ అధ్యక్షులు హనుమంతరెడ్డి, యోగా గురువు నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో అధిక దిగుబడులు

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో

పెద్దదోర్నాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్రవ జీవామృతంతో సాగు చేసిన పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని చింతల, మర్రిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ఆ గ్రామాల్లో సాగుచేసిన మినుము, మిరప పైర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా వినియోగించే రసాయన ఎరువులు, పురుగుమందులతో పెట్టుబడులు అధికమవుతాయన్నారు. స్థానికంగా లభించే వేప, పశువుల పేడ, మూత్రంతో ద్రవ జీవామృతం తయారు చేసుకుని పైర్లపై పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, వీపీఏ పరిపూర్ణ, వీహెచ్ఏ నీలానాయక్ పాల్గొన్నారు.


ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో

గిద్దలూరు : మండలంలోని తంబళ్లపల్లి, పొదలకొండపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఫసల్‌బీమాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూక్ష్మ నీటియాజమాన్య శాఖ అధికారి మోహనకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని ఇడుపూరు, కొత్తపల్లి గ్రామాలలో బుధవారం ఏవో, ఉద్యానవనశాఖ అధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఫసల్‌బీమాపై రైతులకు అవగాహన కల్పిం చారు. మీ సేవా కేంద్రాలలో గానీ, సచివాల యాలలో పంటల బీమా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది సంధ్య, సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : కందిపంట పూతదశలో ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. మండలం లోని నాగరాజుకుంట, కొనకన మిట్ల గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కందిలో పురుగు నివారణకు క్లోరోపైరిపాస్ లీటరు నీటికి 2.5 ఎంఎల్, డైమిథోయేట్ 2ఎంఎల్ కలిపి పిచికారి చేయాలని చెప్పారు.

విధిగా పంటబీమా చెల్లించాలి

కొమరోలు : పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించు కోవాలని మండల వ్యవసాయాధికారి రాజశ్రీ అన్నారు. మండలంలోని నరసింహునుపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచన లు చేశారు. ఈ సందర్భంగా అధికారులు రాజశ్రీ, విష్ణుప్రియలు మాట్లాడుతూ ఆరు గాలం కష్టపడి సాగుచేస్తున్న పంటలకు రైతులు విధిగా పంటల బీమా చేయించు కోవాలన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మార్కాపు రానికి చెందిన ఉపాధ్యాయుడు పిల్లెబోయిన వెంకటే శ్వర్లు తెలిపారు. ఒంగోలులో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలలో వెంకటేశ్వర్లు ఎంపిక కావడంపై యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వొద్దుల వీరారెడ్డి, నాయకులు రాజేష్, జయరామిరెడ్డి వెంకటేశ్వర్లను అభినందించారు.

కరపత్రాల విడుదల

గిద్దలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణంలోని జాతీయ రహదారి వెంబడి బాలకృష్ణారెడ్డి స్థలంలో డిసెంబరు 1న నిర్వహించనున్న హిందూ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు విడుదల చేశారు. హిందువుల ఐక్యత కోసం పాటుపడేందుకు ఏర్పాటు చేయుచున్న ఈ సమ్మేళనా నికి హిందువులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమరసత సంఘం జిల్లా అధ్యక్షులు సూరె కృష్ణారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, వీహెచ్‌పీ నాయకులు బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన నామసప్తాహం

గిద్దలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజలలో భాగంగా పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ మందిరంలో నామయజ్ఞ సప్తాహం వైభవంగా ముగిసింది. రెండు వారాలుగా 24 గంటలపాటు శ్రీకుసుమ హరనాథుల నామ సప్తాహం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు వాడకట్టు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అయప్ప దీక్షధారులకు బియ్యం వితరణ

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వినుకొండ రోడ్డులోని ఆయప్ప స్వామి దేవాలయంలో అయప్ప దీక్షలు స్వీకరించిన స్వాములకు అన్నదానానికి అవసరమైన 500 కేజీల బియ్యాన్ని స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అందజేశారు. మంగళవారం వైసీపీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు, అయప్ప స్వాములకు ఆ బియ్యం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ సత్తిరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, మునలారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

తాతిరెడ్డిపల్లెలో చర్చి ప్రారంభం

కొమరోలు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రేమ, దయా, కరుణామయుడు యేసుక్రీస్తునని జెడ్పీటీసీ సభ్యులు సొరె వెంటకనాయుడు అన్నారు. మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో నూతన చర్చిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటనాయుడు మాట్లాడుతూ గ్రామస్థులు కలసికట్టుగా చర్చి నిర్మంచుకుని ప్రారంభించడం సంతోషకరమన్నారు. ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండేందుకు దేవప్రార్థన అవసరమన్నారు. కార్య క్రమంలో నాయకులు నాదేళ్ల వెంగయ్యచౌదరి, బంగారు విశ్వరూపం, జూజాం వెంకటరమణ, తిరుపతిరాజు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

గిద్దలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు, వాచ్‌మెన్‌లకు జాయినింగ్ ఆర్డర్ కాపీ, డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎంఈవో కె.వెంకటేశ్వర్లుకు కార్మికులతో కలిసివినతిపత్రం అందచేశారు. మండలంలోని 75 పాఠశాలల్లో పనిచేస్తున్న ఏ ఒక్క కార్మికుడికి జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వలేదని, డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాజకీయ తొలగింపులు ఆగాలంటే సర్టిఫికెట్లు ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు షబీర, మల్లీశ్వరి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సై అధికారులు

కొమరోలు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సై వెంకటేశ్వరనాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో లీగల్ సర్వీసేస్ కమిటీ, రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అధికారులతో బాల్యవివాహాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరనాయక్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతోనే బాల్య వివాహాలు జరుగుతాయన్నారు. అలాంటి కుటుంబాలను గుర్తించి అవగాహన కల్పిస్తే బాల్య వివాహాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి, రీడ్స్ సంస్థ నిర్వాహకులు బ్లెసింగ్‌టన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన గౌతమ్


మంత్రి లోకేష్‌తో డాక్టర్ గౌతమ్

మార్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్‌ను కందుల ఓబులరెడ్డి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఎండీ డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేష్‌ను కలిసిన ఆయన, గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన కందుల ఓబులరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ గురించి మాట్లాడారు. త్వరలో విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నామని తప్పక హాజరుకావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ కార్యక్రమంలో తప్పక పాల్గొంటానన్నారని డాక్టర్ గౌతమ్ తెలిపారు.

అవీ..ఇవీ


ఆక్రమించిన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈ మంజూష

ఆక్రమిత స్థలాలను ఖాళీ చేయాలి

కురిచేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఉన్న రోడ్లు భవనాల శాఖకు చెందిన స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వెంటనే ఖాళీ చేయాలని ఆ శాఖ ఏఈ మంజూష తెలిపారు. కురిచేడు - దర్శి రోడ్డులో మార్కెట్ యార్డు కాంపౌండ్ గోడ ఆనుకుని కొంతమంది తమ స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేశారని, వారిని ఖాళీ చేయించాలని స్థానికుడు మేరువ పెద్దిరెడ్డి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు తమీమ్ అన్సారియా ఆక్రమిత స్థలాలను ఖాళీ చేయించాలని రోడ్లు భవనాల శాఖను ఆదేశించారు. బుధవారం ఏఈ మంజూష వచ్చి ఆక్రమణదారులను ఖాళీ చేయాలని సూచించారు. ఇప్పటికే మూడు సార్లు నోటీసులు ఇచ్చామని, గురువారం ఎక్స్‌కవేటర్‌తో షెడ్లు కూలుస్తామని, ఈలోగా ఎవరికి వారే షెడ్లు తొలగించుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట కురిచేడు మేజర్ పంచాయతీ కార్యదర్శి చాంద్‌బి, వీఆర్వో నాగరాజులు ఉన్నారు.


ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయిస్తున్న ఆక్రమణదారుడు

రాజాగారిబాట ఆక్రమణ

- అడ్డుకున్న స్థానికులు

పామూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విరాట్ నగర్ కాలనీ వద్ద ఉన్న శ్రీకాళహస్తి రాజాగారి బాటపై తమకు హక్కులు ఉన్నాయంటూ పామూరుకు చెందిన జగదాబి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఆక్రమణకు దిగాడు. దాంతో విరాట్‌నగర్ వాసులు ఆక్రమణ చర్యలను అడ్డుకొన్నారు. రాజాగారి బాటపై హక్కులు ఉంటే తహసీల్దార్‌ను తీసుకొని రావాలని ఆక్రమణదారుడిని నిలదీశారు. చేసేది లేక ఆక్రమణదారుడు అక్కడ నుంచి వెళ్లిపోవడంతో స్థానికులు అక్కడ తీసిన గుంతలను పూడ్చివేశారు. మరో సారి ఆక్రమణకు పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వ్యక్తులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

లైసెన్సులు లేకుండా వాహనాలు నడపటం నేరం..!

- ఎస్ఐ మాధవరావు

హనుమంతునిపాడు (కనిగిరి) : లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మాధవరావు అన్నారు. స్థానిక కంభం రోడ్డులో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. మండలంలోని హాజీపురం అడ్డరోడ్డు వద్ద హెల్మెట్ లేకుండా నడుపుతున్న వాహనదారులకు ఈచలానాలు విధించారు.

సూపర్ సిక్స్ అమల్లో పిల్లిమొగ్గలు

దర్శి నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు పిల్లి మొగ్గలు వేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి ఇళ్లు, స్థలాలకు విముక్తి

ఫలించిన ఎమ్మెల్యే ఉగ్ర కృషి


దేవదాయశాఖ సర్వే నంబర్‌లో ఉన్న పామూరులోని నివాసాలు

అభినందిస్తున్న ప్రజలు

పామూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లు, స్థలాలకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో నిషేధిత జాబితా నుంచి వాటిని తొలగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇప్పటిదాకా దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో నిషేధిత జాబితాలోకి ఇళ్లు, ఇంటి స్థలాలు, భూములు చేరడంతో స్థానికులు పలు అవస్థలు పడ్డారు. తమ ఇళ్లను, ఇంటి స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని గత పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకొన్న పాపానపోలేదు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పాటు లావాదేవీలు జరగక ప్రభుత్వాదాయానికి గండి పడింది. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యేగా ఉగ్రనరసింహారెడ్డి గెలుపొందారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆయన విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం నిషేధిత తొలగింపు ఉత్తర్వుల (ఎన్‌వోసీ) ఆర్డర్ కాపీని సంబంధిత శాఖ అధికారుల నుంచి తీసుకొని రావడంతో స్థానికులకు ఊరట లభించింది.


ఉగ్రకు ఎన్‌వోసీ ఆర్డర్ కాపీని అందజేస్తున్న దృశ్యం

పామూరు పట్టణంలోని గ్రామ కంఠంలో గల 200 సర్వే నెంబర్‌లో 30.71 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో స్థిర నివాసాలు నిర్మించుకొని సుమారుగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన 3 వందల కుటుంబాల వారు జీవిస్తున్నారు. కాగా ఈ సర్వే నెంబర్‌లో శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, శ్రీ వరదరాజులస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూమి ఉంది. 2016 వరకు రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాలు సాఫీగా జరుగుతున్న తరుణంలో దేవదాయ శాఖ వారు 200 సర్వేనెంబర్‌ను ఎండో భూమిగా చూపిస్తూ నిషేధిత జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. దాంతో ఆస్తులున్నా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. కొత్తగా గృహాలు నిర్మించుకోవాలనుకున్న వారు రుణాలకోసం బ్యాంకుల దగ్గరకు వెళితే ఆ భూములు ఎండోమెంట్ భూములుగా రికార్డుల్లో నమోదై ఉన్నాయని, తాము రుణాలు ఇవ్వలేమని తిప్పి పంపిస్తున్నారు. దాంతో పిల్లల వివాహాలకు, చదువులకు, ఇతర ఆర్థిక అవసరాలకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అల్లు వెంకటేశ్వర్లు సహకారంతో పట్టణానికి చెందిన రాచూరి మన్మథరావులు 200 సర్వేనెంబర్‌లోఉన్న మొత్తం భూమిని సబ్ డివిజన్ చేసి ఆ సర్వే నెంబర్‌ను నిషేధిత జాబితా నుంచి విముక్తి కలిగించి ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్‌కు, ఎండోమెంట్ కమిషనర్, జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా అప్పటి పాలకులు పట్టించుకొన్న దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే ఉగ్ర సహకారంతో ఎండోమెంట్ అధికారులు ఈ సర్వేనెంబర్‌ను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఎన్‌వోసీ ఆర్డర్ కాపీ జారీ చేయించారు. దాంతో వారం రోజుల నుంచి కనిగిరి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో సమస్య పరిష్కారం కోసం కృషిచేసిన ఎమ్మెల్యే ఉగ్రను స్థానికులు అభినందించడంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు

వాహన చోదకులకు తప్పనున్న తిప్పలు

ముండ్లమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధానరహదారులు అధ్వాన స్థితికి చేరాయి. వాహన చోదకులు, ప్రజలు ఆ రహదారులపై ప్రయాణం చేయలేక అల్లాడిపోయారు. 2019 నుంచి 2024 వరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కనీసం రహదారులపై పడిన గోతులను కూడా పూడ్చక పోవటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే అధ్వానంగా ఉన్న రహదారులపై దృష్టి పెట్టింది. తాత్కాలిక మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలవటంతో మండలంలోని అతి ప్రధానమైన పెద ఉల్లగల్లు నుంచి చింతలపూడి వెళ్లే అర్‌అండ్‌బీ రహదారికి నాలుగు కిలోమీటర్ల మేర మరమ్మతులకు రూ.12 లక్షలు నిధులు మంజూరు చేసింది. వారం రోజుల నుంచి గోతులను పూడ్చి పూర్తిగా తారు తవ్వి మళ్లీ రహదారిని సుందరంగా తీర్చిదిద్దే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఇక మండలంలోని పూరిమెట్ల నుంచి భీమవరం వెళ్లే అర్‌అండ్‌బీ రహదారికి వారం రోజుల క్రితం తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 8 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ముమ్మరంగా గోతులను పూడ్చే పనిలో ఆర్ అండ్‌బీ అధికారులు ఉన్నారు. ముండ్లమూరు నుంచి తాళ్లూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో గోతులను పూడ్చటమే కాక రహదారిని విస్తరించే పనులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రహదారులకు అధిక ప్రాధాన్యం ఇవ్వటంతో అధ్వాన స్థితిలో ఉన్న రహదారులకు మోక్షం ఏర్పడటంతో వాహన చోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రహదారులకు నిధులు మంజూరు చేయించటంలో టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఇటీవల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి రోడ్ల దుస్థితిని వివరించారు. దీంతో స్పందించిన మంత్రి వెంటనే రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు.


పెద ఉల్లగల్లు నుంచి చింతలపూడి వెళ్లే రహదారికి చేస్తున్న మరమ్మతులు


ముండ్లమూరు నుంచి తాళ్లూరు వెళ్లే రహదారి విస్తరణ పనులు


వేంపాడులో పొలాలను పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు

ఈ పంట నమోదు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ముండ్లమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వేంపాడులో బుధవారం క్షేత్రపర్యటన నిర్వహించారు. గ్రామంలోని వ్యవసాయ భూములలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలు, విస్తీర్ణం నమోదు చేయటంతో వచ్చే ఇబ్బందులను పరిశీలించారు. ఈ పంట నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయాధికారి శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌వో క్షేత్ర ససహాయ సంచాలకులు గంపా శ్రీనివాసరావు, జిల్లా సహాయ గణాంక అధికారి ప్రసాదు, మండల వ్యవసాయ అధికారి ఫరూక్, వీఏఏ శోభారాణి పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

కనిగిరి : రైతులు మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో జ్యోష్నాదేవి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ జరిగింది. ఏవో జ్యోష్నాదేవి, ఉద్యానశాఖ ఏవో ఎం. అంజలీభాయి, పశువైద్యశాల సిబ్బంది రేష్మ పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు : రబీ సీజన్‌కు సంబంధించి రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో కే రాధ తెలిపారు. మండలంలోని మోపాడు, తూర్పుకట్టకిందపల్లి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము పైరును పరిశీలించి తగు సూచనలు చేశారు.

నేటి నుంచి రబీ ఈ పంట నమోదు

దొనకొండ : మండలంలో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈనెల 28వ తేదీ నుంచి ఈ పంట నమోదు చేయబోతున్నట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ వివరించారు. మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పురుగులమందు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

తాళ్లూరు : పురుగుల మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు.మండలంలోని రామభద్రాపురం, నాగంబొట్లపాలెం,తూర్పుగంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. సర్పంచ్ వెంకటలక్ష్మి, రామిరెడ్డి, వీఏఏ వెంకటసుమ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

తాళ్లూరులో కొవ్వొత్తుల ర్యాలీ,ప్రతిజ్ఞ

తాళ్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో కె.సుందరరామయ్య అన్నారు. తాళ్లూరు మండల ఐసీడీపీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ బుధవారం నిర్వహించారు. బాలికలను బాల్యవివాహాలు చేసుకోకుండా విద్యాభ్యాసం చేయిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి బాలిక యుక్తవయస్సు నిండేవరకు వివాహాలు చేసుకోవద్దని సూచించారు. ముందుగా కస్తూర్బాగాంధీ విద్యాలయం నుంచి వెల్లంపల్లి రోడ్డువరకు కేజీబీవీ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి బాల్యవివాహాలు చేసుకోమని బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

ఈకార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, వెలుగు ఏపీఎం దేవరాజ్, ఏపీవో మురళి, ఈసీ ప్రసాద్, కేజీబీవీ ప్రిన్సిపల్ సుజిత, హెచ్ ఎం శేషగిరి, పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్‌యాదవ్, ఏఎస్సై మోహన్‌రావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, రాచకొండ వెంకట్రావు, హనుమారెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న అధికారులు, బాలికలు

బాలికల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

పామూరు : బాలికల అక్రమ రవాణా, బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో కరుణకుమారి తెలిపారు. మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంకృషి సేవాసంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం ఈసాక్, ఎస్ఎంసీ ఛైర్మన్ బి. శ్రీనివాసులు, సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్‌రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు : బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించ వద్దని, చిన్న వయసులో వివాహాలు చేసుకోవటం వల్ల భవిష్యత్‌లో ఎన్నో అనర్థాలు జరుగుతాయని ఎంపీడీవో ఆర్. జనార్దన్ అన్నారు. బుధవారం ముండ్లమూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కే వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సునీత, కేజీబీవీ ప్రత్యేక అధికారి, మండల రిసోర్స్ పర్సన్, వెలుగు సీసీ తదితరులు పాల్గొన్నారు.


దొనకొండలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

దొనకొండలో..

దొనకొండ : గ్రామాల్లో 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు బాల్య వివాహాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ దర్శి ప్రాజెక్టు సీడీపీవో భారతి వివరించారు. స్థానిక జడ్పీ పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ ద్వారా బాల్య వివాహ రహిత భారత్ గురించి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ సునీత , ఐటీసీ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరావు, ఎంఈవో సాంబశివరావు, పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి, ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ కేవీడీ ప్రభావతిదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి

డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి చేతిలో మోసపోవద్దని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు వివిధ రకాల మోసాలకు గురవుతున్నారని, ఆ నేరాల నుంచి పూర్తిగా బయట పడాలన్నారు. ఇతరులు వేసే ఆకర్షణలకు మోస పోవద్దన్నారు. సమాజంలో ఇతరుల నుంచి సులువుగా నగదు లాక్కొనేందుకు సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లు పంపుతూ మీ ఓటీపీలు, ఆధార్ కార్డు నెంబర్లు చెప్పాలని మెసేజ్‌లు వస్తే ఎవరూ చెప్పవద్దన్నారు. చాలా మంది యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు బుగ్గిపాలు చేసుకుంటున్నారన్నారు. మీపై మీ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయవద్దన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సునీత, ఎస్ఐ వై. నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు అవసరం

కురిచేడు : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కురిచేడు ఎస్ఐ శివ సూచించారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమై సైబర్ నేరాలపై చర్చించారు. ఏపీకే ఫైళ్లను ఎవరూ ఓపెన్ చేయవద్దని, అలాగే పెండ్లి శుభలేఖల పేరుతో సెల్‌లో కార్డులు పంపి డబ్బులు గుంజుతున్నారని ఎస్ఐ తెలిపారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి వచ్చే ఏవిధమైన మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

ఎండోమెంట్ భూముల్లో సీసీ రోడ్డు నిర్మాణం

పామూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మదనవేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెంబర్ 380/1,2 లోని ఏడు ఎకరాల 56 సెంట్ల భూముల్లో కొంత భాగం ఆక్రమణకు గురైంది. మిగిలిన ఆభూమిలో పంచాయతీ అధికారులు రోడ్డు నిర్మిస్తున్నారు. పంచాయతీ అనుమతులతో కాంట్రాక్టర్ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై ఎండోమెంట్ శాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ కార్యదర్శికి ఎండోమెంట్ ఈవో ఎటువంటి అనుమతులు ఇవ్వదంటూ లిఖిత పూర్వకంగా కోరినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు.

మారెళ్ళలో అయ్యప్ప స్వాములకు సద్ది ఏర్పాటు

ముండ్లమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ళ గ్రామంలో అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమం సందర్భంగా స్వాములకు బుధవారం ముండ్లమూరు ఎస్ఐ వై.నాగరాజు సద్ది ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు శబరిమల స్వామి దర్శనానికి వెళ్తున్న సందర్భంగా ఎస్ఐ నాగరాజు ఒక రోజు అన్నదానం నిర్వహించారు.

నేడు గంధమహోత్సం


పామూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం రోడ్‌లోని శ్రీ హజరత్ మహబూబ్‌సుభాని స్వామి వార్ల గంధ మహోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా దర్గాకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముండ్లమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వారం రోజుల క్రితం పురుగుమందు తాగిన తాళ్ళూరు గ్రామానికి చెందిన యువకుడు దుద్దుకూరి ఏడుకొండలు(30) బుధవారం తెల్లవారుజామున గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి అదే రోజు 108లో దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బంధువులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ముండ్లమూరు పోలీసులకు సమాచారం అందటంతో ఏఎస్ఐ ఎన్. వెంకటేశ్వరరెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఏడుకొండలు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.కేసు నమోదు చేసుకొని బంధువులకు అప్పగించారు.





నర్సింగ్.. నై

- విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత
- వైద్య పరికరాల లేమి.. సిబ్బంది అరకొరే
- ఓపీలకు అనుగుణంగా పెరగని వసతులు
- సకాలంలో చికిత్సలు అందక ప్రాణాలు హరీ



చీరాల : ఏరియా వైద్యశాలలో ఫిట్స్‌తో బాధపడుతున్న బాలుడికి చికిత్స చేస్తున్న సిబ్బంది



రేపల్లె: ప్రభుత్వ వైద్యశాలలో పనిచెయ్యని ప్రాణవాయువు ఉత్పత్తికేంద్రం

వైద్య చికిత్సలో నర్సుల పాత్ర ఎంతో కీలకం. చికిత్సలకు ముందు రోగులు, బాధితులకు సేవలు అందించేది నర్సులు. ఇంజక్షన్ల నుంచి గాయాలకు కట్లు కట్టడంతో పాటు శస్త్రచికిత్సల్లో వైద్యులకు సహాయకారిగా ఉండేది నర్సులే. ఇలాంటి నర్సులు కొరత ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొంది. వివిధ విభాగాల్లో ఇతర సిబ్బంది.. పరికరాలు.. అన్నీ ఉన్నా నర్సులు లేకపోవడంతో రోగులకు సరైన చికిత్సలు సక్రమంగా అందడంలేదు. ప్రధానంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రుల్లో కూడా నర్సుల కొరత వెంటాడుతోంది. ఆయా ఆస్పత్రుల్లో నర్సింగ్ చదివే విద్యార్థులతో సరిపెడుతున్నారే కాని నర్సింగ్ సిబ్బంది నియామకంపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. పగలు నర్సింగ్ విద్యార్థులు ఉన్నా రాత్రి వేళల్లో నర్సులు కొరతతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. నర్సుల పోస్టులు భర్తీ చేయాలని లేఖలు రాస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి. ఇక పెరుగుతున్న ఓపీలకు, రోగులకు అనుగుణంగా వసతులు, సౌకర్యాల కల్పనలోనూ ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు కూడా అన్ని విభాగాల్లో లేరని సమాచారం.

బాపట్ల : ఏరియా వైద్యశాలలోని మహిళా వార్డులో రోగులు



(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

పేరుకు అవి పెద్దాస్పత్రులే. ఇక్కడ నర్సులు ఉండరు.. వైద్యులు ఉండరు.. పరికరాలు, సౌకర్యాలు, మందులూ అంతంతే. ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని తట్టుకోలేక పేద, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా ఓపీ రోగులు విపరీతంగా పెరిగిపోతున్నారు. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా చాలా ఆస్పత్రుల్లో నర్సుల నియామకాలు జరగడం లేదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా ఏరియా వైద్యశాలల్లో సౌకర్యాల కల్పనపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో ఇప్పుడు ఆస్పత్రుల్లో రోగులకు కష్టాలు రెట్టింపయ్యాయి. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందడం గగనంగా మారింది. రెండేళ్ల క్రితం వరకు ఏరియా ఆసుపత్రుల్లో 200 వరకు మాత్రమే ఉండే ఓపీల సంఖ్య ప్రస్తుతం అది 400 వరకు చేరుకుంది. కానీ అరకొరగా అవే వైద్య పరికరాలు, చాలీచాలని సిబ్బందితోనే ఇప్పుడు కూడా వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రాంతీయ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగులు తోంది. పల్నాడు, బాపట్ల జిల్లాలుగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా జిల్లా ఆస్పత్రుల ఏర్పాటు ఊసే మరిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడచినా ఏరియా ఆస్పత్రులలో వసతుల కల్పనతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఖాళీల భర్తీపై నిర్మాణాత్మక ప్రకటన ఇప్ప టికీ విడుదలకాలేదు. ఆస్పత్రుల నిర్వహణపై పాలకులకు చిత్తశుద్ధి కొరవ డిందన్న విమర్శలున్నాయి. మొక్కుబడిగా ప్రభుత్వాస్పత్రుల ను నిర్వహిస్తున్నట్లుగా ఇక్కడ నె లకొన్న పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

1 బాపట్ల ఏరియా ఆస్పత్రిలో 100 పడకలకు 120కి మందికి సర్దాల్సి వస్తుంది. 23 మంది వైద్యులకు 20 మంది మాత్రమే ఉన్నారు. స్టాఫ్ నర్సులు 24 మందికి 14 మంది మాత్రమే ఉన్నారు. నర్సింగ్ విద్యార్థులు 15మందిని తీసుకున్నారు. విభాగాల వారీగా వైద్యం అందించే స్పెషలిస్టు వైద్యులే లేరు. నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్ట్ ఒకటి, హెడ్‌నర్సుపోస్టులు నలుగురు ఉండాల్సి ఉండగా ఇక్కడ ఇద్దరు డిప్యూటేషన్‌పై వేమూరు, తెనాలి వెళ్లారు. వెంటిలేటర్ ఉన్నా వైద్యులు లేరు. ఐసీయూ ఉన్నా ఫిజీషియన్ వైద్యుడు ఒక్కరే ఉండడంతో సేవలు అరకొరగానే అందుతున్నాయి. సీటీ, ఎంఆర్ఐ సౌకర్యాలు అందుబాటులో లేవు. అంబులెన్స్‌లేదు. మార్చురీలో రెండే ఫ్రీజర్లు ఉండడంతో మూడో మృతదేహం వస్తే దానిని బయటే ఉంచుతున్నారు.

1 చీరాల ఏరియా వైద్యశాల 100 పడకల ఆసుపత్రి కాగా 12 మంది భద్రతా సిబ్బంది. 23 మంది పారిశుధ్య సిబ్బంది మాత్రమే ఉన్నారు. వైద్యశాలలో ప్రధానంగా ఎముకలు, కీళ్ల, ఆర్ఎంవో, సీఎస్ఎస్ జనరల్ సర్జన్, కంటి వైద్యనిపుణులు, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు సంబంధించి వైద్యుల కొరత ఉంది. ఆస్పత్రిలో 22 వెంటిలేటర్లు, 50కి పైగా ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు ఉన్నాయి. కొవిడ్ నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేయగా వాటిలో కొన్ని పనిచేస్తుండగా, మిగిలిన వాటిని పరీక్షించాల్సిన అవసరం ఉంది. పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపడాల్సిన అవసరంతో పాటు ఇతర సిబ్బంది భర్తీ విషయంలో వేగం చూపాల్సి ఉంది.

1 రేపల్లె ప్రాంతీయ ఆస్పత్రి సమస్యలకు నిలయంగా ఉంది. ఇక్కడ సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. హెడ్ నర్సుల పోస్టులతో పాటు నర్సుల ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. సేవలందిస్తున్న వైద్యుల్లో ఎక్కువ మంది డిప్యూటేషన్‌పై ఉన్నవారే. అత్యవసర వైద్యం కోసం రోగులు గుంటూరు కానీ తెనాలి బాటే పట్టాల్సి వస్తోంది. ప్రైవేటు అంబులెన్స్‌ల్లోనే రోగులను తరలించాల్సి రావడంతో నిరుపేదలకు అది భారంగా తయారైంది. జనరేటర్‌లో డీజిల్‌కు కూడా నిధులు మంజూరు లేక పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రతిసారి రోగులు చీకట్లోనే మగ్గాల్సి వస్తుంది.

- రేపల్లెలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎనిమిదినెలలుగా ప్రాణవాయువు ఉత్పత్తికేంద్రం పనిచేయడంలేదు. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళిన పట్టించుకోలేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. వైద్యశాలలో రోగులకు తగ్గ మందులు అందుబాటులో లేవు. ఉన్న మందులతోనే సరిపెడుతున్నారే తప్పా లేనిమందులను బయట షాపుల్లో కొనుక్కోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

40 వరకు మరణాలు..

సకాలంలో వైద్యం అందకనే గడచిన మూడేళ్లలో బాపట్ల జిల్లా పరిధిలోని ఏరియా ఆస్పత్రుల్లో 40 మంది వరకు చనిపోయినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం తోడు నిపుణులైన వైద్యులు అందుబాటులో లేకపోవడం కూడా పరోక్షంగా వీరి మృతికి కారణంగా ఉంది. రాత్రి పూట ఏరియా ఆస్పత్రులకు వచ్చే రోగుల విషయంలో సిబ్బంది నుంచి కనీస స్పందన కరువవుతుందన్న విమర్శలున్నాయి. విధుల్లో ఉండాల్సిన డాక్టర్లు అందుబాటులో లేకుండా నర్సులతోనే నడిపిస్తున్నారన్న విమర్శ ఉంది. రాత్రి వేళ్లలో అత్యవసర వైద్యం కోసం వచ్చే వారిలో 90 శాతం మందిని గుంటూరుకో, ఒంగోలుకో పంపుతున్నారు తప్ప చికిత్సలు అందిస్తున్న పాపాన పోవడం లేదు. మెరుగైన వైద్యం కోసం తరలించే లోపులోనే ఎక్కువ శాతం మంది ప్రాణాలు విడుస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి వచ్చిన ఓ ఉపాధ్యాయుడు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో కుప్పకూలితే ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వెంటనే గుంటూరుకు రిఫర్ చేయగా మార్గమధ్యలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సకాలంలో వైద్యం అంది ఉంటే ఆయన ప్రాణాలు నిలబడేవని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఏరియా ఆసుపత్రులను వెంటాడుతున్న బాలారిష్టాల వల్ల గోల్డెన్ అవర్‌లో అందాల్సిన వైద్యం అందడం లేదు.

రిజిస్ట్రేషన్లకు గండం

- రైతుల ప్లాట్లకు సీఆర్డీఏ మోకాలడ్డు
- సమీకరణ భూముల్లో అసైన్డ్ ఉంటే అంతే సంగతి
- అధికారుల తీరుపై రాజధాని రైతుల ఆగ్రహం
- నాట్ ట్యాలీడ్ పేరుతో కౌలు ఎగవేతపైనా ఆవేదన

(గుంటూరు- ఆంధ్రజ్యోతి)

ఇలా ఒకరు, ఇద్దరు కాదు నీరుకొండ, కురగల్లు గ్రామాల్లోనే 600 మంది ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ను అధికారులు ఆపేశారు. ఇలా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో వందలాది మంది రైతుల రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేకుండా నిలిపివేశారు. 2015లో భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏటా కౌలు చెల్లించడంతోపాటు రైతులకు గృహ సముదాయం, వాణిజ్య సముదాయం కింద రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించింది. 2019 ఎన్నికలకు ముందు వరకూ ఆ ప్రభుత్వం వారి ప్లాట్లను రిజిస్టర్ చేసింది. అయితే ఎన్నికల నాటికి ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా పక్కనపెట్టింది. గడిచిన ఐదేళ్ల రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. కిందటి ఎన్నికలకు ఏడాది ముందు వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల పేర హడావుడి చేసినా రైతులు మాత్రం ముందుకు రాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే సీఆర్డీఏ అధికారులు

(మిగతా 6వ పేజీలో..)

- నీరుకొండకు చెందిన జొన్నలగడ్డ విష్ణువర్దనరావు ఆరున్నర ఎకరాల పట్టాభూమి, 70 సెంట్లు పొరెస్టు భూమిని ల్యాండ్ భూ సమీకరణ కింద ఇచ్చారు. అతడికి ఫుల్ ప్యాకేజీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అతడి రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. రెండు నెలల నుంచి సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరిగి ఆయన విసిగి వేసారిపోయారు.

- కురగల్లుకు చెందిన మాదల సుజాత అనే మహిళా రైతు ఐదు ఎకరాలు పట్టాభూమి, అర ఎకరం పొరెస్టు భూమిని భూ సమీకరణ కింద ఇచ్చారు. ఆమెకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి సీఆర్డీఏ అధికారులు ఆపుతున్నారు. ఆ రైతులు ఇచ్చిన పట్టా భూముల తాలూకు రిటర్నబుల్ ప్లాట్లను కూడా సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదు.

ఓటర్లలో లింగనిష్పత్తి తేడా ఉంటే సహించం

- ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.సూర్యకుమారి
- పర్చూరు ఈఆర్‌వోకు మెమో జారీ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకుమారి, కలెక్టర్ వెంకటమురళి

బాపట్లనవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాలో లింగనిష్పత్తి తేడా అధికంగా ఉంటే సహించేది లేదని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. సం క్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఈఆర్‌వోలతో, ఎఈఆర్‌వోలతో బుధవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశమయ్యారు. సమావేశంలో సూర్యకుమారి మాట్లాడుతూ పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో లింగనిష్పత్తి సరిగ్గాలేకపోవటం ఏమిటని అధికారులను నిలదీశారు. చీరాల, వేమూరు నియోజకవర్గాలలో బీఎల్‌వోలు సరిగ్గాపనిచేయలేదని గు ర్తించామన్నారు. గైర్హాజరైన పర్చూరు ఈఆర్‌వోకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. మృతుల ఓటర్ల తొలిగింపు చేయకపోవటం ఏమిటని ప్రశ్నించారు? కొత్త ఓటర్లను చేర్పించటం కొరకు అన్ని ప్రాంతాలలో విస్తృతంగా అవ గాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాకు 2.73 లక్షల దరఖాస్తులు వచ్చాయ ని తక్షణమే వాటిని విచారించాలన్నారు. ఆధార్ అను సంధానం ప్రక్రియ కేవలం 84 శాతం ఉండటంపై అస హనం వ్యక్తం చేశారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరగాలంటే ప్రతి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. గడిచిన 8 నెలల్లో 3,163 మంది ఓటర్లు వలసలు వెళ్ళటంపై ఆరా తీశారు. జనవరిలో సవరణ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. నూతనంగా 14,556 మంది దివ్యాంగులకు ఓటు హక్కు కల్పించామన్నారు. అక్టోబరు 27వ తేది నాటికి జిల్లాలో 12,91,065 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వివరించారు. యువతకు ఓటు హక్కు కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మృతుల ఓటర్లపై విచారణ జరిపి తొలిగిస్తామన్నారు. సీఎంవోకి వెళ్ళిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారించాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 26 అర్జీలు పీజీఆర్ఎస్‌లో నమోదు కాగా ఒక్కొక్కటిగా సమీక్షించారు. సీఎం, మంత్రులకు వెళ్ళిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు తహసీల్దార్‌లతో ఆర్డీవోలు సమీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలుపాల్గొన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎం ఎ.జయలక్ష్మి, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎం.మధు, జోనల్ మేనేజర్ కె.మంగాదేవి, పరిశ్రమల శాఖ ఏడీ ఏ సుమధరవాణి, ఐపీవో వి.సురేంద్ర పాల్గొన్నారు.

పంపిణీ చేయకుండానే.. పాడయ్యాయి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించడంతో , ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కొనుగోలు చేసిన ఆ స్వయం ఉపాధి యూనిట్లు నాలుగేళ్ళుగా గోదాములకే పరిమితం అయ్యాయి.....కోట్లాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన ఆ పరికరాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి పోతున్నా, గోదాముల గోడలు కూలి ధ్వంసం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నా ఎస్సీలు, ఎస్టీలు, నా బీసీలు అంటూ నాడు డాంబికాలు పలికిన జగనన్నకు ఆయా యూనిట్లు పంపిణీ చేయాలన్న స్పృహ రాకపోవడంతో నాడు ఎస్సీల స్వయం ఉపాధి కాగితాలకే పరిమితమైన వైనమిది.

- గోదాములకే పరిమితమైన ఎస్సీల స్వయం ఉపాధి యూనిట్లు
- తుప్పు పట్టి, ధ్వంసమైపోతున్నా పట్టించుకోని వైనం
- భారీ సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు
- నాలుగేళ్ళయినా పంపిణీ చేయని ఎస్సీ కార్పొరేషన్



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం పక్కన షెడ్డులో గోడకూలి అద్దాలు ధ్వంసమైన ఆటో



ఎటువంటి రక్షణ లేకుండా ఆరుబయట ఉన్న ట్రాక్టర్లు

గుంటూరు(విద్య), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నాడు టిడిపి ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు చేసింది. ప్రత్యేకించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇప్పించి ఎస్సీ యువత సొంత కాళ్ళపై నిలబడేలా చేశారు. అయితే 2019 తరువాత అధికారంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎస్సీ స్వయం ఉపాధి పథకాల్ని సమాధి చేసింది. అమలు చేసిన ఒకటీ అరా పథకాలు కూడా ఎస్సీలకు చేరలేదు. ఇందుకు ప్రత్యేక్ష నిదర్శనమే గోదాముల్లో మూలుగుతున్న స్వయం ఉపాధి యూనిట్లు. గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం అమలు చేయడంతోపాటు ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు కొనుగోలు చేశారు. అయితే వీటి కొనుగోళ్లలో భారీ మొత్తం కమీషన్ల రూపంలో చేతులు మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆటో రూ.2.50లక్షలు, ట్రాక్టర్ రూ.5.60లక్షలు, మినీ ఎక్సకవేటర్‌కు రూ.10లక్షలు వెచ్చించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో పెద్దమొత్తంలో ఆయా పరికరాలు కొనుగోలు చేశారు. జిల్లాల వారీగా పంపిణీ చేయాలని, వాటిని జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు గోదాములకు తరలించారు. అయితే పంపిణీ చేయక ముందే, ఈ ఆటోల్లో సాంకేతిక సమస్యలు వచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. బ్యాటరీ బ్యాకప్ లేకపోవడం, చార్జింగ్ సమస్యలు తలెత్తాయి. దీంతో కంపెనీలకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో రాలేదు. ఫలితంగా పంపిణీ నిలిచిపోయింది. దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి ఈ యూనిట్లు జిల్లా కేంద్రాల్లో గోదాముల్లో, ఎస్సీ కార్పొరేష్ కార్యాలయాల ఆవరణలో మగ్గుతున్నాయి. ఇందులో కొన్ని ఇప్పటికే ఉపయోగించడానికి వీలులేకుండా పాడైనట్లు సమాచారం. గుంటూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరం పక్కనే ప్రస్తుతం పదుల సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వయం ఉపాధి యూనిట్లు ఎస్సీ యువతకు పంపిణీ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేయించి పంపిణీ చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వ హయాంలో వీటిని కొనుగోలు చేశామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పీ ప్రేమకుమారి "ఆంధ్రజ్యోతి"కి వివరించారు. ఈ ఆటోలు, ట్రాక్టర్స్, ఎక్సవేటర్లు కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ చేయలేదని, వాటికి మరమ్మతులు నిర్వహించి లబ్ధిదారులకు లేదా మున్సిపాల్టీలకు ఇవ్వాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించినట్లు ఈడీ ప్రేమకుమారి తెలిపారు.

7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

- ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న బాపట్లలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గొప్పగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నందున ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా అధికారులతో బుధవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. బాపట్ల పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల తల్లులతో నిర్వహించే ముగ్గుల పోటీలు మహిళా శిశుసంరక్షణ పీడీ కె.ఉమా పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పోటీలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రస్ రిపోర్ట్ కమిటీ కోఆర్డినేటర్‌గా ఇంటర్మీడియట్‌బోర్డు ఆర్ఐవో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజాదెబోరా, ఉద్యానశాఖాధికారి జెన్నెమ్మ, డీపీవో ప్రభాకరరావు, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నంద్యాల మార్గంలో కొన్ని రైళ్లను రద్దు, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి. డిసెంబరు 3 నుంచి 13వ తేదీ వరకు నంబరు 17228 గుంటూరు - డోన్, డిసెంబరు 4 నుంచి 14వ తేదీ వరకు నంబరు 17227 డోన్ - గుంటూరు రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నాయి. డిసెంబరు 6వ తేదీన నంబరు 22883 పూరీ - యశ్వంత్‌పూర్, 7వ తేదీన నంబరు 22884 యశ్వంత్‌పూర్ - పూరీ, డిసెం బరు 4, 11 తేదీల్లో నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్, డిసెంబరు 6, 13 తేదీల్లో నంబరు 22832 యశ్వంత్‌పూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్‌లను నంద్యాల నుంచి దారి మళ్లిస్తారు. నంబరు 17253 గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌ని డిసెంబరు 4 నుంచి 12వరకు 120 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేసి నడుపుతామని రైల్వేవర్గాలు తెలిపాయి.

వర్సిటీలో వికాస ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలకు బుధవారం నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ తెలిపారు. కాగా ఉద్యోగులు ఫ్రెండ్స్ ప్యానెల్‌గా ఏర్పడి నామినేషన్ వేశారు. ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్.ప్రసాద్ (అధ్యక్షుడు), డి.విజయ ప్రకాష్ బాబు (ఉపాధ్యక్షుడు), జె.శ్రీనివాసరావు (కార్యదర్శి), టి.వెంకటేష్, ఎస్.నాగేశ్వరరావు (సంయుక్త కార్యదర్శులు), కె.యేషయ్య (కోశాధికారి), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా.. జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎస్.వెంకటేశ్వర రావు, ఇ. శ్రీనివాస రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, సీహెచ్ ఆనంద్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్. మురళీ మోహన్ తెలిపారు.



కార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయసిబ్బంది

షూటింగ్ బాల్‌లో గౌతమి విద్యార్థుల విజయం

ఇంకొల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో ఈ నెల 23,24,25 తేదీలలో జరిగిన 43వ రాష్ట్ర స్థాయి యు-19 బాలబాలిక షూటింగ్ బాల్ పోటీలలో ఇంకొల్లుకు చెందిన గౌతమి విద్యార్థులు విజయం సాధించారు. గుంటూరు జిల్లా జట్టుపై బాపట్ల జిల్లా జట్టు విజయం సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకోగా, బాపట్ల జట్టు విజయం సాధించడానికి ఇంకొల్లు గౌతమి విద్యార్థి కే కార్తీక్ కారణం కాగా, బుధవారం జరిగిన అభినందన సభలో కార్తీక్‌కు పాఠశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరెక్టరు కాట్రగడ్డ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

1న కార్తీక అమావాస్య పూజలు



వేటపాలెం(చీరాల), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పంచాయతీ పరిధిలో వేంచేసిఉన్న శ్రీ కనక నాగవరప మ్మ అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 1వ తేదీ ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పా త్రులు కావాలని ఆయన కోరారు.

నేడు కార్తీక వన సమారాధన

బల్లికురువ : మండలంలోని అంబడపూ డి దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కార్తీక వన సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా దేవాలయంలో ప్ర త్యేక పూజలు, వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టీడీపీలోకి పలు పార్టీల నాయకులు

» కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యాలయంలో బుధవారం పలు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారి మెడలో టీడీపీ కండువాలు వేసి ఎమ్మెల్యే వారిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి నుంచి టీడీపీలో ఉన్నామని తిరిగి సొంతింటికి వచ్చినట్లుగా ఉందని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, మల్లి రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీకి చెందిన డీ సైమన్, ఎం.అరుణ్ ఉన్నారు.

ఈ-పంట నమోదుపై తనిఖీలు

» జిల్లాలో ఎన్‌ఎస్‌వో బృందం పర్యటన

» పలుచోట్ల పంటల పరిశీలన



ఈపంటను నమోదు చేస్తున్న అధికారి

ఒంగోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఈ పంట నమోదు వాస్తవికతపై కేంద్ర ప్రభుత్వ సంస్థ బృందం తనిఖీలు జరుగుతున్నాయి. జాతీయ శాంపిల్ సర్వే సంస్థకు చెందిన నెల్లూరు, కడప కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్, రామకృష్ణలు జిల్లాలో ఇందుకోసం పర్యటిస్తున్నారు. బుధ, గురు వారాలలో ఈ బృందం స్థానిక వ్యవసాయ ప్రణాళిక శాఖల అధికారులతో కలిసి మూడు మండలాలలోని పలు గ్రామాలలో పరిశీలన చేయాల్సి ఉంది. అందులో బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) సిహెచ్.శ్రీనివాసరావుతో కలిసి ముండ్లమూరు, త్రిపురాంతకం మండలాలలో పర్యటించి ఈ పంట నమోదు పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలు సమయంలో నష్టపోయిన రైతులకు పరిహారం అందజేత ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిత ఎంపిక కోసం ఈ పంట నమోదు కీలకంగా మారిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాయి.

ఓటీపీతో ఈకేవైసీ చేయాలి

నిబంధనల ప్రకారం ప్రతి రైతుకు చెందిన పొలంలో ఏ సర్వే నెంబరులో, ఏ పంట సాగు చేశారన్నది ఫొటోతో సహా వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. అనంతరం సదరు రైతు బయోమెట్రిక్ లేదా సెల్ ఫోన్ నుంచి ఓటీపీ ద్వారా మిగతా ఈకేవైసీ చేయాలి. అలా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 97.80శాతం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదించారు. ఆ సీజన్‌లో 4.99 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి సుమారు 3.93లక్షల ఎకరాలలో పంటలు సాగు చేయగా లక్షా 40వేల మంది రైతులకు చెందిన 3.85లక్షల ఎకరాలకు సంబంధించి ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీ కూడా చేశారు.

పరిశీలనకు అధికారులు

కాగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పంట ఖచ్చితత్వ పరిశీలనను కేంద్రప్రభుత్వానికి చెందిన ఎన్‌ఎస్‌ఓ సంస్థ అధికారులు తనిఖీ చేస్తున్నారు. పంట సాగు చేసిన భూమిలో ఈ పంట నమోదు జరిగిందా లేదా, వేసిన పంటనే నమోదు చేశారా? లేక ఒక పంట వేస్తే మరొక పంట నమోదు చేశారా, అసలు పంట వేయకుండా వేసినట్లు నమోదు చేస్తున్నారా? అన్న అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. అందులోభాగంగా బుధవారం ముండ్లమూరు మండలం వేంపాడు, త్రిపురాంతకం మండలం రాజుపాలెం, త్రిపురాంతకం గ్రామాలలో ఈ పంట నమోదు పరిశీలించారు. గురువారం హెచ్‌ఎంపాడు మండలంలో పరిశీలించి సాయంత్రం ఒంగోలులో వ్యవసాయ, ప్రణాళికాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

రాత్రంతా తాలూకాలోనే..

» విజయ్‌పాల్‌ను గుంటూరు కోర్టులో హాజరు

» సాయుధ బలగాల భద్రత నడుమ తరలింపు

ఒంగోలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను అరెస్టు చేసిన ఎస్పీ దామోదర్ మంగళవారం రాత్రి ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రంతా అక్కడే ఉంచారు. ఉదయం విజయ్‌పాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు నివేదిక ఇచ్చారు. దీంతో గుంటూరు సీఐడీ కోర్టుకు తరలించేందుకు అంతా సిద్ధం చేశారు. తరువాత మధ్యాహ్నం 2.30 తర్వాత తాలూకా సీఐ అజయ్‌కుమార్ నేతృత్వంలో పటిష్ఠ భద్రత నడుమ ఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అక్కడ 11 పేజీల రిమాండ్ రిపోర్టును ఎస్పీ అందజేయగా, 2.45కు గుంటూరుకు బయలుదేరారు. ఒక సీఐ, ఎస్ఐ, ఆర్ఎస్ఐతోపాటు పది మంది సిబ్బంది ఉన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు ఆయుధాలతో ఉన్నారు.

స్టేషన్‌లో చాప, దుప్పటి

విజయ్‌పాల్‌ను మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు అరెస్టు చేసిన తరువాత ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. అక్కడ మొదటి అంతస్తులోని గదిలో పడుకునేందుకు చాప, దుప్పటి, దిండు ఇచ్చారు. భద్రత కోసం ఆరుగురు పోలీసులను నియమించారు. పోలీసు అధికారులు రాత్రి తనిఖీలు నిర్వహించారు. బుధవారం విజయ్‌పాల్‌కు సాధారణ భోజనం ఏర్పాటు చేశారు. ఆయన తన వెంట నిత్యం వినియోగించుకునే మందులు, అదనంగా దుస్తులు ఓ బ్యాగ్‌లో తెచ్చుకున్నారు. గుంటూరు కోర్టులో సాయంత్రం హాజరుపరచగా అక్కడ విజయ్‌పాల్ రిమాండ్ పై వాదనలు జరిగాయి. అనంతరం న్యాయాధికారి వచ్చేనెల 10 వరకు రిమాండ్ విధించారు.

మిర్చిపై తగ్గిన మక్కువ

» వరుస నష్టాలే కారణం

» పెరిగిన పెట్టుబడి, తగ్గిన ధరలతో వెనక్కి

» పొగాకు సాగుపై దృష్టి సారించిన రైతులు

ఇంకొల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాంతంలో గత రెండేళ్లుగా మిర్చి సాగు తగ్గింది. గతంలో ఎటుచూసినా పొలాల్లో మిర్చి కనిపించేది. రైతులు నష్టాలను చవిచూడడంతో మిర్చి సాగుకు దూరమవుతున్నారు. మిర్చి రైతులు శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచినప్పటికీ గిట్టుబాటు ధర రాకపోవడంతో ఈ ఏడాది మిర్చి సాగుపై రైతుకు ఆసక్తి తగ్గింది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధరలు లేకపోవడం ప్రధానకారణమైతే మరోవైపు పెట్టిన పెట్టుబడులకు తగ్గట్టుగా దిగుబడులు రాకపోవడంతో రైతులకు మిర్చి సాగుపై ఆసక్తి తగ్గింది. దీంతో గత ఏడాది పొగాకుకు అంతర్జాతీయంగా మంచి రేటు ఉండడంతో పొగాకు సాగు చేశారు. మంచి లాభాలు పొందారు. అదే ఆలోచనతో ఈ ఏడాది కూడా మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలలో ఒడిదొడుకులు ఉండడంతో మండలంలో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచనలు చేస్తున్నప్పటికీ రైతులు పొగాకుపై మగ్గు చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం కనబడుతోంది.



విస్తారంగా సాగులో ఉన్న పొగాకు అక్కడక్కడా కన్పిస్తున్న మిర్చి



మ్యవరంలోని సాగులో ఉన్న మల్లె తోటలు

మల్లె వాసన కరువే..!

» కనుమరుగవుతున్న సాగు

» కూలీల కొరత, గిట్టుబాటు ధరలు లేక దూరమవుతున్న రైతులు

» నాడు 200 ఎకరాల్లో .. నేడు 20 ఎకరాలకే పరిమితమైన తోటలు

మేదరమెట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అందరికీ సువాసన పంచే మల్లెలు.. రైతులకు మాత్రం లాభాలను పండించలేకపోయాయి. అన్ని శుభ కార్యాల్లో మహిళలు ఎంతో మక్కువతో ధరించే మల్లెలు క్రమేపీ ఈ ప్రాంత కరువవుతున్నాయి. మండలంలోని మల్లె సాగు క్రమేణా కనుమరుగు అవుతున్నది. గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మించక ముందు సుమారు 300 ఎకరాలకు పైగా మల్లె తోటలు సాగు అయ్యేవి. రిజర్వాయర్ నిర్మాణంతో కొంత భూమి ముంపులో పోగా అందులో మల్లెతోటలు కూడా ఉన్నాయి. ఒక్క తమ్మవరం గ్రామంలో దాదాపు 200 ఎకరాలకు పైగా మల్లె తోటలు సాగులో ఉండేవి. ప్రస్తుతం 20ఎకరాల లోపే మల్లె తోటలు సాగులో ఉన్నాయి. ఐదారు సంవత్సరాల నుంచి క్రమేపీ మల్లె సాగును రైతులు తగ్గించుకొని వస్తున్నారు. ఉదయానే మల్లె పూలు కోయడానికి కూలీలు దొరకకపోవడం, అధికంగా పురుగు మందులకు ఖర్చులు పెరగడం, సాగులో ఉన్న మల్లె రకాలు ఎక్కువ సంవత్సరాలు పూలు పండకపోవడం వంటి కారణాలతో రైతులు మల్లె సాగుకు దూరం అవుతున్నారు. వీటి అన్నింటికన్నా దళారులు, మార్కెట్ మాయజాలంతో గిట్టుబాటు ధర లేకపోవడం, దళారులు రైతులకు సొమ్ము ఎగ్గొట్టడం మరో ప్రధాన కారణం. తమ్మవరం చుట్టుపక్కల వివిధ రకాల పరిశ్రమలు రావడం, పెద్ద ఎత్తున గిడ్డంగులు నిర్మించడంతో భూమి పూర్తిగా తగ్గిపోయింది. ఉన్న కొద్దిపాటి భూమిలో రైతులు పాడి సాగుకే మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో మల్లె తోటలు కన్పించవని రైతులు అంటున్నారు.

క్రీస్తు శాంతిసందేశం అందరికీ అనుసరణీయం

ఎమ్మెల్యే కొండయ్య



సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న పోలీసులు

చీరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏసు క్రీస్తు శాంతిసందేశం అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గడియార స్తంభం సెంటర్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదిన వేడుకల్లో భాగంగా నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలు ఐకమత్యం, స్నేహానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు చెప్పిన మాటలు ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. శాంతి, ప్రేమతత్వంను ప్రతి ఒక్క రూ అవర్చుకోవాలన్నారు. పాస్టర్లు క్రీస్తు సువార్త సందేశాన్ని బోధించారు. కొవ్వొత్తులను వెలిగించి క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, పలువురు ప్రముఖులు, ఆరాధకులు పాల్గొన్నారు.

ఎద్దును చంపిన పెద్దపులి

భయాందోళనలో ప్రజలు



ఎద్దు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

కంభం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలోని నల్లమల అడవిలో మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసి చంపిందని ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాజేష్ తెలిపారు. ఫారెస్టు అధికారి రాజేష్ కథనం ప్రకారం, వెలగలపాయ గ్రామానికి చెందిన చెల్లె వెంకట్రావు అనే రైతు సోమవారం తన రెండు ఎద్దులను సమీపంలోని అడవిలోకి మేతకు వదిలాడు. అయితే సాయంత్రానికి రెండు ఎద్దుల్లో ఒక ఎద్దు మాత్రమే ఇంటికి వచ్చింది. రెండో ఎద్దు రాకపోవడంతో మంగళవారం ఉదయం వెతుకుతూ అడవిలోకి వెళ్లాడు. ఉల్లాకులసెల కొండ ప్రాంతంలో ఎద్దు కళేబరం కనిపించింది. దీంతో రైతు వెంకట్రావు ఫారెస్టు బీటు అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన ఫారెస్టు అధికారులు రాజేష్, అబ్దుల్‌గఫార్, రంగారెడ్డిలు ఎద్దు కళేబరాన్ని పరిశీలించి పెద్దపులి దాడి చేసి చంపి ఉంటుందని భావించారు. నిర్ధారణ కోసం ఎద్దు ఆ ప్రాంతంలో కెమెరాలను అమర్చి వెళ్లారు. బుధవారం వచ్చి పరిశీలించగా మంగళవారం రాత్రి ఎద్దు కళేబరం వద్దకు వచ్చిన పెద్దపులి కెమెరాలో రికార్డు అయిందని గమనించారు. ఎద్దు విలువ రూ.80వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. ఫారెస్టు అధికారులు పంచనామా నిర్వహించి రైతుకు నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలో రెండు ఎద్దులపై దాడి చేసిన చంపిన విషయం విదితమే. దీంతో పశువుల కాపరులు తమ పశువులను అడవిలోకి మేతకు వదిలేందుకు భయపడుతున్నారు.

రిజిస్ట్రేషన్లకు గండం

(5వ పేజీ తరువాయి)

సవాలక్ష కొర్రీలు పెట్టి వాటిని రిజిస్టర్ చేయకుండా ఆపుతున్నారు. అసైన్డ్, ఫారెస్టు ల్యాండు వంక రైతులు ఇచ్చిన భూములు పట్టాభూములైతేనే రిజిస్ట్రేషన్ చేస్తామని, అసైన్డ్ భూములు ఉంటే వాటిని చేయమని ఆపారు. కొంతమంది రైతులు పట్టా భూములతోపాటు అసైన్డ్, ఫారెస్టు, సైనికులకు ఇచ్చిన భూములను కూడా ల్యాండ్ పూలింగులో ఇచ్చారు. ఇప్పుడు ఆ వంక పెట్టి వాటి రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు ఆపేశారు. వాటితోపాటు పట్టా భూములు కూడా ఇచ్చి ఉంటే వాటిని కూడా ఆపేశారు. దీంతో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా సీఆర్డీఏ అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా కౌలు బకాయిలు

రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ విచారణ పేరుతో గత ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. అసైన్డ్ రైతుల భూములను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. మొత్తం 1600 మంది రైతుల పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి 1300 మందికి క్లీన్ చిట్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన 1300 మందికి క్లీన్‌చిట్ వస్తుందని, అందరితోపాటు తమకు కౌలు వస్తుందని భావించారు. కానీ అసైన్డ్ రైతుల ఆశ నిరాశగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా వారి భూములు ఇప్పటికీ నాట్ ట్యాలీడ్ జాబితాలోనే ఉన్నాయి. మూడేళ్లుగా కౌలు బకాయిలు అలానే ఉన్నాయి. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారుల తీరును నిరసిస్తున్నారు. సీఐడీ విచారణ పేరుతో కౌలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపైనా వారు ఆగ్రహంతో ఉన్నారు. మంత్రి నారాయణ, నారా లోకేశ్‌లను కలిసి తమ గోడు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో టీడీపీకి చెందిన పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.122.22 కోట్లు విడుదల

ఒంగోలు నగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,86,034 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం జిల్లాకు రూ.122,22,87000ను జిల్లాకు విడుదల చేసింది. డిసెంబర్ నెలకు పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్మును డిసెంబర్ ఒకటో తేదీ సెలవు కావటంతో ఈనెల 30వ తేదీనే ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయం సిబ్బంది పంపిణీని ప్రారంభిస్తారని ఆమె వివరించారు. నవంబరు నెలలో పంపిణీ చేసిన పింఛన్ సొమ్మును తీసుకోని 1283 మందికి ఈనెల 30న రెండు నెలలకు కలిపి అందజేస్తారని తెలిపారు.

శీనారెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

» అక్రమాలపై విచారణకు అంతా సిద్ధం

» డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు

» డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో భారీగా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదుల వెల్లువ

» ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం

» విచారణ చేయాలని ఆదేశాలు

» ఇప్పటికే కొనసాగుతున్న విజిలెన్స్ ఎంక్వయిరీ

» లోకాయుక్తలోనూ నమోదైన కేసు

» తాజాగా కలెక్టర్‌కు మరికొన్ని ఫిర్యాదులు

డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డి అక్రమాలను నిగ్గుతేల్చేందుకు సర్వం సిద్ధమైంది. అతని అవినీతి వ్యవహారాలపై విచారణ ప్రారంభం కానుంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీగా గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కె.శీనారెడ్డి ఆ సమయంలో చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ అన్సారియాకు ప్రభుత్వ ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు అందాయి. దీంతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో ముగ్గురు సీనియర్ అధికారులతో త్రిసభ్య కమిటీని విచారణ కోసం కలెక్టర్ నియమించారు.

ఒంగోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ సంస్థలు, ప్రభుత్వ శాఖలలో అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి సాగించిన అవినీతి, అక్రమాలు ఒక్కొకటిగా వెలుగుచూస్తున్నాయి. ఇటీవల వైద్యశాఖ, డీసీసీబీలలో విచారణ జరగ్గా, ప్రస్తుతం డ్వామా వంతు వచ్చింది. సహకార శాఖకు చెందిన, జిల్లావాసి అయిన శీనారెడ్డి 2019-24 మధ్యకాలంలో దాదాపు నాలుగున్నరేళ్ల పాటు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. అప్పట్లో వైసీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు నెరపుతూ ఒకస్థాయి అధికార పార్టీ నేతలు, చివరకు కొందరు ఎమ్మెల్యేలను సైతం లెక్కపెట్టనంత స్థాయిలో శీనారెడ్డి వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. డ్వామాలో అంతా తానై ఇష్టారీతిన వ్యవహరించి భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడటమే కాక ఒక వర్గం ఉద్యోగులు, సిబ్బందిని వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి.

ప్రకాశం సజ్జల అంటూ..

సాధారణ ఎన్నికలకు ముందు ఆయనను ఎన్నికల కమిషన్ సూచనలతో బదిలీ చేయగా మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుంది.. తానే మళ్లీ పీడీగా వస్తానంటూ డ్వామా కార్యాలయంలో డాంబికాలు కూడా పలికారన్న చర్చ సాగింది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఓట్లు లెక్కింపు అనంతరం ప్రకాశం జిల్లా సజ్జలకు స్వాగతం అంటూ డ్వామా కార్యాలయం వద్ద కొందరు వెటకారంగా బ్యానర్లు కూడా కట్టిన పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలతో శీనారెడ్డి ఏ స్థాయిలో అంటకాగారన్నది ఆ ఘటన తేటతెల్లజేస్తుంది. ఆ విషయం అలా ఉంచితే డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో కింది నుంచి పైస్థాయి వరకు భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఉపాధి పనులలో పెద్దఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగినా, సోషల్ ఆడిట్ బృందాలు వాటిని గుర్తించినా సరే మండల స్థాయిలో నిర్వహించే ప్రజావేదికలలో వాటన్నింటిని రద్దుచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పైగా అక్రమాలకు పాల్పడిన వారికి వెన్నుదన్నుగా నిలిచి తాను కూడా భారీగా లబ్ధిపొందారన్న విమర్శలు వెల్లువెత్తాయి.

సిబ్బందినీ వేధించేవారు

పనిలో పనిగా తనకు గిట్టని శాఖ సిబ్బందిని సస్పెన్షన్లు, డిస్మిస్ చేసి అనంతరం వారి నుంచి లబ్ధిపొంది తిరిగి పోస్టింగులు ఇవ్వడం చేసేవారని సమాచారం. ఇక తన హోదాకు మించి ఆఫీసు వాహనాలు వాడకం, రోస్టర్ పాటించకుండా నియామకాలు ఇతర అనేక అంశాలలో పెద్దఎత్తున అరాచకాలు చేశారని తెలిసింది. కాగా ప్రభుత్వం మారిన తరువాత ఈ అంశాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒంగోలుకు చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్ పలు అంశాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మోహన్ ఫిర్యాదు ఆధారంగా డ్వామాలో శీనారెడ్డి కాలంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని జిల్లా మంత్రి డాక్టర్ స్వామి సంబంధిత శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను గతంలోనే కోరారు.



సీఎం ఫిర్యాదు చేసిన దామచర్ల

అలాగే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఏకంగా సీఎం చంద్రబాబునాయుడుకు శీనారెడ్డి అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేశారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి కూడా ఈదర మోహన్ తీసుకెళ్లడంతో ఆమె కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ఫిర్యాదులుపై విజిలెన్సు విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. ఇక పొదిలికి చెందిన మహిళా న్యాయవాది ఒకరు శీనారెడ్డి పై లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా ప్రస్తుతం విచారణకు వచ్చింది. అలాగే మరో నలుగురైదుగురు ఇతర వ్యక్తులు, డ్వామాలోని కొందరు ఉద్యోగులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పలువురు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా శీనారెడ్డి వ్యవహారాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టిలో పెట్టారు.

సమగ్ర విచారణకు ఆదేశం

ఈ నేపథ్యంలో శీనారెడ్డి కాలంలో డ్వామాలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని నాలుగురోజుల క్రితం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి లేఖ వచ్చింది. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ కోసం కమిటీని నియమించారు. ఇటీవల డీఎల్‌డీవో ఉషారాణి, అలాగే పీడీసీసీ బ్యాంకులో అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావుకు ఆ బాధ్యత అప్పగించారు. ఆయన నేతృత్వంలో మరో ఇద్దరు సీనియర్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని విచారణ కోసం నియమించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ కమిటీ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న పీఆర్ ఏఈ, టీడీపీ నాయకులు

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

చినగంజాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, సోపిరాల గ్రామాల్లో నూతనంగా నిర్మించే సిమెంట్ రోడ్లకు బుధవారం పూజా కార్యక్రమాలను నిర్వహించి, పనులను ప్రారంభించారు. సోపిరాల గ్రామంలో రూ.26.50 లక్షలతో, అంబేడ్కర్‌నగర్‌లో రూ.10లక్షలతో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఏఈ తెలిపారు. వంద శాతం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో రోడ్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య, నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వత రెడ్డి పార్థసారిధి, ఏసోబు, గుత్తేదారుడు ధర్మవరపు ఏసునారాయణ పాల్గొన్నారు.

అద్దంకి పాలిటెక్నిక్‌లో రేపు జాబ్ మేళా

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్ బాబు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐసీఐసీ బ్యాంక్, ఏయూ బ్యాంక్, అపోలో టైర్స్, ఇలాగిరి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరవుతాయని, 100కు పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జీతం విద్యా అర్హతను బట్టి 10వేల నుంచి 20వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ విభాగాలు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు వారి బయోడేటాతో, విద్యార్హత సర్టిఫికెట్‌ల జిరాక్స్, ఆధార్, పాస్‌ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9542970871ని సంప్రదించాలని తెలిపారు.

శ్మశానవాటికలో చేతిపంపు ఏర్పాటు



చేతి పంపును ప్రారంభించిన కాలనీవాసులు

మార్టూరు, నవంబరు 27 : (ఆంధ్రజ్యోతి : గ్రామ పంచాయతీలో ఎస్సీకాలనీకి చెందిన శ్మశానవాటికలో చేతిపంపును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు మేరకు పంచాయతీ నిధులతో చేతిపంపును ఏర్పాటుచేశారు. బుధవారం గ్రామ పెద్దలు, టీడీపీ కార్యకర్తలు చేతిపంపును ప్రారంభించారు కార్యక్రమంలో గొట్టిపాటి వెంకట్రావు, నాగండ్ల తిరుమలరావు, మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా పాల్గొన్నారు.

పెద్దఖానా వద్ద మొబైల్ టాయ్‌లెట్ల ఏర్పాటు



ఎక్స్‌కవేటర్‌తో ఏర్పాటు చేస్తున్న మొబైల్ టాయ్‌లెట్

మార్టూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్లో పెద్ద ఖానా వద్ద మొబైల్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేశారు. పెద్ద క్రేన్ సహాయంతో గతంలో హైదరాబాద్‌లోని ఒక కంపెనీ నుంచి తీసుకువచ్చిన 6 మొబైల్ టాయ్‌లెట్‌లను పెద్దఖానా వద్ద ఏర్పాటు చేశారు. పురుషులకు 3, మహిళలకు 3 టాయ్‌లెట్లను పంచాయతీ నిధులు రూ.10లక్షలతో తీసుకొచ్చారు. పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు మొబైల్ టాయ్‌లెట్‌ల ఏర్పాటుకు పనులు చేయించారు. మరో వారంలో వాటిని ప్రారంభిస్తారని నాయకులు తెలిపారు.



అరికట్లవారిపాలెం, చందలూరు గ్రామాల మధ్య నడిమి వాగుపై కూలిన వంతెన



చిల్లకంప, చెట్లతో ఛిద్రమైన అరికట్లవారిపాలెం చందలూరు రహదారి

వంతెన పునర్‌నిర్మాణం ఎప్పుడో?

- నడిమి వాగుపై కూలిన వైనం
- ఏళ్లుగా నిరీక్షణ
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న రైతులు, కూలీలు

పంగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నడిమి వాగుపై వంతెన కూలడంతో రాకపోకలు సాగించలేక అరికట్లవారిపాలెం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా పునర్ నిర్మాణానికి నోచుకోలేదని గ్రామ రైతులు, మహిళలు వాపోతున్నారు. మండలంలోని అరికట్లవారిపాలెం, చందలూరు గ్రామాల మధ్య కొన్నేళ్ల కిందట తుఫాన్‌తో తలెత్తిన వరద తాకిడికి నడిమి వాగుపై వంతెన కూలిపోయింది. వంతెన కూలడంతో నడిమి వాగుకు అవతలి వైపు ఉన్న పొలాల్లో పంట సాగుకు అరికట్లవారిపాలెం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన ఉన్న సమయంలో కూత వేటు దూరంలో పొలాలకు చేరుకునే రైతులు వంతెన కూలి వాగుకు పెద్ద గండి పడడంతో ఏడెనిమిది కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సిన పరి పరిస్థితి ఏర్పడింది. నిత్యం పొలం పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు వాగుపై వంతె కూలడంతో ఏర్పడిన గండిని దాటి పొలాలకు చేరుకోవడం నరక ప్రాయంగా ఉందని వాపోతున్నారు. చందలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వ్యవసాయ రుణాల కోసం రైతులు, కెనరా బ్యాంక్‌లో కార్యకలాపాల కోసం రాకపోకలు సాగించే పొదుపు సంఘాల మహిళలు చందలూరు చేరుకోవాలంటే పంగులూరు వైపుగా తిరిగి వెళ్లడానికి సరైన వసతి లేక యిబ్బంది పడుతున్నారు. నడిమి వాగుపై వంతెన పునర్ నిర్మించడంతో పాటు చందలూరు, అరికట్లవారిపాలెం గ్రామాల మధ్య చిల్ల కంప తొలగించి రోడ్డుకు తగిన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోమాతల రక్షణ అందరి బాధ్యత

- శ్రీశైల దేవస్థానానికి రూ1,02,516 అందజేత

చీరాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోవుల సంరక్షణ అందరి బాధ్యత అని చీరాల శ్రీభ్రమరాంబికా సేవా సమితి చీరాల ప్రతినిధులు అన్నారు. శ్రీశైల దేవస్థానానికి గో సంరక్షణలో భాగంగా గ్రాసం నిమిత్తం రూ.1,02,516ను దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌ను కలిసి అందజేశారు. అంతేకాకుండా రూ.1.50లక్షల విలువైన 21 గరుకు స్తంభాలను కాళహస్తి గోశాలకు, గో సంచార ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాతలతో పుణ్య కార్యాలు నిర్వహించేటప్పుడు గరుకు స్తంభాలకు వాటితో అదుపు చేసి నిర్వహించేందుకు వెసులుబాటు ఉం టుందనిచెప్పారు. ఈవో సమితి ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ మహాలక్ష్మి, సెక్రటరీ అబ్బరాజు శ్రీనివాస్‌కుమార్, కో-ఆర్డినేటర్స్ సేవకులు పాల్గొన్నారు.



గరుకు స్తంభాల వద్ద ఆవులకు పూజలు నిర్వహిస్తున్న ప్రతినిధులు



ప్రిన్సిపాల్ శేషకుమారిని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రిన్సిపాల్ శేషకుమారికి సన్మానం

పర్చూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారం అందుకున్న పర్చూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శేషకుమారిని బుధవారం బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ద్వారా ఆమె అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా కళాశాల సిబ్బంది పూలమాలలు దుశ్శాలువాలతో శేషకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో రవి కుమార్, బాబూరావు, దీప, ధనలక్ష్మి, కొల్లా హనుమంతురావు, శేషగిరి తదితరులు ఉన్నారు.

'మక్కెనవారిపాలెం చెరువు'కు వేలం

సంతమాగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో 24-25,-26 సంవత్సరానికి సంబంధించి చేపల పెంపకానికి చెరువు వేలం పాటను బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ శివకృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ పాటగా రూ.లక్షా39,000వేల నుంచి ప్రా రంభంకాగా ముగ్గురు పాల్గొన్నారు. మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన నాగుపోతు కొండలు రూ.1,45,000 పాడి క్రైవసం చేసుకున్నారు. సుమారు ఈ చెరువు 8 ఎకరాల 83 సెంట్ల విస్తీర్ణంలో ఉందని కార్యదర్శి నాగార్జున తెలిపారు.

పూల సాగు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పూలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా దీప్తి మాట్లాడుతూ బంతి, చామంతి, రోజా, మల్లె, సంపంగి పూల సాగుకు ఎకరాకు రూ.6400 ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఉద్యాన పంటలలో మల్చింగ్ పేపర్ వేసుకునేందుకు హెక్టారుకు రూ.16వేలు అందిస్తుందని తెలిపారు. 5ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 90శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు రాయితీపై అందిస్తుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. రబీ ఈ పంట నమోదు ప్రారంభం అయిందని రబీలో పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కారక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, అన్నబత్తిన అజయ్ బాబు, యర్రా నరసింహారావు, గ్రామ వ్యవసాయ సహయకులు వీ రేష్, మార్కెట్ కమిటీ అసిస్టెంట్ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



పంగులూరులో రైతులకు సూచనలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు సాగు విధానంలో ఆధునిక పద్ధతులు పాటించాలని మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పంగులూరు, మల్లవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడీఏ రైతులతో కలసి వరి, శనగను పరిశీలించారు. సాగులో సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం సాధించే అవకాశం ఉందన్నారు. రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భాస్వరం ఎరువు ఆఖరి దుక్కిలోనే వేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలను అనుసరించి రసాయణ ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంతో పాటు ప్రకృతిలో లభించే ఆకులు, అలములతో తయారు చేసుకనే జీవామృతం వంటి కషాయాలు పైరుపై పిచికారీ చేసి తెగుళ్ల, పురుగులు నివారించాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి శనగకు ఎకరాకు రూ.54, మొక్కజొన్నకు రూ.105, వరికి రూ.126 చెల్లించి పంటల బీమా చేయాలని, ప్రతి రైతు సాగు చేసిన పంటలను సేవా కేంద్రాలలో నమోదు చేయించాలని సాంకేతిక వ్యవసాయాధికారి వెంకటరమణ కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది అలగ్జాండర్, నవనీతం పాల్గొన్నారు.

మేదరమెట్ల : శనగ, మొక్కజొన్న, వేసే రైతులు తప్పని సరిగా విత్తన శుద్ధిని చేసుకోవాలని ఏవో పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని దైవాలరావూరు, బొల్లవరప్పాడు గ్రామాల్లో పొలపిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో వీఏవో ప్రత్యూష, ఏఎంసీకి చెందిన రమణయ్య పాల్గొన్నారు.

చీరాలటౌన్ : దోమపోటు, ఉల్లికోడు వాటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సుమతి పేర్కొన్నారు. మండల పరిధిలోని విజయనగర్ కాలనీ, ఈపూరుపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు శ్రావ్య అఫియా, ధీరజ్, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

దగ్గుబాడు : రైతులు ప్రత్యామ్నాయ పం టలపై రైతులు దృష్టిసారించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు అన్నారు. కారంచేడు మండలంలోని దగ్గుబాడు, స్వర్ణపాలెం గ్రామాల్లో బుధవారం ఏవో సుధీర్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దగ్గుబాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వైట్‌బర్లీ పొగాకు సాగుకు ప్రత్యామ్నాయం గా శనగ, మినుం, మొక్కజొన్న పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. తద్వారా తక్కువ ఖర్చు, నాణ్యమైన దిగుబడులతోపాటు, భూమి కూడా సారవంతంగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పంట బీమాతో ప్రయోజనం

ఇంకొల్లు : రబీలో వేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని ఇడుపులపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బత్తిని సింగయ్య

రేపటి నుంచి సర్వే

సన్న, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాల సేకరణ

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈనెల 29వ తేదీ నుంచి చిన్న, సన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే జరుగుతుందని, సచివాలయ ఉద్యోగులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సర్వేపై శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ సర్వే ద్వారా పరిశ్రమల ప్రస్తుత స్థితిగతులు తెలుసుకోవడం వాటి అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకోవడం కోసం, వారికి అవసరమైన శిక్షణ, ఇతర సదుపాయాల కల్పన కోసం సర్వే ద్వారా వచ్చిన వివరాలను ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని పరిశ్రమల యజమానులు అందరూ సర్వే సిబ్బందికి సహకరించి అవసరమైన సమాచారం అందించాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం సచివాలయ సిబ్బందికి పరిశ్రమల సర్వేపై శిక్షణ ఇ వ్వడం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు.

వైద్యశాలలో డెలివరీపై కౌన్సెలింగ్

బల్లికురువ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు సిపాయి కాలనీకి చెందిన నిండు గర్భిణికి వైద్యశాలలో చికిత్స చేయించుకోకుండా ఇంటికి రావడంతో బుధవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి, వైద్య సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఆమెకు రక్తహీనత ఉండడంతో ఈ నెల 4వ తేదీన వైద్య సిబ్బంది ఆమెను ఒంగోలు రిమ్స్‌కు డెలివరీ కోసం పంపించారు. ఆమె అక్కడ ఉండడంతో భర్త ఒంగోలు వెళ్లి డెలివరీ అక్కడ చేసేది ఏంటీ అని స్వగ్రామం తీసుకువచ్చారు. ఈ విషయాన్ని గర్భిణి పరిస్థితిని పోలీసుకు వైద్య సిబ్బంది తెలియజేశారు. దీంతో ఎస్సై యువతి ఇంటికి వెళ్లి ఆమె వైద్యశాలలోనే డెలివరీ చేయించుకునేలా భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి వైద్యశాలకు వెళ్లేలా చేశారు. దీంతో గర్భిణిని 104లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ హాజరవుతారని, ప్రధానోపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని, ఎవరికీ మినహాయింపు లేదన్నారు. కాగా సింగిల్ టీచర్స్ ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలు సమావేశానికి హాజరు కావాల్సిన అ వసరం లేదని తెలిపారు. డిసెంబరు 7వ తేదీన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం ఉన్నందున దానికి సన్నాహక సమావేశం గురువారం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఒకటి నుంచి క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని డిసెంబరు 1వ తేదీ నుంచి చినగంజాంలో క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేకల మేషక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్‌నగర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయిస్ అసోసియేషన్, అంబేడ్కర్ యూత్ సభ్యుల సహాయ సహకారాలతో క్రిస్మస్ క్యారల్స్‌ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సండే స్కూల్ చిన్నారులు, యువతీ యువకులతో డిసెంబరు 1వ తేదీ నుంచి తెల్లవారుజాము 4గంటల నుంచి 6గంటల వరకు జరిగే క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని డిసెంబరు 25వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యారల్స్ కార్యక్రమంలో చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలని మేషక్‌బాబు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం (చీరాల), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన పరికరాలను ఏర్పాటు చేయుటకు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ బుధవారం తెలిపారు. దేశాయిపేట, ఆమోదగిరిపట్నం, నీలకంఠపురం, సిలోన్‌కాలనీ, వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఐటీఐ కాలనీ, రామనగర్, మంకెనవారిపాలెం, చిన్నబజార్, లైబ్రరీ రోడ్డు, రెడ్ల బజారు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత



హెచ్‌ఎంకు కుర్చీలు, ఇతర సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలకు కుర్చీలు, ఇతర అవసరమైన సామగ్రిని అందజేశారు. అళహరి వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఆ మె కుమారులు రోటరీ సభ్యులు హరిప్రసాద్ సౌజన్యంతో పట్టణంలోని గాజులపాలెం ప్రాథమిక పాఠశాలకు కుర్చీలు, స్టీల్ వాటర్ క్యాన్, హ్యాండ్ వాష్ బాటిల్స్‌ను పాఠశాల హెచ్‌ఎం కర్నాటి నాగమణికి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, చిన్ని మురళి కృష్ణ, కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలించిన డీఎస్పీ

మార్టూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ జీ రామాంజనేయులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన వివరాలను సీఐ ఎం.శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాటిలో కొన్నింటికి సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. ఇంకా మండలంలో పలు విషయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో డిఎస్పీ కొబ్బరి మొక్కలను నాటారు. తొలుత స్టేషన్‌కు విచ్చేసిన డీఎస్పీకి సీఐ శేషగిరిరావు, సంతమాగులూరు సీఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ జీవీఎస్ చౌదరి, ఎస్ఐ సైదా, ఆధ్వర్యంలో ఏఎస్ఐ బాషాలు, పోలీసు సిబ్బంది గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.


మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న వాడరేవుకు చెందిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద 12మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచుగా దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేరస్థులు తీరు మార్చుకోకుంటే శిక్షలు తప్పవన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
గురువారం 28 నవంబరు 2024



'సోమశిల'లో నీటి నిల్వ



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 4,168 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.368 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 2,500, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



జీజీహెచ్ ఆసుపత్రి వద్ద బైఠాయించిన హిజ్రాలు

కిరాతకం



హత్యకు గురైన హాసిని (ఫైల్)

సహచరులతో కలిసి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని బయలుదేరిన ఓ హిజ్రాను గుర్తుతెలియని వ్యక్తులు మాటువేసి పొట్టన పెట్టుకున్నారు. కారులో వస్తున్న ఆమెను అడ్డగించి, వెంటతెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా నరికారు. ఇంతలో వెనుకనే వస్తున్న హిజ్రాలను చూసి పరారయ్యారు. కొడవలూరు మండలం టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు హాసిని హిజ్రాల నాయకురాలు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం రేపింది. విషయం తెలుసుకున్న వెంటనే నెల్లూరు, కడప, గుంటూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలతోపాటు తమిళనాడు నుంచి భారీ సంఖ్యలో హిజ్రాలు బుధవారం నెల్లూరుకు చేరుకుని తమ నాయకురాలిని పొట్టనపెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించాలని రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావును వేడుకున్నారు. అనంతరం జీజీహెచ్‌లోని హాసిని మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

12



ఇక ఊరూరా
నిఘా నేత్రాలు

జిల్లాలో ఎక్కువ శాతం నేరాలను నిఘా కెమెరాల సాయంతోనే పోలీసులు ఛేదిస్తున్నారు. నేరాల నియంత్రణలోనూ సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటోంది. కెమెరాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో జరిగిన పలు కేసులను ఇప్పటికీ పోలీసులు ఛేదించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో వీటిసంఖ్యను పెంచేందుకు పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానంతో ఇప్పటికే ఉన్న మ్యాట్రిక్స్ కెమెరాలతోపాటు గతంలో దాతలు, వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన కెమెరాలను తిరిగి వినియోగంలోకి తీసుకురానున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో 228 కెమెరాలను ఏర్పాటు చేయగా, రానున్న రోజుల్లో మరిన్ని కెమెరాల ఏర్పాటుకు పోలీసులు దృష్టి సారించారు.

- వివరాలు 6లో



కడలిలో కల్లోలం

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బోగోలు మండల సముద్రతీర ప్రాంతాల్లో బుధవారం అలలు ఎగసి పడుతున్నాయి. మూడు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తున్నా, సముద్రంలో పెద్దగా మార్పు కనిపించలేదని మత్స్యకారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అలల తాకిడి ఉధృతం కావడంతో సముద్రంలో అలజడి పెరిగిందని గంగ పుత్రులు తెలిపారు. సముద్రం కనురుమీద ఉండటం చూసి చేపల వేటకు వెళ్లడం మానుకున్నామన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ బెర్తులకు సుమారు 60కిపైగా బోట్లు చేరుకున్నాయి. వాటిలో జిల్లాకు చెందినవి ఐదుబోట్లు కాగా, మిగిలినవి చెన్నై, ఇతర ప్రాంతాలవి. చెన్నై బోట్లలో పనిచేస్తున్నవారు ఎక్కువమంది జిల్లా మత్స్య కారులు కావడంతో కుటుంబ సభ్యులు వారిని కలుసుకుని భోజన వసతి కల్పించారు.



ఫిషింగ్ హార్బర్‌లో చెన్నై బోట్లు

నేటి నుంచి వర్షాలు

నెల్లూరు (హరనాథపురం) : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో గురువారం నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. జిల్లాలో బుధవారం 7.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు అర్బన్లో 34.8 మి.మీ, అత్యల్పంగా మర్రిపాడులో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఇందుకూరుపేట 34.2, వెంకటాచలం 34.2, ముత్తుకూరు 24.4, నెల్లూరు రూరల్ 24.2, కోవూరు 23.8, టీపీ గూడూరు 18.6, మనుబోలు 17.6, పొదలకూరు 17.2, రాపూరు 12.8, సైదాపురం 11.8, విడవలూరు 19.2, బోగోలు 5.2, బుచ్చి 5, అల్లూరు 4.4, కొడవలూరు, దగదర్తి 3.6, కలువాయి 3.4, చేజర్ల 3.2, సంగం 2, కావలిలో 1.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.



ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో మత్స్య శాఖ, మెరైన్ పోలీసులు

నడిసంద్రంలో నరకం

కాసేపట్లో ఇళ్లకు చేరుతామనుకున్న మత్స్యకారుల ఆనందం ఆవిరైంది. సముద్రంలో వారు ప్రయాణిస్తున్న పడవలోని ఇంజన్ మొరాయించింది. సాయంసంధ్యవేళ చుట్టూ నీరే. ఆపన్నహస్తం అందించే దిక్కు కూడా లేదు. అయినా బిక్కుబిక్కుమంటూ రాత్రంతా నడిసంద్రంలోనే గడిపారు. ఉదయం సమాచారం అందుకున్న మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్ల సహాయంతో అదాని కృష్ణపట్నం పోర్టు ఉన్నతాధికారుల సహాయం కోరారు. పోర్టులోని డాల్ఫిన్ టగ్ బోటును తీసుకెళ్లి సముద్రంలో నిలిచిపోయి ఉన్న పడవను పోర్టుకు తీసుకొచ్చారు. అప్పటిదాకా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు.

3

పక్కాగా సాగునీటి సంఘాల
ఎన్నికలు

- సోమశిల ప్రాజెక్టు ఈఈ మల్లికార్జున

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహిం చేందుకు అధికారులు సిద్ధం కావాల ని సోమశిల ప్రాజెక్టు ఈఈ మల్లికార్జున సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈవోలు, ఏఈవోలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోటీలో నిలిచిన అభ్యర్థి, ఏకగ్రీవంగా ఎంపికైన అభ్యర్థి ప్రకటన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ అంకమ్మరావు, ఏఈలు, తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఈఈ మల్లికార్జున

సింహపురికే తలమానికంగా నిలిచిన ఏసీ సుబ్బారెడ్డి వైద్య విద్య కళాశాల గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. 'అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి.. ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తా'మని హామీలు గుప్పించిన పాలకులు ఆచరణలో చేతులెత్తేశారు. దీంతో ఉన్న అరకొర సౌకర్యాల నడుమే అటు అధ్యాపకులు, ఇటు విద్యార్థులు నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే పేదల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని (జీజీహెచ్) అప్పటి పాలకులు విస్మరించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నా ఇందుకు అవసరమైన వైద్య పరికరాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ వైద్య కళాశాల



వైద్య మిథ్య!

- వైసీపీ హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వీర్యం
- ప్రతిపాదనలు పంపినా నిధులివ్వని వైనం
- రూ.100 కోట్ల హాస్టల్ భవనాలకు మంగళం
- పలు అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం
- జీజీహెచ్‌నూ గాలికి వదిలేశారు!
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

2013లో రూ.350 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ కళాశాలను ఎంతో అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం (2014) కూడా వైద్య కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించింది. ఐదేళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన తోపాటు అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వైద్య కళాశాలను విస్మరించింది. కళాశాల అభివృద్ధికి కళాశాల అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం విడుదల చేయలేదు. చివరకు ఆయుష్మాన్ భారత్ కింద కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 60:40 నిష్పత్తితో నిధులు కేటాయించాల్సి ఉంది. చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు రూ.23 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 40 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నా కేంద్రం ఇచ్చిన నిధులను వైసీపీ సర్కారు పక్కదారి పట్టించిందనే



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

విమర్శలు ఉన్నాయి. కనీసం భవన నిర్మాణం పూర్తి కావస్తున్నా కాంట్రాక్టర్‌కు రూ.8 కోట్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టింది.

రూ.100 కోట్ల ప్రతిపాదనలు రద్దు

ప్రభుత్వ వైద్య కళాశాలలో 175 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, ఇప్పటికి రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇప్పుడున్న భవనాలు కాకుండా విద్యార్థుల కోసం మరో రెండు హాస్టల్ భవనాలు నిర్మించాల్సి ఉంది. అలాగే పీజీ వైద్య విద్య అభ్యసించేందుకు 47 సీట్లను ఎన్ఎంసీ కేటాయించింది. వీరికి తగిన హాస్టల్ భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఆ నిధులు విడుదల చేయడంలో కాలయాపన చేసి చివరకు చేతులెత్తేసింది. దీంతో ఇప్పుడున్న హాస్టల్ గదులు చాలక ఒక్కో గదిలో నలుగురు చొప్పున ఉంటున్నారు. మరోవైపు వైద్య కళాశాలలో అసలు క్రీడా మైదానమే కరువయ్యింది. మైదానం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినా మంజూరు చేసుకోలేదు. ఆడిటోరియం నిర్మాణం కోసం ఆసుపత్రి

- మిగతా 6లో



పనులు చేయకుండా

బిల్లులంటే కుదరదు!

పనులు చేయకుండా బిల్లులు పెట్టుకుందామనుకుంటే కుదరదు.... తూతూమంత్రంగా పనులు చేసి ప్రజాధనాన్ని దోచుకుందామన్న వారి ఆటలు చెల్లవు... ఇకపై చేసిన ప్రతీ పనినీ జియో ట్యాగింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆర్అండ్‌బీ రోడ్లపై ఉన్న గుంతలను, వాటిని పూడ్చాక ఫొటోలను తప్పనిసరిగా రికార్డు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ఇప్పుడు ఆర్అండ్‌బీలో చర్చనీయాంశంగా మారింది.

- రోడ్లపై గుంతలు పూడ్చాల్సిందే
- ఆర్అండ్‌బీలో అక్రమాలకు చెక్ పెట్టిన ప్రభుత్వం
- ప్రతీ గుంతను జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశం
- పనికి ముందు, తర్వాత ఫొటోలు తీసేలా ఉత్తర్వులు
- గతంలో వచ్చిన ఆరోపణలపై చర్యలు

నెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్రామీణ రోడ్ల నుంచి స్టేట్ హైవేస్ వరకూ గుంతలు లేని రోడ్డే లేదంటే అతిశయోక్తి కాదు. నాటి ప్రభుత్వం ఒక్క గుంతనూ పూడ్చిన పాపాన పోలేదు. అయితే అప్పట్లో గుంతలు పూడ్చకుండా మెయింటెనెన్స్ పేరుతో ఏటా గుంతలు పూడ్చినట్లుగా బిల్లులు పెట్టుకొని తినేశారన్న ఆరోపణలున్నాయి. దీని వెనుక నాటి అధికార పార్టీ నేతలు, ఆర్అండ్‌బీ క్షేత్రస్థాయి అధికారులు కుమ్మక్కైనట్లు ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అక్రమాలకు చెక్ పెడుతూ నిబంధనలు కఠినతరం చేసింది.

ప్రతీది ఫొటో ఉండాలి

ఇప్పటి వరకూ అధికారులు పలానా చోట్ల గుంతలు ఉన్నాయని ప్రతిపాదించడం, ఆ తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం, తదనంతరం గుంతలు పూడ్చినట్లు బిల్లులు రికార్డు చేయడం జరుగుతోంది. అయితే నిజంగానే అక్కడ గుంతలు ఉన్నాయా..? వాస్తవంగా గుంతలు పూడ్చారా..? అన్నది ఉన్నతస్థాయిలో తెలిసేది కాదు. క్షేత్రస్థాయి అధికారులు ఇచ్చే నివేదికల మీదనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ, ఇకపై ప్రతీ గుంతను జియో ట్యాగింగ్ చేయాలని ప్రభుత్వం సరికొత్త ఉత్తర్వులు జారీ చేసింది. పనిచేసే ముందు గుంత ఎలా ఉంది..? పని చేశాక రోడ్డు ఎలా ఉంది..? అన్న ఫొటోలు తీయాలని సూచించింది. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే థర్డ్ పార్టీతో విచారణ జరిపిస్తామని కూడా ప్రభుత్వం హెచ్చరించింది. జియో ట్యాగింగ్ చేయడం, పనికి ముందు, తర్వాత ఫొటోలు తీస్తారు కాబట్టి విచారణలో సులభంగా వాస్తవాలు తెలిసిపోతాయి. ఈ విధానంతో పనులు చేయకుండా బిల్లులు పెట్టుకునే వారి అక్రమాలకు బ్రేకులు వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతల రోడ్లను బాగు చేసే పనిలో పడింది. ఇప్పటికే రూ.4.16 కోట్లను గుంతలు పూడ్చేందు కు జిల్లాకు మంజూరు చేయగా తాజాగా మరో రూ.10 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. దాదాపుగా ప్రతీ రోడ్డుపై గుంతలను పూడ్చడమే కాకుండా జంగిల్ క్లియరెన్స్ కోసమూ నిధులిచ్చింది. జనవరి 15లోపు గుంతలన్నింటినీ పూడ్చే విధంగా ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలో గుంతలు పూడ్చే పనులకు ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు ఆహ్వానించి ఉన్నారు. ఆ పనులన్నింటికీ తాజా ఉత్తర్వుల ప్రకారం జియో ట్యాగింగ్ చేసి ఫొటోలు తీయాల్సి ఉంటుంది.

పంటకు బీమా..
రైతన్నకు ధీమా!

- జిల్లాలో ఐదు రకాల పైరుకు వర్తింపు
- వచ్చే నెల 15వ తేదీ గడువు.. వరికి మాత్రం 31 వరకు..

అతి వృష్టి.. అనావృష్టి.. ఏదైనా ప్రకృతి సహకరించక పంటలు దెబ్బతింటే రైతుల బాధలు వర్ణనాతీతం. ఓ వైపు ఆరుగాలం పడిన కష్టానికి ఫలితం లేక మరోవైపు వ్యవసాయానికి చేసిన అప్పులు కర్షకులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తాయి. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం ద్వారా ఈ రబీ సీజన్‌లో వరి, మినుము, శనగలు, పెసర, వేరుశనగ పంటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నారు.

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద దిగుబడి ఆధారంగా జిల్లాలో ఐదు పంటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నారు. వరి పంటను గ్రామం యూనిట్‌గా, మినుము, శనగ పంటలు మండలం యూనిట్‌గా, పెసర, వేరుశనగ పంటలు జిల్లా యూనిట్‌గా పరిగణలోకి తీసుకుంటారు. జిల్లాలో టాటా జీఐసీ ఇన్సురెన్సు కంపెనీ అమలు చేసే ఏజెన్సీగా ఉందని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. పంట రుణాలు తీసుకున్నవారికి బ్యాంకు అధికారులే బీమా వివరాలు నమోదు చేస్తారు. రుణాలు తీసుకోనివారు రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, కామన్ సర్వీస్ సెంటర్లు, మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. మినుము, శనగ, పెసర, వేరుశనగ పంటలకు డిసెంబరు 15వ తేదీ వరకు, వరికి మాత్రం 31వ తేదీ వరకు గడువు ఉంది. ఆధారు కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్, కౌలురైతు గుర్తింపు కార్డు, ఈ-పంట నమోదు, బ్యాంకు ఖాతా నెంబరు పత్రాలు అవసరం.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

పీఎంఎఫ్‌బీవై పథకంలో భాగంగా ఎకరా వరి పంటకు రైతు బీమాగా రూ.168 చెల్లిస్తే ఇన్సురెన్స్ రూ.42వేలు నష్ట పరిహారంగా ఇస్తారు. అదేవిధంగా మినుము ఎకరాకు రూ.38 చెల్లిస్తే 19వేలు, శనగకు రూ.56 చెల్లిస్తే 28వేలు, పెసరకు రూ.36 చెల్లిస్తే 18వేలు, వేరుశనగకు రూ.60 చెల్లిస్తే 30వేలు బీమా ఇవ్వనున్నారు.

గడువులోగా బీమా చేయించుకోవాలి



రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఐదు రకాల పంటలకు ప్రభుత్వం బీమా వర్తింపచేస్తోంది. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకు అధికారులు ప్రీమియం వసూలు చేస్తారు. రుణాలు తీసుకోని రైతులు మాత్రం నిర్దేశించిన గడువులోపు బీమా ప్రీమియం చెల్లించాలి.

- పి.సత్యవాణి, జిల్లావ్యవసాయాధికారి

నీటి వృథా కనిపించదా..?



కొండాపురం వ్యవసాయ శాఖ కార్యాల యం సమీపాన పైపులైను కొద్దిరోజులుగా లీకయి నీరు వృథాగా పోతున్నది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. లీకయిన నీరు రోడ్డుపై నిలిచి బురదమయంగా మారింది. దీంతో అటుగా వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

- కొండాపురం, (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యం వీడారు !



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం మండలం అంకభూపాలపు రం బస్‌షెల్టర్ వద్ద, వలేటివారి పాలెంలోని తేమలేరు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభా లకు అల్లుకున్న పిచ్చి మొక్కల తీగలను బుధవారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. వెంటనే వారు సిబ్బందిని పంపి అల్లుకున్న పిచ్చి మొక్కల తీగలను తొలగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

చివరి మజిలీకి చిక్కులే..!

గ్రామంలోని శ్మశానం లోపలా, బయటా పరిసరాల్లో పెద్దఎత్తున చిల్లచెట్లు, తుప్పలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దహన సంస్కారాల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాక విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక గ్రామంలోని చెత్తాచెదారం తెచ్చి శ్మశానంలోనే వేస్తున్నారని, చనిపోయిన జంతు వుల కళేబరాలను శ్మశానంలోనే వేస్తున్నారని వారు తెలిపారు. ఏళ్ల తరబడి శ్మశానం అభివృద్ధి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



శ్మశానంలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు



నెల్లూరులోని నవాబుపేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ఇక ఊరూరా నిఘా నేత్రాలు

- ఏర్పాటుపై పోలీసుల కసరత్తు
- నెల రోజుల్లో 228 సీసీ కెమెరాల ఏర్పాటు
- పోలీసు కమెండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం

నెల్లూరు (క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాలలోని ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గతంలోనే జిల్లావ్యాప్తంగా 534 మ్యాట్రిక్స్ కెమెరాలు ఉండగా, ఇవన్నీ జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానమై ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో నేరాలు జరిగినప్పుడు సంబంధిత పోలీసు సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తారు. గత ప్రభుత్వ హయాంలో మేట్రిక్స్ కెమెరాలపై పెద్దగా పర్యవేక్షణ లేకపోవడంతో నెల్లూరుతోపాటు పలు ప్రాంతాల్లో ఈ కెమెరాలు దిష్టిబొమ్మల్లా మారాయి. అలాగే, గతంలో వ్యాపారులు, కళాశాల యాజమాన్యం, అపార్ట్‌మెంట్లు, దాతల సహాయంతో ఆయా ప్రాంతాల్లోని దుకాణాలు, విద్యాసంస్థలు, శివారు ప్రాంతాల్లో వందల సంఖ్యల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ కెమెరాల ఫుటేజీలు అవసరమైన ప్పుడు పెన్‌డ్రైవ్‌లో కాపీ చేసుకొని నేరపరిశోధన చేస్తున్నారు. అయితే ఇవన్నీ తక్కువ క్వాలిటీ, తక్కువ మెమొరీ కలిగిన కెమెరాలివి. దీనికితోడు పర్యవేక్షణ లేకపోవడంతో వందల సంఖ్యలో కెమెరాలు పనిచేయడం లేదు.

ఎస్పీ ప్రత్యేక దృష్టి

ఎస్పీగా జి కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లావ్యాప్తంగా ఉన్న నిఘా నేత్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మేట్రిక్స్ కెమెరా లన్నీ పనిచేసేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశిం చారు. అలాగే దాతలు, వ్యాపారు లు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వాటి సంఖ్యను తెలుసుకొని అవన్నీ పనిచేసే లా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులకు సూచించారు. వీటితో పాటు సబ్ డివిజన్ల వారీగా ప్రతి కూడళ్లు, బార్లు, వైన్‌షాపులు, శివారు ప్రాంతాలు, దుకాణాల వద్ద రోడ్డు కనిపించేలా విరివిగా కెమెరాలు ఏర్పాటు చేయించాలని, ఆ కెమెరాల సీసీ ఫుటేజ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు గడిచిన నెల రోజుల్లో నెల్లూరు నగర సబ్ డివిజన్ పరిధిలో 45, నెల్లూరు రూరల్ 88, కావలి 85, కందుకూరు 9, ఆత్మకూరు 3 ఇలా జిల్లావ్యాప్తంగా 228 కెమెరాలను ఏర్పాటు చేశారు. రానున్న నెల రోజుల్లో కొత్తగా 1500లకుపైగా కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు నెలల్లో జిల్లావ్యాప్తంగా..



జిల్లావ్యాప్తంగా సబ్‌డివిజన్ల వారీగా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా అధికా రులకు సూచించాము. అన్ని సీసీ కెమెరాలు పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుం టున్నాము. మరో రెండు నెలల్లో జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాము.

- జి కృష్ణకాంత్, ఎస్పీ

మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయి. నాయకులు, అధికారులు ఇదే విషయాన్ని పదేపదే సభల్లో కూడా ప్రస్తావిస్తూ ఉంటారు. అయితే ఆ లక్ష్యాన్ని నిజం చేసేందుకు ఓ వ్యక్తి నడుం బిగించారు. అర్ధాంగిని దూరం చేసుకున్నా... ఆమె లేని లోటు తీర్చలేనిదని భావించిన ఆయన మహిళా అభ్యున్నతికి ఏదో ఒకటి చేయాలని పరితపించారు. తన సతీమణి పేరుతో ట్రస్ట్‌ను ప్రారంభించారు. ఆ ట్రస్ట్‌లో అధికంగా గృహిణులు చేయగలిగే పనులనే, వారికి నేర్పించాలనే ధ్యేయంతో ముందడుగు వేశారు. తద్వారా వందలాది మంది మహిళలకు చేతివృత్తులు నేర్పుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు దేవిరెడ్డి శారద చారిటబుల్ (డీఎస్ఆర్) ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఆత్మస్థైర్యం నింపుతూ...



కుట్టుమిషన్ శిక్షణలో మహిళలు

- మహిళల అభ్యున్నతికి దేవిరెడ్డి శారద ట్రస్ట్ చేయూత
- చేతివృత్తుల్లో గృహిణులకు శిక్షణ
- ట్రస్టు పేరుతో ఉచిత విద్య, వైద్యం

మారుమూల గ్రామమైన అల్లూరు మండలం పురిణిలో దేవిరెడ్డి సుబ్బరామిరెడ్డి, బుజ్జమ్మలకు రెండవ కుమారుడు సుధాకర్‌రెడ్డి. విద్యాభ్యాసం పూర్తయ్యాక ఏదో సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్ వెళ్లిన ఆయన రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో అడుగు పెట్టారు. వ్యాపారంలో అన్నివిధాలుగా చేదోడువా దోడుగా ఉంటున్న ఆయన భార్య దేవిరెడ్డి శారద అనారోగ్యంతో 2016, ఫిబ్రవరి 26న మృతి చెందారు. పేదవాళ్లకు నేనున్నానంటూ శారద సహాయం అందించేది. భార్య మరణానంతరం ఆమె ఆశయ సాధన కోసం సుధాకర్ రెడ్డి దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అల్లూరు మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా ట్రస్ట్‌ను ఇందుపూరు కాలువ సమీపంలో ఏర్పాటు చేశారు. అక్కడ సుందర భవనాన్ని నిర్మించి, ఉచితంగా విద్య, వైద్యంతోపాటు మధ్యతర గతివారికి అనుకూల ధరతో కల్యాణ వేదికతోపాటు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. వివిధ చేతివృత్తుల్లో గృహిణులకు శిక్షణ ఇస్తున్నారు.



మగ్గం వర్క్ నేర్చుకుంటున్న మహిళలు

చేయూత

మహిళలకు శిక్షణ ఇస్తూ..

అల్లూరు మండలంలో ఆసక్తి కలిగిన మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్యతా శిక్షణను అందిస్తున్నారు. ఇందులో భాగంగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సు, కంప్యూటర్ శిక్షణ, జర్దోసీ, మగ్గం వర్క్, టాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇప్పటికి 198 మందికి టైలరింగ్, 28 మందికి కంప్యూటర్, 60 మందికి జర్దోసి, మగ్గం వర్క్ , 25 మందికి టాలీ కోర్సు శిక్షణ పూర్తి చేసుకొని, సర్టిఫికెట్లు పొందారు. వీరంతా వివిధ చోట్ల వారి నైపుణ్యాన్ని చూపుతూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించి కుట్టుమిషన్లను ఇప్పించింది. 2022లో ప్రారంభమై ట్రస్టు నేడు విజయ పథంలో నడుస్తున్నది. సొంత వాహనాలను ఏర్పాటు చేసి మహిళలను ట్రస్ట్‌కు తీసుకెళ్లే విషయంలో అనేక జాగ్రత్తలను పాటిస్తు న్నారు సుధాకర్‌రెడ్డి. వారు ఎలాంటి అసహనానికి గురి కాకుండా ఉండేలా ఈ ట్రస్ట్ మేనేజ్ మెంటు చూసుకుంటున్నది.

మధ్యతరగతి మహిళలకు చేయూత



ట్రస్ట్ ద్వారా సామాజిక సేవలు అందించడమే కాకుండా మహిళలు ఆర్థికంగా ఎదిగేలా మా చైర్మన్ వివిధ వృత్తుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టి మహిళలకు చేయూత అందించేలా ట్రస్ట్ కృషి చేస్తుంది. మధ్య తరగతి మహిళలకు చేయూతను అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

- ఇందుపూరు అనీల్ కుమార్‌రెడ్డి, సీఈవో, డీఎస్ఆర్ ట్రస్ట్

వివిధ రంగాల్లో అవకాశం



గృహిణులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తే వారి కాళ్లపై వాళ్లు నిలవడమేగాక కుటుంబానికి కూడా ఆదరువుగా ఉంటారు. ఇలా ఆలోచించి గృహిణులు ఇంటి వద్దనే ఉండి చేయగలిగే చేతి వృత్తులను ఎంపిక చేసుకొని శిక్షణ ఇస్తున్నాం. వారు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ట్రస్ట్ పని చేస్తున్నది.

- బండ్ల రామచంద్రరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి

కావలి బీసీ సంక్షేమాధికారిపై విచారణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కావలి అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి కే సుధాకర్‌పై ఐటీడీఏ పీవో పరిమళ బుధవారం తన చాం బర్‌లో విచారణ జరిపారు. సుధాకర్‌పై ఓ వ్యక్తి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అర్జునరావు జిల్లా కలెక్టర్‌ను విచా రణ జరిపి నివేదిక పంపాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఆనంద్ ఐటీడీఏ పీవో ను విచారణాధికారిగా నియమించారు. కావలి అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి పరిధిలోని హాస్టళ్లలో పనిచేసే మహిళలు ఈ విచారణకు హాజరయ్యారు. సుధా కర్‌పై వచ్చిన ఆరోపణలపై వారి నుంచి వివరాలను ఐటీడీఏ పీవో నమోదు చేసుకున్నారు. మంగళవారం కావలి ప్రాంత వార్డెన్లను విచారించిన విషయం విదితమే. నివేదికను కలెక్టర్‌కు అందచేస్తామని పీవో పరిమళ తెలిపారు.



కావలి ప్రాంత హాస్టళ్లలో పనిచేసే మహిళలను విచారిస్తున్న ఐటీడీఏ పీవో పరిమళ

ప్రత్యేక యాప్

పారిశుధ్యం, మంచినీటిపై పర్యవేక్షణకు

- ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం
- జిల్లా పంచాయత అధికారి శ్రీధర్‌రెడ్డి



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు, మంచినీటి సరఫరా పటిష్టం చేసేందుకు జిల్లాలో తొలిసారిగా ప్రత్యేక యాప్‌ను రూపొందించామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఎల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలను ఆయన వివరించారు.

? గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రణాళికలు

! గ్రామాల్లో ఎక్కడైనా పారిశుధ్యం అధ్వానంగా ఉంటే ఏఎన్ఎంలు పరిశీలించి, తెలిపేందుకు తొలిసారిగా ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించాం. దీంతో సమస్యను జిల్లాతో పాటు రాష్ట్ర అధికారులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా పర్యవేక్షణ చేస్తూ పారిశుధ్యాన్ని అభివృద్ధి పరుస్తున్నాం.

? మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ

! జిల్లాలో మంచినీటి పైప్‌లైన్లు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని బాగు చేయడంతోపాటు తాగునీటిలో ప్రతిరోజు క్లోరేషన్, 15 రోజులకోసారి నీటి ట్యాంకులను క్లీన్ చేసేలా చర్యలు చేపడుతున్నాం. వీధిలైట్ల నిర్వహణపై గతంలో ఏర్పాటు చేసిన సంస్థ బకాయిలు ఉందని వెళ్లిపోయింది. దీంతో పంచాయతీ నిధుల ద్వారానే వీధిలైట్ల నిర్వహణ చేపడుతున్నాం.

? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు

! జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ఉండేం దుకు మురుగు తొలగింపు, దోమల నివారణ చర్యలను చేపట్టడంతో పాటు వర్షాల సీజన్ అయినందున ఈ మూడు నెలలు మరింత శ్రద్ధ వహించి జాగ్రత్తలు చేపడుతున్నాం. ఎక్కడా పెద్దగా విషజ్వరాలు విజృంభించిన సంఘటనలు జిల్లాలో లేవు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

? పల్లెల్లో అభివృద్ధి పనులు ఎలా..

! గ్రామాలకు ప్రస్తుతం నిధులు భారీగా వస్తున్నాయి. వీటితోపాటు పల్లెల పండుగ కార్యక్రమానికి సంబంధించి జాతీయ ఉపాధి నిధులు దాదాపు రూ.75 కోట్లమేర రావడంతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు, తాగునీటి ట్యాంకుల మరమ్మతులు, బస్ షెల్టర్లు, పైప్ లైన్ల పనులు జోరుగా సాగుతున్నాయి.

? అవినీతి నిర్మూలనకు చర్యలు

! గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నాం. పనుల వివరాలను ప్రజలు సైతం తెలుసుకునేలా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నాం. పనుల్లో నాణ్యత లోపించినా, పాలనలో అవినీతికి పాల్పడిన వెంటనే చర్యలు చేపడుతున్నాం. ఈ క్రమంలో ఇటీవల ముగ్గురు కార్యదర్శులను సస్పెండ్ చేశాం.

- నెల్లూరు జడ్పీ, (ఆంధ్రజ్యోతి)

వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ విజేతగా జేబీ జట్లు

- ముగిసిన వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు

కావలిటౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ (వీఎస్‌యూ) అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో కావలి జేబీ డిగ్రీ కళాశాల జట్లు సత్తా చాటాయి. పట్టణ పీజీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన పోటీలు బుధవారం ముగిశాయి. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జేబీ జట్లు విజేతలుగా నిలవగా, టగ్ ఆఫ్ వార్‌లో వీఎస్‌యూ నెల్లూరు విజేతగా నిలిచింది. వాలీబాల్ ఫైనల్‌లో జేబీ, కృష్ణచైతన్య (నెల్లూరు) జట్లు తలపడగా, జేబీ విన్నర్‌గా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్ ఫైనల్‌లో జేబీ, వీఎస్‌యూ తలపడగా జేబీ విజేతగా నిలిచింది. టగ్ ఆఫ్ వార్ ఫైనల్‌లో వీఎస్‌యూ నెల్లూరు, వెంకటగిరి ప్రభుత్వ కళాశాల జట్లు తలపడగా వీఎస్‌యూ విజేతగా నిలిచింది. పోటీలకు పీజీ కళాశాల పీడీ మణికంఠ టోర్నమెంట్ కమిటీ సెక్రటరీగా, జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి అబ్జర్వర్‌గా వ్యవహరించారు. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరారెడ్డి పాల్గొని, ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, వన్‌టౌన్ ఎస్ఐ జమాల్‌వలి, హమ్‌రాజ్, పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్‌లో విజేత కప్ అందుకుంటున్న జేబీ కళాశాల జట్టు



బాల్‌బ్యాడ్మింటన్‌లో విజేతగా కప్పు అందుకుంటున్న జేబీ కళాశాల జట్టు

సర్పంచి చెక్ పవర్ రద్దు

చేజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యనమదల గ్రామ పంచాయతీ సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి యల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీచేశారు. పూర్తి వివరాల మేరకు.. యనమదల గ్రామానికి చెందిన బొగ్గల తిరుపతిరెడ్డి గ్రామ సర్పంచి నేటి సుందరయ్య గ్రామంలో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్ నిధులు దుర్వినియోగపరిచాడంటూ జూలై 29వ తేదీన జిల్లా కలెక్టరు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ అనంతరం సమర్పించిన నివేదిక మేరకు తాత్కాలికంగా మూడునెలల పాటు సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా 15 రోజలలోపు లిఖితపూర్వక వివరణ సమర్పించాలని, లేనట్లయితే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చేజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటూరుకండ్రిగ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కలువాయి మండలం వెదనపర్తి గ్రామానికి చెందిన నాదెళ్ళ మస్తానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం అటుగా వస్తున్న ప్రయాణికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇచ్చి పొదలకూరు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు, మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రయివేటు వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

వైద్య మిథ్య!

(5వ పేజీ తరువాయి)

ప్రాంగణంలో స్థలం కూడా కేటాయించారు. కానీ ప్రభుత్వం మంజూరు చేయలేదు.

జీజీహెచ్‌కు పరికరాలేవీ!?

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) 750 పడకలు ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నా ఇందుకు అవసరమైన వైద్య పరికరాలు లేవు. 10 ఆపరేషన్ థియేటర్లకు అవసరమైన పరికరాలు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. ఉదాహరణకు న్యూరోసర్జరీ విభాగంలో ఇద్దరు వైద్యులు ఉండగా, పరికరాలు మాత్రం సమకూర్చలేకపోయారు. అలాగే ఆర్థోపెడిక్ విభాగంలోనూ వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉంది. అత్యవసర మందులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. ఇదిలా ఉంటే పాత భవనాలు కూల్చి కొత్త భవనాలు నిర్మించాల్సి ఉన్నా అవి నేటికీ ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి.

మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం



గత ప్రభుత్వంలో వైద్య కళాశాలలో అవసరాలకు కొన్ని ప్రతిపాదనలు పంపాము. కానీ అనుమతులు రాలేదు. హాస్టల్ భవనాలు పూర్తయితే విద్యా ర్థులకు వెసులుబాటుగా ఉంటుంది. అలాగే ఆడిటోరియం, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక జీజీహెచ్‌లో కొన్ని నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. చిన్న చిన్న పనులు కూడా అవసరం అవుతాయి. వాటిని ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా పూర్తి చేస్తాం. అలాగే వైద్యులు, ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. వీటన్నిటి ప్రతిపాదనలను మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

- డాక్టర్ నాగ రాజమన్నార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల ధర్నా



కందుకూరు డిపో గ్యారేజీ గేటు ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు.డిపో కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీచార్ట్‌లు వేసి మూడేళ్లు పూర్తయినందున కొత్తగా డ్యూటీ ఛార్ట్‌లు వేయాలని, ఆటోల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీవై కొండలు తదితరులు మాట్లాడారు. ధర్నాలో సీసీఎస్ డెలిగేట్ నల్లూరి సుబ్బారావు, యూనియన్ నాయకులు వై. సదానందం, రహంతుల్లా, స్వామి, రవి, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం : ఏఐటీయూసీ



మాట్లాడుతున్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె నాగరాజు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీలో కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, అరియర్స్ బకాయిలు అలాగే ఉన్నాయని, గత ఆరేళ్లుగా యూనిఫామ్ దుస్తులు, సబ్బులు, చమురు, పాదరక్షలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించడంతోపాటు, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు మునీర్‌బాషా, కార్యదర్శులు బెల్లం కొండయ్య, దొమ్మరాజు వాసు, కె నాగేంద్ర, ఉపాధ్యక్షుడు పి కృష్ణయ్య, ట్రెజరర్ చెంచయ్య, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



పెదబ్బీపురంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

ఏఎస్ పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పిడి వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన పెద్దహబీపురం, అనుమసముద్రం గ్రామాల్లోని లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశలలో ఉన్నాయో పరిశీలించారు. 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ గౌసమొద్దీన్, ఏఈ వివేక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఖాదర్‌వలీ, కంప్యూటర్ ఆపరేటర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పని కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి మరణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన వారి జాబ్‌కార్డులు తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరు చేయాలన్నారు. గోకులం షెడ్, హార్టికల్చర్ లక్ష్యాలను అధిగమించాలన్నారు. పనుల వద్ద కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఈసీ సువార్తయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భూమి కేటాయిస్తే ఆందోళన చేస్తాం'

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నవారిచింతల గ్రామంలో ఉదయగిరి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలకు భూమి కేటాయిస్తే ఆందోళన చేపడతామని టీడీపీ నాయకుడు ఏ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కళాశాల యాజమాన్యం గ్రామంలోని సర్వేనెంబర్ 152లో 361.30 ఎకరాల భూమిలో 100 ఎకరాలు తమకు కేటాయించాలని తహసీల్దారు సుభద్రకు విన్నవించారన్నారు. తమ గ్రామంలో అధికంగా పశువుల మేపుకొని జీవనం సాగిస్తున్నారని, భూమిలేని నిరుపేదలూ అధికంగా ఉన్నారన్నారు. ఆ భూమి వారికి కేటాయిస్తే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులంతా కలిసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి సైతం తీసుకెళతామని ఆయన తెలిపారు.

40 మద్యం సీసాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో అనధికారికంగా మద్యం సీసాలు తరలిస్తున్నారని ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణం నుంచి ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణానికి తరలిస్తున్న 40 మద్యం సీసాలతోపాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

బంగారు నగల చోరీపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో బంగారు నగల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాలనీకి చెందిన నగిలి జయరాజ్ అన్న ప్రసాద్ వివాహం వచ్చేనెల 8వ తేదీ జరగనుండగా, అతని స్నేహితుడు శివకేశవతో కలిసి మంగళవారం పెళ్లికార్డులు పంచి ఇంటికొచ్చారు. కాగా, జయరాజ్ నిద్రిస్తున్న సమయంలో అదే కాలనీకి చెందిన ఓ మైనర్ బాలుడు అతని మెడలో ఉన్న బంగారు గొలుసు, వేలికి ఉన్న ఒక ఉంగరాన్ని తీసి మరో ఉంగరాన్ని తీస్తుండగా జయరాజ్ మేల్కొనడంతో మైనర్ బాలుడు వెంటనే తలుపులు వేసి పరారయ్యాడు. దీంతో జయరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి చోరీచేసిన బంగారు నగలు రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఫేక్‌లోన్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండండి

ఉదయగిరి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫేక్ లోన్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాప్స్ రిజర్వు బ్యాంకు ఇండియాచే ధ్రువీకరించబడినవి కావన్నారు. ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే మీ ఫోన్ కాంటాక్ట్స్, ఫోటో డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను తీసుకుంటారన్నారు. లోన్ ఆఫర్‌ను నిరాకరించినా ఖాతాకు నగదు జమ చేసి అధిక వడ్డీ వసూలు చేస్తారన్నారు. నిర్దేశించిన సమయంలో వారికి నగదు చెల్లించకపోతే మిమ్మల్ని పలురకాల ఇబ్బందులు పెడతారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఒకవేళ మీరు మోసపోయినట్లు గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదంటే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

మోటారు సైకిల్ బోల్తా : యువకుడి మృతి

కావలి రూరల్, నవంబరు27: అదుపుతప్పి మోటారు సైకిల్ బోల్తాపడి ఆవులూరి చక్రవర్తి(29) మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి కావలి మండలం కొత్తపల్లి సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన చక్రవర్తి వ్యవసాయంతోపాటు బేల్దారి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. పనినిమిత్తం స్వగ్రామం నుంచి కావలి వస్తుండగా, మార్గమధ్యంలోని సీతమ్మగుంట వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చక్రవర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలున్నారు. చక్రవర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, ఎస్‌ఐ బాజీబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉఫ్... ఉఫ్.. ఇంకెంత కాలం ?

- వంట చేసేందుకు కట్టెల పొయ్యే దిక్కు
- మధ్యాహ్న భోజన నిర్వాహకుల కష్టాలు



ఏపీ మోడల్ స్కూల్‌లో కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న నిర్వాహకులు

సీతారామపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్ లేక నిర్వాహకులు కట్టెల పొయ్యల మీద వంట చేస్తూ అవస్థలు పడుతున్నారు. మండలంలో 34 ప్రాథమిక, 4 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1899 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో కేజీబీవీ పాఠశాల, రెండో మూడో ప్రాథమిక పాఠశాలలు మినహా మిగిలిన ఏ పాఠశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్ లేదు. చేసేదిలేక వంట చేసే నిర్వాహకులు కట్టెలతో పొయ్యమీద వంట చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కట్టెలు తడవడంతో అవి మండక పొగతో ఇబ్బందులు పడడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వంట చేసే సమయంలో పొగ కళ్లలోకి, శరీరంలోకి వెళ్లి శ్వాసకోస వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కరువు

ప్రభుత్వ పాఠశాలల్లోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు భోజనం చేసేందుకు సరైన మౌలిక వసతులు లేవు. చాలాచోట్ల వంటగదులు లేవు. చేసేదిలేక ఆరుబయట భోజనాలు వండుతున్నారు. దీనికితోడు పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు, సకాలంలో బిల్లులు రాకపోవడం, నీటి సమస్య తదితక సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ ఇస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్సిడీపై గ్యాస్ సరఫరా చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు జరపాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల గురించి చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కందుకూరులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నందున నార్త్ బైపాస్‌రోడ్డు ఏర్పాటుచేయాలని, రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరుచేసిన ఉద్యానకళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని, కందుకూరు రూరల్ మండలానికి రామతీర్థం జలాలను అందించే ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు పారిశుధ్యం, తాగునీటి సరఫరా సమస్యలు రాకుండా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్‌లో గ్రామ పంచాయతీల వారీగా ఉన్న నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో లోపాలు రాకుండా చూసుకుని, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఖర్చుచేయాలన్నారు. ప్రతి కార్యక్రమం పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. మండలంలోని రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా తగినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం వ్యవసాయశాఖ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంపీడీవో రత్నజ్యోతి, ఇతర అధికారులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రంకు రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ పూడికతీతను బుధవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన డ్రైనేజీలు పూడిపోవటంతో వర్షాకాలం వర్షపు నీరు రోడ్లపై పారుతున్నాయి. దీంతో రోడ్లన్నీ మురుగు నీటితో కలుషితం కావటమేకాక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంగన్‌వాడీ కార్యకర్త మేకల స్వాతి బుధవారం వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో కే సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వాతి చేసిన కార్యక్రమం మరికొందరికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమం హెచ్‌ఎం జీ. వెంకటరావు, పీ శారదాదేవి, వీవీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చండి

లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత చెరువు కట్టకు వెలుపల వైపు పడ్డ రంధ్రాన్ని పూడ్చాలని రైతులు కోరుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఈ చెరువు కట్టకు అక్కడక్కడ రంధ్రాలు పడుతున్నాయి. దీంతో చెరువు తెగే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రంధ్రాలను పూడ్చాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా వేస్తున్నట్టు ఏఈ షేక్ ఫిరోజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపురం మండలం శాయిపేటలో స్తంభాల ఏర్పాటుతో చినపవని సబ్‌స్టేషన్‌లో సరఫరా నిలిపి వేస్తామన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

- వాహనదారుల అవస్థలు



వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు లింగసముద్రం లోని కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. అడుగులోతు గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ వాహనాలు ఎదురెదురుగా రావాలంటే ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠ్యప్రణాళిక సకాలంలో పూర్తిచేయాలి



అనంతసాగరం భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో

ఉదయగిరి రూరల్, నవం బరు 27(ఆంధ్రజ్యోతి): మండ లంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సకాలంలో పా ఠ్యప్రణాళిక పూర్తిచేసేలా చర్య లు చేపట్టాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధ వారం పట్టణంలోని నార్త్ ప్రాథ మిక పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా విద్యా ర్థుల పఠన, అభ్యసనా సామ ర్థ్యాలను పరిశీలించారు. అనం తరం మధ్యాహ్న భోజనం రుచిచూసి విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మోనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, సలీం పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలను కందుకూరు డిప్యూటీ డీఈవో జానకిరాం బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిచూసి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరా దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల కలిగే అనర్థాలపై గ్రామీణులకు ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని న్యాయవాదులు కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో లోక్ అదాలత్ కోర్టు ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీపీ హరికోటేశ్వరరావు, పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో శారద, సూపర్‌వైజరు ప్రభావతి, న్యాయవాదులు బీ. వెంకటేశ్వర్లు, సులోచన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాలల రక్షణ చట్టాలపై అవగాహన

బిట్రగుంట నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం బాలల రక్షణ చటాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని సౌజన్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సఖి సిబ్బంది, లీగల్ అడ్వైజర్ ప్రశాంతి, సోషల్ కౌన్సిలర్ కమల, కేస్ వర్కర్ సాధన, ప్రిన్సిపాల్ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్స్ వర్సిటీతో ఆర్ఎస్ఆర్ ఒప్పందం

బిట్రగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సంస్థ అయిన క్రేన్స్ వర్సిటీతో బుధవారం బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి తెలిపారు. క్రేన్స్ వర్సిటీ విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ రంగంలో వీఎల్ఎస్ఐ, ఎంబీడెట్ సిస్టమ్స్, ఐవోటీల్లో అత్యాధునిక శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించే వీలుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఈసీఈ విభాగాధిపతి సునీల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కావలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం కావలిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీసీ ఐక్యతాభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్ తెలిపారు. స్థానిక బీసీ ఐక్యతాభవన్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తొలుత ట్రంకురోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ ఐక్యతా భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌రావు, కల్లగుంట్ల యానాదిరావు తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి రూరల్: వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ తీరం దాటే సమయంలో వర్షాలు కురిసే అవకాశముందని, రైతులు శనగ విత్తడం తాత్కాలికంగా నిలిపి వేయాలని మండల వ్యవసాయాధికారి ఎన్ వెంకట సుబ్బారెడ్డి సూచించారు. బుధ వారం మండలంలోని సోమల రేగడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగు లో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. అనంతరం సచివాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి రజని సూచించారు. బుధవారం ఆమె అనుమసముద్రం, పందిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఈవోలు చిరంజీవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● కందుకూరు: మండలంలోని కొండముడుసుపాలెం, కంచరగుంట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వీ రాము ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరినాట్లకి సిద్ధమవుతున్న రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టరు వై. చెన్నకేశవులు, ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ పీ మాధవ, ఉద్యాన సహాయకులు ఎల్. రమాదేవి, వ్యవసాయ సహాయకులు కే శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సాగు పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

- తిరుమలజ్యోతి, మండల వ్యవసాయ అధికారిణి



ఉలవపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన సాగు పద్ధతులపై ఎప్పటికప్పుడు వరి సాగు చేసే రైతులకు రైతుసేవా కేంద్రాలలో శిక్షణ ఇస్తున్నాం. తద్వారా నాణ్యమైన పంట అధిక దిగుబడితోపాటు ఆశించిన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయి.

? మండలంలో ఏటా ఎంతమేరకు వరిసాగు ఉంటుంది.

! విస్తారంగా వర్షాలు పడి చెరువులు నిండితే, 3300 ఎకరాల ఆయకట్టులో వరి సాగులోకి వస్తుంది.

? వరిసాగు రైతుల పరిస్థితి ఏమిటి.

! అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన వర్షాలకు చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రస్తుతం 200 ఎకరాల్లో నాట్లు వేయగా మరో 1000 ఎకరాల్లో నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం చెరువుల్లోని నీరు మూడునాలుగు తడులకే సరిపోతుంది.

? ప్రభుత్వం ద్వారా రైతులకు కలుగుతున్న మేలు ఏమిటి.

! వేరుశనగ రైతులకు 50 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు అందిస్తున్నాం. ఈ-క్రాప్ నమోదు ద్వారా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు, విపత్తుల్లో రైతలకు చెందాల్సిన రాయితీలు అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

1న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయబాలాజీ ఫంక్షన్ హాలులో డిసెంబరు 1న పీడీఎస్‌యూ అర్థశతాబ్ది ఉత్సవం, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్, నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సునీల్, ఎస్కే షారుఖ్ తెలిపారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కందుకూరు టీఆర్ఆర్, కావలి జేబీ కళాశాలల్లో చదివిన విద్యార్థులంతా ఈ మహా సమ్మేళనానికి తరలి వస్తున్నారని తెలిపారు.

30న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఉదయగిరిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులకు శనివారం నగదు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందు శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు, అందుబాటులో లేని వారికి 2వ తేదీన పింఛన్లు అందజేస్తారన్నారు. మండలంలోని మొత్తం 4,839 మంది లబ్ధిదారులకు రూ.2,12,32,500లు నగదు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు అయ్యప్ప పడిపూజ

అనంతసాగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అనంతసాగరంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం జరుగుతుందని గురుస్వామి రాపూరు బాలి రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమంలో మండలంలోని మాలదారులందరూ విజయవంతం చేయాలని కోరారు.

30న సంగం మండల సమావేశం

సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు పద్మావతమ్మ అధ్యక్షతన ఈనెల 30 తేదీ ఉదయం గం. 10-30కు జరుగుతుందని ఎంపీడీవో షాలెట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ జరుగుతుందని ఆమె తెలిపారు. ఎంపీపీ అనుమతితో ఇతర అంశములపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె తెలిపారు.

● ఏఎస్ పేట : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసన్నకుమారి బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, విద్య, వైద్యం, గృహ, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని తెలిపారు.

●అల్లూరు : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రజనీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, తాగునీరు, వైద్యఆరోగ్యం, గ్రామీణ రోడ్లు, ఉపాధిహామీ, రెవెన్యూ, విద్యాశాఖ, వ్యవసాయ, హౌసింగ్, నీటిపారుదల శాఖలపై చర్చించనున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు, హాజరు కావాలని తెలిపారు.